thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 99 | కరీంనగర్ బుధవారం, 18 జూన్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## రైల్వేలో 6,374 పోస్టుల భర్తీకి చర్యలు

న్యూఢిల్లీ : రైల్వేలో ఖాళీగా ఉన్న 6,374 టెక్నీషియన్ పోస్టుల భర్తీకి చర్యలు ప్రారంభమయ్యాయి. సిగ్నల్, టెలికమ్యూనికేషన్ సహా 51 కేటగిరీల్లోని గ్రేడ్-సి పోస్టులు భర్తీ కానున్నాయి. దేశంలోని 17 జోన్లు, ఉత్పాదక యూనిట్లలో ఈ పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ జారీ కానుంది. ప్రస్తుతం పేర్కొన్న పోస్టుల సంఖ్య కన్నా ఇంకా ఎక్కువ ఖాళీలు ఉన్నాయని అధికారవర్గాలు తెలిపాయి. సిగ్నల్, టెలికాం విభాగంలో చివరిసారిగా 2017లో పోస్టుల భర్తీ జరిగింది.

## ఆ ప్రాజెక్టు అద్భుత కట్టడమంటూ రాజేందర్ కితాబు
## సీబీఐ విచారణకు అప్పగించాలంటున్న కిషన్ రెడ్డి, లక్ష్మణ్, అర్వింద్
## ఎన్నికలకు ముందు కాళేశ్వరం ఏటీఎం అన్న మోదీ
## హాట్ టాపిక్ గా మారిన బీజేపీ భిన్న వైఖరి




హైదరాబాద్: కమలం పార్టీలో కాళేశ్వరం ముసలం మొదలైంది. పార్టీ నేతలు భిన్న వైఖరే ఇందుకు కారణమవుతోంది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సమయంలో రాష్ట్రానికి వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందని, కేసీఆర్ కుటుంబానికి ఆ ప్రాజెక్టు ఏటీఎంలా మారిందని, దీనిపై విచారణ జరిపిస్తామని చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయినా కేంద్రం స్పందించలేదు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పీసీ ఘోష్ నేతృత్వంలో కాళేశ్వరం కమిషన్ ఏర్పాటు చేసి జ్యుడీషియల్ ఎంక్వైరీ చేయిస్తోంది. ఈ నేపథ్యంలో అప్పట్లో ఆర్థిక మంత్రిగా పనిచేసిన ప్రస్తుత మల్కాజ్ గిరీ ఎంపీ,బీజేపీ నేత ఈటల రాజేందర్ ను విచారణకు పిలిచింది. ఈ నెల 6న ఈటల రాజేందర్ ను కాళేశ్వరం కమిషన్ విచారణకు పిలిచింది. హాజరైన ఈటల రాజేందర్ కమిషన్ ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. అంతా కేబినెట్ నిర్ణయం ప్రకారమే జరిగిందని, ఇంజినీర్ల సూచన మేరకే కాళేశ్వరం నిర్మించారని చెప్పుకొచ్చారు. బయటికి వచ్చిన తర్వాత కేసీఆర్ నిర్ణయమని మీడియా ముందు చెప్పారు. ఆ తర్వాత రెండు రోజులక్రితం ఓ టీవీ డిబేట్ లో పాల్గొన్న ఈటల తెలంగాణకు కాళేశ్వరం ప్రాజెక్టు అద్భుత వరమని చెప్పుకొచ్చారు. ఈ ప్రాజెక్టు వల్ల భూగర్భ జలాలు పెరిగాయని, వేసవిలో సైతం చెరువులు మత్తళ్ళు దుంకాయని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ప్రజలకు 100 శాతం ఉపయోగం ఉన్నదని తెలిపారు. కాళేశ్వరం ఈ రోజు ఎస్సారెస్పీలో 14.8 లక్షల ఎకరాలకు బావుల్లో ఎలాంటి పూడికలు తీయకుండా చివరి ఆయకట్టుకు నీళ్లు అందించింది అని పేర్కొన్నారు. 'మిడ్‌మానేరు నుంచి అవసరమైతే రివర్స్ పంపింగ్ ద్వారా నిజామాబాద్ నుంచి కరీంనగర్‌కు లిఫ్టు ఇరిగేషన్‌కు నీళ్లు ఇచ్చేందుకు కూడా గ్యారెంటీ ఏర్పడింది.వాగులు పారినయ్. ప్రాణహిత-చేవెళ్ల, మేడిగడ్డ కింద వాగులు, వంకలు పొంగిపొర్లినయి. వందల చెక్‌డ్యాములు కట్టడం వల్ల భూగర్భ జలాలు పెరిగాయి. నేను సాక్ష్యం. నేను 20 ఏండ్లు హుజూరాబాద్ ఎమ్మెల్యేగా చేసిన.కాల్వల పొంటి తిరిగాను. చివరి ఆయకట్టుకు నీళ్లు ఇస్తామని చెప్పాము.. వరంగల్‌కు ఎన్నడూ ఇన్ని నీళ్లు రాలేవు. నల్లగొండకు ఎన్నడూ ఇన్ని నీళ్లు రాలేవు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అయ్యే కరెంట్ బిల్లును పక్కన పెడితే రాష్ట్రానికి ప్రాజెక్టు అద్భుత వరం' అంటూ ఆకాశానికి ఎత్తారు. ఆ తర్వాత కేంద్ర మంత్రి, బీజేపీ స్టేట్ చీఫ్ కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్ రాష్ట్రానికి ఉపయోగం కన్నా నష్టం ఎక్కువగా కలిగించిందని, దీనిపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక ఇచ్చిందని అన్నారు. కమిషన్ పేరుతో కాంగ్రెస్ సర్కారు కాలయాపన చేస్తోందని, కాళేశ్వరం విచారణను సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్ట్ ఫీజిబిలిటీ లేనిదిగా బీజేపీ గతంలోనే చెప్పిందని, ఇప్పుడు కూడా సీబీఐ విచారణ కోరుతున్నామని తెలిపారు. ఈటల చెప్పిన సమాధానాలను ప్రస్తావించగా అది ఆయన స్టాండ్ అని, బీజేపీది కాదని పేర్కొనడం విశేషం.

కాళేశ్వరం కమిషన్ బీజేపీ వైఖరి ఏమిటని ఈటలను అడగలేదంటూ దాట వేశారు. బీజేపీ ఎంపీగా కమిషన్ ఎదుట హాజరు కాలేదని, బీఆర్ఎస్‌లో ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు ఏం జరిగిందో అదే చెప్పారని తెలిపారు. ఇదిలా ఉండగా.. బీజేపీ ఎంపీ డాక్టర్ కే లక్ష్మణ్ , నిజామాబాద్ ఎంపీ అర్వింద్ సైతం కాళేశ్వరం విచారణను సీబీఐకి అప్పగించాలని కోరారు. ముఖ్యమంత్రి మొదలు ఇంజినీర్లు, నిర్మాణ సంస్థల వరకు కుమ్మక్కయి డీపీఆర్ అప్రూవల్ కాకముందే కన్ స్ట్రక్షన్ స్టార్ చేశారని అన్నారు. ఈ ఎత్తిపోతల పథకలో అవినీతిపై కేంద్రానికి లేఖ రాస్తే సీబీఐ వచ్చి ఎంక్వైరీ చేసి బాధ్యులెవరో తేలుస్తుందని అన్నారు. కాళేశ్వరంపై బీజేపీ నేతల భిన్న వైఖరి ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.



## ఆ బాధ్యత కలెక్టర్లదే.. మంత్రి పొంగులేటి కీలక ఆదేశం

తెలంగాణ సమాజంలో భూమి కీలకమైన అంశమని, గత ప్రభుత్వం ధరణి పోర్టల్ వల్ల చేసిన తప్పిదాలతో రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో వందల కుటుంబాలు భూ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నాయని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. భూ భారతి చట్టం ద్వారా ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం చూపాలని మంగళవారం తనను కలిసిన జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కొత్తగా నియమితులైన సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య, సిద్దిపేట కలెక్టర్ హైమావతి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, నిజామాబాద్ కలెక్టర్ వినయకృష్ణారెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ స్పెషల్ సెక్రటరీ రాజీవ్‌గాంధీ హనుమంత్ సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో భూములకు సంబంధించి రైతులు అనుభవించిన కష్టాలకు, బాధలకు విముక్తి కల్పించేలా భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వస్తున్న దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వచ్చే రెండు నెలలు రెవెన్యూశాఖకు అత్యంత కీలకమైనవని, భూ సమస్యల పరిష్కారానికి గడువుగా నిర్ణయించిన ఆగస్టు 15 నాటికి న్యాయబద్ధమైన అన్ని దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన మొదలై ఏడాదిన్నర అవుతుందని, ఎవరూ ఊహించని రీతిలో భూ సమస్యలను పరిష్కరిస్తూ సంక్షేమం అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేస్తున్నామన్నారు. ప్రభుత్వం రూపొందించిన పథకాలను అమలు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించవలసిన బృహత్తర బాధ్యత కలెక్టర్లదేనని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా కలెక్టర్లు పని చేయాలని సూచించారు.




## 'లీడర్'.. ఎవరి కోసం.. కవిత ఫ్యూచర్ ప్లానేనా?


బీఆర్ ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. లీడర్ పేరుతో ఆమె యువతకు ఆహ్వానం పలుకుతున్నారు. రాష్ట్ర స్తాయిలో యువతను రాజకీయాల్లోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనిలో భాగంగా తాజాగా తెలంగాణ యువత, మహిళలకు రాజకీయ శిక్షణ అందించేందుకు తెలంగాణ జాగృతి 'లీడర్' కార్యక్రమాన్ని ఆమె ప్రారంభిం చారు. ఇప్పటి వరకు లేని ఈ కార్యక్రమానికి యువత నుంచి మహిళల నుంచి ఎలాంటి స్పందన వస్తుందనేది చూడాలి. అయితే.. ఈ కార్యక్రమం వెనుక చాలా పెద్ద వ్యూహమే కవిత రచించి ఉంటారని తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో ఆమె ప్రారంభించారు. అయితే..త్వరలోనే దీనిని జిల్లాల స్థాయికి కూడా తీసుకువెళ్లనున్నట్టు కవిత చెప్పుకొచ్చారు. ఈ శిక్షణలో భాగంగా ప్రశ్నించే తత్వాన్ని, రాజకీయాలను కూడా యువతకు నేర్పనున్నారు. వాస్తవానికి బీఆర్ ఎస్ తరఫున ఈ కార్యక్రమాన్ని చేపట్టడం లేదు. కేవలం కవిత నేతృత్వంలోని జాగృతి తరఫునే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇటీవల కాలంలో ఆమె బీఆర్ ఎస్ నాయకత్వంపై ఎదురు దాడి చేస్తుండడం.. ఆమె తండ్రి మాజీ సీఎం కేసీఆర్ ను దేవుడు అనడం.. ఆయన చుట్టూ దెయ్యాలు ఉన్నాయని చెప్పడం తెలిసిందే.

ఈ క్రమంలో ఆమె బీఆర్ ఎస్ జెండాను పక్కన పెట్టి జాగృతి పతకాన్ని ధరిస్తుండడం.. కార్యకర్తలు, నాయకులను కలిసినప్పుడు కూడా ఇదే పంథాలో ముందుకు సాగుతుండడం వంటివి ఆమె కొత్త అజెండాకు ఏదో పునాదులు వేస్తున్నారన్న చర్చకు బలాన్నిచేకూరుస్తున్నాయి.

అయితే.. దీనిపై స్పష్టత లేకపోయినా.. ప్రస్తుతం చేపట్టిన లీడర్ కార్యక్రమం ద్వారా తన సైన్యాన్ని ఆమె స్వయంగా తీర్చిదిద్దుకుంటున్నారన్న చర్చ అయితే రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఇలా చేయడం ద్వారా కవిత భవితను రూపొందించుకుంటున్నారని కూడా పరిశీలకులు చెబుతున్నారు. మరి ఇది నిజంగానే ఆమెకు బలాన్ని చేకూరుస్తుందా? లేక.. వ్యూహం ఏంటి? అనేది చూడాలి. ఏదేమైనా.. కవిత ప్రారంభించిన లీడర్ కార్యక్రమం ఏమేరకు సక్సెస్ అవుతుందో కూడా చూడాలి.


## బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం సంచలనం..
## నేడు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్

హైదరాబాద్ : తెలంగాణకు గోదావరి జలాల వ్యవహారంలో అన్యాయం చేసేలా ఏపీ ప్రభుత్వం చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే పలుమార్లు లేఖలు రాసిన తెలంగాణ ప్రభుత్వం తాజాగా ఈ ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చేందుకు సిద్ధమైంది. రేపు 18వ తేదీన బుధవారం సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ సచివాలయంలోని అఖిలపక్ష సమావేశానికి గోదావరిరి బనకచర్ల ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వనున్నట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌తోపాటు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ, ఎంఐఎం లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు లేఖలు పంపి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వయంగా ఫోన్ చేసి ఆహ్వానం పలికారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి - బనకచర్ల ప్రాజెక్టుపై ప్రదర్శన - చర్చ తెలంగాణలోని అన్ని పార్టీల పార్లమెంటు సభ్యుల నుంచి సూచనలు ఆహ్వానిస్తామని ఉత్తమ్ కుమార్ తెలిపారు.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి బనకచర్ల ప్రాజెక్టును నిర్మించాలని ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్ట్ 1980 నాటి గోదావరి జల వివాద ట్రిబ్యునల్ అవార్డు, ఆంధ్రప్ర దేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014ను ఉల్లంఘించినట్లు కనిపిస్తోం దని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఊహించిన విధంగా ఈ ప్రాజెక్ట్ తెలంగాణ ప్రజల నీటి హక్కులను ప్రతికూలంగా ప్రభావితం చేస్తోందని చెప్పారు. గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఇప్పటికే భారత ప్రభుత్వానికి లేఖలు రాశానని వెల్లడించారు. గోదావరి-బనకచర్ల లింక్ పథకంపై మేం అభ్యంతరాలను తిరస్కరించాలని తెలుపుతూ కేంద్ర జల శక్తి మంత్రి గోల్డ్ మన్‌కు లేఖ రాశామని తెలిపారు. పై అంశాలను దృష్టిలో ఉంచుకుని తదుపరి చర్యలు తీసుకోవడానికి జూన్ 18న సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయంలోని నీటి పారుదల శాఖ కార్యాలయంలో జరిగే సమావేశంలో పార్లమెంటు సభ్యులందరి అభిప్రాయాలు/సూచనలను తీసుకోవాలని ప్రతిపాదించినట్లు మంత్రి కార్యాలయం ప్రకటించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ రాకముందే
# బీఆర్ఎస్ - కాంగ్రెస్ ఫైట్ ..?




హైదరాబాద్ : తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో జరగనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మొన్న స్పష్టం చేశారు. జూన్ నెలాఖరులోగా ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని చెప్పారు. నిన్న సీఎం రేవంత్‌రెడ్డి సైతం మంత్రులతో ఈ విషయంలో సుదీర్ఘంగా చర్చించి, రానున్న క్యాబినెట్ మీటింగ్‌లో ఫైనెల్ డెసిషన్ తీసుకునే విధంగా కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముందుగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు, అనంతరం సర్పంచ్ మరియు మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే అవకాశాలు మెంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు ఆఆ ంచసతు కొన్ని కీలక సూచనలు చేస్తూ వస్తున్నారు.

ఎన్నికలకు మరో రెండు వారాలే మిగిలినందున, కాంగ్రెస్ శ్రేణులు పూర్తిగా సిద్ధంగా ఉండాలని పిలుపునిస్తున్నారు. గెలిచే అవకాశమున్న అభ్యర్థులను పార్టీ ఎంచుకుంటుందని, చిన్నపాటి లోటుపాట్లను సరిదిద్దుకుంటూ ప్రజల్లోకి సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను తీసుకెళ్లే బాధ్యతను అన్ని స్థాయిల నేతలు తీసుకోవాలని సూచిస్తున్నారు. రైతులకు సంబంధించిన రైతు భరోసా నిధులు, సన్నాలపై ప్రకటించిన రూ.500 బోనస్ కూడా ప్రజల్లోకి తీసుకుని పోవాలని సూచిస్తున్నారు. మరోవైపు బీసీ రిజర్వేషన్లపై స్పష్టత లేకుండానే ఎన్నికలకు వెళ్లడంపై బీఆర్ఎస్ తీవ్రంగా స్పందించింది. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. కులగణన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందని విమర్శించారు. కేంద్రానికి బిల్లులు పంపి చేతులు దులుపుకోవడం కాకుండా, బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు ప్రాధాన్యత లేని పదవులు కట్టబెట్టి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఇదే అంశంపై ఇటీవల మంత్రి సీతక్క వ్యాఖ్యలు కూడా చర్చకు దారి తీసాయి. అయితే తాను షెడ్యూల్ వచ్చేస్తుందని చెప్పలేదని, త్వరలో ఎన్నికలు జరుగుతాయని మాత్రమే వ్యాఖ్యానించానని ఆమె వివరణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఈ నెలాఖరులో ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశంపై ఆసక్తి నెలకొంది.



# కుటుంబ సమేతంగా సీఎంను కలిసి.. కృతజ్ఞతలు తెలిపిన మంత్రి వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్: మంత్రి వివేక్ వెంకటస్వామి కుటుంబ సమేతంగా సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. సీఎం రేవంత్ రెడ్డి దంపతులకు వివేక్ వెంకటస్వామి దంపతులు శాలువా కప్పి సత్కరించారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి కేబినెట్?లో అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎంతో మంత్రి వివేక్ వెంకటస్వామి ముచ్చటించారు. సీఎం కూడా కాకా వెంకటస్వామితో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణతో పలు విషయాలను సీఎం రేవంత్ రెడ్డి పంచుకున్నారు. రాష్ట్ర ఎకానమీకి అత్యంత కీలకమైన మైనింగ్ శాఖ బాధ్యతలను మంత్రి వివేక్ వెంకటస్వామికి సీఎం రేవంత్ రెడ్డి కేటాయించిన సంగతి తెలిసిందే. గనుల ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంతో పాటు కార్మికుల సంక్షేమం, ఉపాధి, శిక్షణ కార్యక్రమాల నిర్వహణ లాంటి కీలక బాధ్యతలు ఆయనకు అప్పగించారు. వివేక్?కు ఉన్న అనుభవం, రాజకీయ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ శాఖలను కేటాయించారు. గతంలో వివేక్ తండ్రి దివంగత గడ్డం వెంకటస్వామి (కాకా) కూడా1978-1982 మధ్య ఉమ్మడి ఏపీలో కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారు. కేంద్రంలోనూ కార్మిక మంత్రిత్వ శాఖను నిర్వహించారు. వివేక్ అన్న గడ్డం వినోద్ కూడా ఉమ్మడి ఏపీలో వైఎస్ హయాంలో 2004 నుంచి 2009 వరకు కార్మిక శాఖ మంత్రిగా పని చేశారు. ఇలా వివేక్ కుటుంబానికి కార్మికులతో సుదీర్ఘ అనుబంధం ఉన్న నేపథ్యంలో ఆయనకు దీనితోపాటు ఉపాధి, మైనింగ్ శాఖలు నిర్వహించే అవకాశం దక్కింది.



# ఎంపీలతో సమావేశం ఏర్పాటు చేస్తున్నాం

## బనకచర్ల వ్యవహారం.. జూన్ 18న తెలంగాణ ఎంపీలతో సమావేశం: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్: గోదావరి-బనకచర్ల లింక్‌ప్రాజెక్టు విషయంలో తదుపరి అనుసరించాల్సిన కార్యాచరణ కోసం తెలంగాణ ఎంపీలతో రాష్ట్ర ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేసింది. బుధవారం సాయంత్రం 4 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని, రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను గౌరవ అతిథులుగా ఆహ్వానించినట్లు చెప్పారు. కాంగ్రెస్‌తోపాటు భాజపా, భారాస, మజ్లిస్ పార్టీలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలకు లేఖలు రాయడంతోపాటు స్వయంగా ఫోన్ చేసిన ఆహ్వానించామని తెలిపారు. "ట్రైబ్యునల్, చట్టాలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం చేపట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వానికి అభ్యంతరాలు తెలిపాం. సీఎం రేవంత్‌రెడ్డి, నేను లేఖలు రాశాం. జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కూడా కలిశాం. ఏపీ ప్రతిపాదిస్తున్న ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రజల నీటి హక్కులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం కేంద్ర జల సంఘం వద్ద ఉన్న గోదావరి-బనకచర్ల ప్రీఫీజిబిలిటీ నివేదికను తిరస్కరించాలని కోరాం. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని తదుపరి కార్యాచరణ తీసుకోవడానికి గురువారం ఎంపీలతో సమావేశమై అందరి అభిప్రాయాలు తీసుకోవాలని నిర్ణయించాం"అని ఉత్తమ్ తెలిపారు.

## ఎంత డిమాండ్ ఉన్నా అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేశాం: భట్టి విక్రమార్క

భూపాలపల్లి: సమస్యలు ఉన్నవారు రాజధాని వరకు రాలేరని, ప్రజల సమస్యలను స్థానికంగా పరిష్కరించే వాళ్లు ఉండటం గొప్ప విషయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. భూపాలపల్లి జిల్లాలో పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి పర్యటించిన భట్టి విక్రమార్క పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంటు ఉండదని గత పాలకులు దుష్ప్రచారం చేశారు.



ఈ ఏడాది మార్చిలో గరిష్ఠంగా 17,162 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఏర్పడింది. ఎంత డిమాండ్ ఉన్నప్పటికీ అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేశాం. నిరంతరాయ విద్యుత్ సరఫరాకు కృషి చేసిన అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు. 29 లక్షల పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. సాగుకు ఉచిత విద్యుత్ కోసం రూ.11,500 కోట్లు కేటాయించాం. పేదల ఇళ్లకు గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. గృహజ్యోతి, ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ కోసం ఏటా రూ.13వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నాం. 1 కోటి 49లక్షల 35వేల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా వేస్తున్నాం"అని భట్టి తెలిపారు.




## ఆహార నాణ్యతలో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు!: మంత్రి జూపల్లి

హైదరాబాద్ : ఆహార నాణ్యతలో ప్రమాణాలు పాటించాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. హైదరాబాద్ బేగంపేట టూరిజం ప్లాజా హోటల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెస్టారెంట్ అంతా కలియ తిరుగుతూ ఆహార పదార్థాలను, వంటగదిని పరిశీలించారు. అల్పాహారం తీసుకుంటున్న పర్యాటకులు, అతిథులతో మాట్లాడిన ఆయన.. ఆహార నాణ్యత, రుచి గురించి ఆరా తీశారు.

అనంతరం అధికారులతో మాట్లాడారు. ఆహార నాణ్యతలో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యాటకులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత హోటల్స్ నిర్వాహకులపై ఉందని స్పష్టం చేశారు.



# భారతీయులు టెహ్రాన్‌ను తక్షణమే వీడండి



# పశ్చిమాసియా వ్యాప్తంగా ఎయిర్‌పోర్టుల మూసివేత

ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధం తీవ్రమవుతున్న నేపథ్యంలో పశ్చిమాసియా దేశాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. పశ్చిమాసియాలోని పలు దేశాల్లో గగనతలాలపై ఆంక్షలు విధించారు. ఇజ్రాయెల్ భారీ క్షిపణి దాడులకు పాల్పడుతుండడంతో ఇరాన్ తమ గగనతలాన్ని పూర్తిగా మూసివేసింది. లెబనాన్, జోర్డాన్, ఇరాక్‌లోనూ విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. పశ్చిమాసియా వ్యాప్తంగా ఎయిర్‌పోర్టులు మూతపడటంతో వేలాది మంది ప్రయాణికులు అక్కడే చిక్కుకోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 10వేలకు పైగా ప్రయాణికులు ఇరాన్ సహా పశ్చిమాసియాలోని పలు ప్రాంతాల్లో చిక్కుకుపోయినట్లు ఓ రిటైర్డ్ పైలట్, విమానయాన భద్రతా నిపుణుడు జాన్ కాక్స్ పేర్కొన్నారు. శుక్రవారం ఇరాన్ టెహ్రాన్ శివార్లలో ఉన్న దేశంలోని ప్రధాన ఖొమేని అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాలను నిలిపివేసింది. శనివారం ఇజ్రాయెల్ టెహ్రాన్‌లోని మెహ్రాబాద్ విమానాశ్రయంపై బాంబు దాడులు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇజ్రాయెల్ సైతం తమ దేశంలోని అత్యంత కీలకమైన బెన్ గురియన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మూసివేసింది. దీనివల్ల 50వేల మందికి పైగా ఇజ్రాయెల్ ప్రయాణికులు విదేశాలలో చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. ఇరాన్ దాడులు కొనసాగుతుండడంతో దేశంలోని మూడు విమానయాన సంస్థల విమానాలను లార్నాకాకు తరలించారు. ఇజ్రాయెల్ ప్రజలు జోర్డాన్, ఈజిప్ట్‌తో ఉన్న సరిహద్దుల ద్వారా దేశం విడిచి వెళ్లొద్దని ఆ దేశ ప్రధాని నెతన్యాహు ఆదేశాలు జారీ చేశారు. ఆ ప్రదేశాల్లో ముప్పు పొంచి ఉండే అవకాశం ఉందని హెచ్చరించారు. లెబనాన్, జోర్డాన్‌లలో గగనతలం ఇప్పటికీ పాక్షికంగా తెరిచి ఉన్నప్పటికీ, విమానాశ్రయాలలో పరిస్థితి గందరగోళంగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. చాలా విమానాలు రద్దు కావడంతో స్థానికంగా, ఇతర దేశాల్లో చాలామంది ప్రజలు చిక్కుకుపోయారని తెలిపారు. ఇరాన్‌లో భారత్ సహా ఇతర దేశాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు, పౌరులు ఉన్నారు. అక్కడి నుంచి భారతీయులను తరలించేందుకు భారత ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. అందులో భాగంగా 100 మందితో కూడిన మొదటి బ్యాచ్ ఇప్పటికే టెహ్రాన్ నుంచి బయల్దేరింది. ప్రస్తుతం అక్కడ సుమారుగా 10 వేల మంది భారతీయులు ఉన్నారని.. అందులో ఆరువేల మంది వరకు విద్యార్థులేనని తెలుస్తోంది. ప్రస్తుతం గగనతలం మూసివేసినందున.. భూసరిహద్దుల మీదుగా తీసుకెళ్లొచ్చని ఇరాన్ విదేశీ మంత్రిత్వశాఖ వెల్లడించింది. దీంతో ఆర్మేనియా, అజర్‌బైజాన్, తుర్కమెనిస్థాన్, అఫ్ఘానిస్థాన్ మీదుగా భారత్‌కు తరలించనున్నారు.



# ఫోన్ ట్యాపింగ్ బాధ్యులకు శిక్ష పడాల్సిందే!

## గతంలో కాంగ్రెస్ ఓడిపోవడానికి ఫోన్ల ట్యాపింగే కారణం: మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్: గత ప్రభుత్వం తమ ఫోన్‌లను ట్యాప్ చేసినట్లు అనుమానం రావడంతోనే సీఎస్‌కు ఫిర్యాదు చేసినట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణకు ఆయన హాజరయ్యారు. ఈ కేసులో సాక్షిగా ఆయన తన వాంగ్మూలం ఇచ్చారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "టెలిగ్రాఫ్ చట్టానికి తూట్లు పొడుస్తూ మా ఫోన్లను ట్యాప్ చేశారు. రాజకీయ నాయకుల ఫోన్లు ట్యాప్ చేయడం హేయమైన చర్య. ఈ చర్యకు పాల్పడిన కేసీఆర్, కేటీఆర్ సిగ్గుతో తలవంచుకోవాలి. రాజకీయాల్లో భారాస నేతలే ఉండాలనే దురుద్దేశంతో మా ఫోన్లు ట్యాప్ చేశారు. గతంలో కాంగ్రెస్ ఓడిపోవడానికి ఫోన్ల ట్యాపింగే కారణమని తెలుస్తోంది. రేవంత్ రెడ్డితో పాటు నా ఫోన్ కూడా ట్యాప్ చేసి మా కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఇదే ఫిర్యాదును గతంలోనూ చేశాను. ఇవాళ వాస్తవాలు బయటకు వచ్చాయి. చట్టానికి వ్యతిరేకంగా అనేకమంది ఫోన్లను ట్యాప్ చేశారు. 2022 నుంచి సీనియర్ కాంగ్రెస్ నాయకుల ఫోన్లు ట్యాపింగ్‌లో ఉన్నాయి. సిట్ దర్యాప్తులో 650 మంది కాంగ్రెస్ నాయకుల పేర్లు జాబితాలో ఉన్నాయని తెలిసింది" "కుంభం అనిల్ కుమార్ యాదవ్, గాలి అనిల్‌తోపాటు అనేకమంది ఫోన్లు ట్యాప్ అయినట్లు బయటికి వచ్చింది. ఇవన్నీ చూస్తుంటే, నాడు ఏ రకంగా అధికారాన్ని దుర్వినియోగం చేసి దుశ్చర్యకు పాల్పడ్డారో అర్థమవుతోంది. ప్రజాస్వామ్యంలో నిక్కచ్చిగా పనిచేయాల్సిన అధికారులు.. రాజకీయ నాయకులకు తలొగ్గి అడుగులకు మడుగులొత్తారు. ప్రైవసీ అనేది మా ప్రాథమిక హక్కు.. దానిని కాలరాశారు. పదవీ విరమణ చేసిన ప్రభాకర్‌రావును దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పెట్టారు. నక్సలైట్లకు సానుభూతిపరులుగా ఉన్నారని మమ్మల్ని ట్యాప్ చేయడం సిగ్గుచేటు. కేటీఆర్ సిగ్గుతో తల దించుకోవాలి" "ఆనాడు మా ఫోన్లు ట్యాప్ చేసి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నం చేశారు. దానికి మీరు శిక్షార్హులు. భవిష్యత్తులో ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి దుశ్చర్యకు పాల్పడకుండా ఉండాలంటే వీరికి శిక్ష పడాల్సిందే. ఇలాంటి దిగజారుడు పనికి ఒడిగట్టిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు కూడా శిక్ష పడాలి. సజావుగా విచారణ జరిపి... రాజకీయ నాయకులైనా, అధికారులైనా... బాధ్యులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం" అని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.

## కేంద్రంపై ఒత్తిడి తెస్తేనే బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం: ఎమ్మెల్సీ కవిత

మెదక్: కేంద్రంపై ఒత్తిడి తెస్తేనే బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం లభిస్తుందని భారాస ఎమ్మెల్సీ కవిత అన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధనకు మెదక్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు ఆమోదం కోసం జులై 17న రైల్ రోకో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

"42 శాతం రిజర్వేషన్ల కోసం బీసీలు ప్రశ్నించకుంటే తీవ్రనష్టం జరుగుతుంది. విద్య, ఉద్యోగాలు, రాజకీయాలకు వేర్వేరుగా బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టాలి. పోరాడితే బీసీ బిడ్డల కాళ్ల వద్దకే పదవులు వస్తాయి"అని కవిత అన్నారు.



## పాడి కౌశిక్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా



హైదరాబాద్: భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ వాయిదా పడింది. సుబేదారి పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఆయన పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసుపై తదుపరి విచారణను ఈ నెల 23కు కోర్టు వాయిదా వేసింది. అంతవరకు అరెస్టు చేయకుండా రక్షణ కల్పించాలని కౌశిక్ రెడ్డి కోరారు. ఆయన అభ్యర్థనను హైకోర్టు నిరాకరించింది. కమలాపురం మండలం వంగపల్లిలో గ్రానైట్ వ్యాపారి మనోజ్ క్వారీ నిర్వహిస్తున్నారు. రూ.50 లక్షలు ఇవ్వాలంటూ తమను కౌశిక్‌రెడ్డి బెదిరించారంటూ మనోజ్ భార్య ఉమాదేవి ఫిర్యాదు చేశారు. దీంతో సుబేదారి పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.


## టెహ్రాన్‌ను తక్షణమే వీడండి: భారతీయులకు ఎంబసీ తాజా అడ్వైజరీ

టెహ్రాన్: ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియా రగులుతోంది. ఇజ్రాయెల్ జరుపుతున్న పేలుళ్లతో టెహ్రాన్ నగరం దద్దరిల్లుతోంది. ఈ నేపథ్యంలో అక్కడి భారతీయ పౌరులను ఉద్దేశిస్తూ మన ఎంబసీ తాజా అడ్వైజరీ జారీ చేసింది. తక్షణమే ఆ నగరాన్ని వీడి వెళ్లాలని సూచించింది. "టెహ్రాన్‌లోని భారతీయులు, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులందరూ తమ తమ సొంత మార్గాల్లో నగరాన్ని వీడండి. టెహ్రాన్ వెలుపల సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోండి. ఇప్పటివరకు భారత ఎంబసీని సంప్రదించని భారతీయులు వెంటనే దౌత్యాధికారులతో కాంటాక్ట్ అవ్వండి. మీరు ఉంటున్న లొకేషన్లు, మొబైల్ నంబర్లను వారితో పంచుకోండి" అని ఇరాన్‌లోని భారత ఎంబసీ తమ అడ్వైజరీలో వెల్లడించింది. టెహ్రాన్‌ను ఖాళీ చేయాలని ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. దీంతో ఇరాన్‌పై దాడులు మరింత తీవ్రమయ్యే సంకేతాలు కన్పిస్తున్నాయి. నేరుగా అమెరికా యుద్ధ రంగంలోకి దిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ ఈ ప్రకటన చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే కెనడా పర్యటనను అర్ధంతరంగా ముగించుకుని అమెరికా అధ్యక్షుడు తిరుగు ప్రయాణమయ్యారు. వచ్చీరాగానే సిట్యుయేషన్ రూమ్‌లో భద్రతా సలహాదారులతో భేటీ కానున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలోనే భారత ఎంబసీ తాజా అడ్వైజరీ జారీ చేసింది. మరోవైపు.. చైనా, సౌదీ అరేబియా వంటి దేశాలు కూడా ఇరాన్‌లోని తమ పౌరులకు హెచ్చరికలు చేశాయి. వెంటనే టెహ్రాన్ నుంచి వెళ్లిపోవాలని సూచించాయి. అటు ఇజ్రాయెల్‌లోని చైనీయులు కూడా అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని బీజింగ్ అడ్వైజరీ జారీ చేసింది.

చురకలు



# మాక్సిం గోర్కీ: సామాజిక చైతన్యానికి కలం పట్టిన మహాశిల్పి - జూన్ 18...మాక్సిం గోర్కీ వర్ధంతి



రష్యా విప్లవ సాహిత్యానికి శిల్పి, కార్మిక వర్గపు మౌనమైన ధ్వనికి శబ్దరూపం ఇచ్చిన గొప్ప రచయిత మాక్సిం గోర్కీ. ఆయన అసలు పేరు అలెక్సీ మక్సిమోవిచ్ పేష్కోవ్. 1868 మార్చి 28న నీజ్నీ నోవ్గోరోడ్ పట్టణంలో జన్మించిన గోర్కీ, 1936 జూన్ 18న మాస్కోలో మరణించాడు. తన రచనల ద్వారా సామాజిక వాస్తవికతకు (%ూశీఱఎఱaశ్రీ =ఱaశ్రీఱంఎ%) స్థాపకుడిగా నిలిచిన గోర్కీ, అంతర్జాతీయ స్థాయిలో సాహిత్యానికి, విప్లవాలకు ఒక ధ్రువ తారగా మారాడు. బాల్యం నుంచి ఎదురైన కష్టాలే ఆయన రచనా శక్తికి మూల పునాది. తల్లిదండ్రులను చిన్న వయసులో కోల్పోయి అనాథుడిగా మిగిలిన గోర్కీ ఎన్నో కష్టాలు తలపడి, వివిధ పని వర్గాల్లో పనిచేస్తూ జీవితాన్ని అనుభవించాడు. యాచకుడిగా, ముద్రణ కార్మికుడిగా, నౌకల్లో సహాయకుడిగా ఎన్నో జీవన పాత్రలు పోషిస్తూ, సమాజంలోని అట్టడుగు వర్గాల జీవితాన్ని దగ్గరగా గమనించాడు. ఇదే అనుభవ సంపత్తి అతని రచనలకు జీవన వివేకాన్ని అందించింది.1892లో "మకార్ చుద్రా" కథతో రచనా ప్రస్థానాన్ని ప్రారంభించిన గోర్కీ అనంతరం అనేక నవలలు, నాటకాలు, కథలు, వ్యాసాలు రచించాడు. వాటిలో ముఖ్యమైనవి ం "అమ్మ" (1906), "నా బాల్యం", "నా విశ్వవిద్యాలయాలు", "ది లోయర్ డెప్త్స్", తదితర రచనలు. "అమ్మ" నవల ప్రపంచ విప్లవ సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిన కావ్యం. ఒక కార్మికుడి తల్లి, తన కొడుకు విప్లవ మార్గంలో పయనించడాన్ని చూసి, తానూ ఆ ఉద్యమంలో భాగమవడం అనే ఇతివృత్తం ద్వారా విప్లవ భావజాలాన్ని గుండెల్లో నాటుతుంది. ఈ నవల లెనిన్ చేత మెచ్చుకో బడింది. ప్రపంచ వ్యాప్తంగా అనేక భాషల్లో అనువాదమైంది, తెలుగులోనూ విస్తృత ప్రచారం పొందింది. The Lower Depths నాటకంలో గోర్కీ, పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న వర్గాల జీవితాన్ని నిర్మొహమాటంగా చిత్రించాడు. మానవ అశక్తి, ఆశ, నిరాశలను గాఢంగా దర్శించిన ఈ నాటకం, తాత్వికతకు చేరువైన వాస్తవిక చిత్రణగా నిలుస్తుంది. "నా బాల్యం", "నా విశ్వవిద్యాలయాలు" వంటి స్వీయ చరిత్రాత్మక రచనలు గోర్కీ జీవితాన్ని అక్షర రూపంలో చెరిపి వేయకుండా నిలిపే ప్రయత్నంగా పేర్కొనవచ్చు. రచయిత గానే కాక, రాజకీయ చింతన కారుడిగా గోర్కీ ప్రభావం విశేషం. సోషలిస్ట్ భావజాలాన్ని సమర్థించిన గోర్కీ బోల్షెవిక్ విప్లవానికి మద్దతు తెలిపాడు. లెనిన్‌తో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నా, కొంతకాలం స్టాలిన్ విధానాలను విమర్శించాడు. కానీ తరువాత అధికారంతో మెలగడం ప్రారంభించాడు. ఈ మార్పు ఆయన వ్యాపకమైన విప్లవ ఆత్మ చింతనకు సంకేతంగా మారింది. గోర్కీ రచనలు కాలాతీతమైన సామాజిక సందేశాల ప్రతి రూపాలు. వాస్తవికత, మానవతా స్పర్శ, శ్రమ జీవుల జీవన పోరాటాలే ఆయన సాహిత్య శైలికి మూలాధారాలు. సోవియట్ యూనియన్‌లో ఆయన పేరు మీద నగరాలు, వర్సిటీలు, సంస్థలు స్థాపింప బడ్డాయి. ప్రపంచ వ్యాప్తంగా విప్లవ కారులకు, సామాజిక సంస్కర్తలకు ఆయన రచనలు ప్రేరణగా నిలిచాయి. గోర్కీ జీవితం మనకు ఒక మూల సందేశాన్ని అందిస్తుంది ం సాహిత్యం వినోదానికి మాత్రమే కాదు, సమాజాన్ని మేల్కొలిపే శక్తిగా నిలవాలన్నది మౌలమైన రచయిత ధర్మం. దుఃఖాల దారుల్లో నడిచి వెలుగును దారిచూపిన ఆయన జీవితమే ఈ ధర్మానికి ప్రత్యక్ష సాక్ష్యం. అన్యాయానికి ఎదిరించిన కళాన్ని, సమాజ మార్పుకు శబ్దాన్ని అందించిన కళాన్ని గోర్కీ కలం మలిచింది. అలాంటి కలం నుంచి జారిన ప్రతి అక్షరం ం సమాజపు మార్పు కోసం శ్రమజీవుల గుండె చప్పుళ్ళ ప్రతిధ్వనిగా మారింది. మాక్సిం గోర్కీ రచనలు యుగయుగాలకూ సామాజిక సమరానికి శబ్దరూపంగా నిలుస్తాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# జన గణన : 2027 ఎన్నికలకు కౌంట్ డౌన్ ?



దేశంలో ఎన్నికలకు గట్టిగా రెండున్నరేళ్లు మాత్రమే గడువు ఉందా. ఎన్నికలు 2027 నవంబర్ లేదా డిసెంబర్ లో జరుగుతాయా. సాధారణ ఎన్నికలకు ఏణ్ణర్థం ముందే ప్రస్తుత పార్లమెంట్ రద్దు అయి ఎన్నికలకు సిద్ధపడతారా ఇత్యాది ప్రశ్నలు అన్నీ వస్తున్నాయి. దాదాపుగా పదహారేళ్ళ తరువాత దేశంలో జన గణన స్టార్ట్ అయింది. దానిని సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ ని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సోమవారం రిలీజ్ చేశారు. దేశంలో చివరి సారిగా 2011లో జన గణన జరిగింది. విధానం ప్రకారం అయితే 2021లో జరగాలి. కానీ కరోనా మంచి పీక్స్ లో ఉండడంతో దానిని వాయిదా వేశారు. అయితే 2022 నాటికి కరోనా తగ్గుముఖం పట్టింది. కానీ జన గణనకు మాత్రం ముహూర్తం ఇపుడే కుదిరింది. ఇక 2027 మార్చి 1 నాటికి దేశంలో జనాభా లెక్కల ప్రక్రియను పూర్తి చేయనున్నారు. ఈ జనాభా లెక్కలతో పాటే కుల గణనను కూడా నిర్వహిస్తారు. ఆ విధంగా చూస్తే దేశంలో బీసీలు ఎంతమంది బడుగులు బలహీనులు అణగారిన వర్గాలు ఎంతమంది అన్న డేటా కూడా పూర్తి స్థాయిలో వచ్చేస్తుంది. దానిని బట్టి దేశంలో పార్లమెంట్ నియోజకవర్గాల పెంపు రిజర్వేషన్లు అన్నీ మారుతాయని అంటున్నారు. మరో వైపు చూస్తే 2024 ఎన్నికల ముందే మహిళా బిల్లుని పార్లమెంట్ ఆమోదించింది. దాంతో వచ్చే ఎన్నికలలో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేస్తామని ఆనాడు కేంద్ర ప్రభుత్వ పెద్దలు చెప్పారు. దాని ప్రకారం చూస్తే షెడ్యూల్ ప్రకారం 2029లో ఎన్నికలు జరిగినా లేక 2027 చివరిలో జరిగినా కూడా ఈసారి మహిళలకు 33 శాతం రిజర్వేషన్లతో ఈ ఎన్నికలు నిర్వహిస్తారని అంటున్నారు. ఇక జనాభా కచ్చితంగా మరో ఇరవై నుంచి ముప్పయి కోట్ల దాకా ఈ పదహారేళ్ళ కాలంలో పెరుగుతుందని అంటున్నారు ఇలా పెరిగిన జనాభాను ప్రాతిపదికగా తీసుకుని పార్లమెంట్ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ చేపడతారు. అదే జరిగితే కనుక ఉత్తరాదిన అత్యధిక సీట్లు పెరుగుతాయి. ముఖ్యంగా యూపీ బీహార్ వంటి చోట్ల అత్యధికంగా ఎంపీ సీట్లు ఉంటాయని అంటున్నారు. దాంతో పాటుగా మహిళా రిజర్వేషన్లు చేస్తే ఈ లోక్ సభలో వారి సంఖ్య మూడవ వంతుకు పెరుగుతుంది. ఇవన్నీ కూడా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి రాజకీయంగా లాభించేవే అని అంటున్నారు. ఆ విధంగా జన గణన కుల గణన మహిళా రిజర్వేషన్లు అన్నీ చూసుకుని ఎంపీ సీట్లు పెంపు చేసి 2027 చివరిలో కానీ 2028 ప్రథమార్థంలో కానీ ఎన్నికలకు బీజేపీ వెళ్తుందని ప్రచారం సాగుతోంది. అందుకే ఒక పద్ధతి ప్రకారమే జన గణన, కుల గణనకు బీజేపీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది అని అంటున్నారు. ఈసారి ఎన్నికలు షెడ్యూల్ ప్రకారం 2029 లో జరిగే అవకాశాలు తక్కువే అని అంటున్నారు. బీజేపీ వ్యూహాలు చూస్తే అదే నిజం అనిపిస్తోంది అని అంటున్నారు. దాంతో దేశంలో పార్లమెంట్ ఎన్నికలకు గట్టిగా చూస్తే మూడేళ్ళ కంటే తక్కువ సమయమే ఉంది అని అంతా భావిస్తున్నారు. నాలుగవ సారి వరసగా అధికారంలోకి రావడానికి బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు లో భాగమే ఇదంతా అని అంటున్నారు. బీజేపీ తన చేతిలో ఉన్న అధికారాన్ని అవకాశాలను వాడుకుంటూ మరోసారి పగ్గాలు చేపట్టేం దుకు చూస్తోంది అని అంటున్నారు. మొత్తం మీద ఈసారి ఎన్నికల్లో గెలవడమే కాదు పూర్తి మెజారిటీని అత్యధిక సీట్లను సాధించాలని బీజేపీ చూస్తోంది. ఉత్తరాదిన ఎంపీ సీట్లు పెరిగితే కచ్చితంగా బీజేపీకే మేలు అన అంచనా కూడా ఉంది. అలాగే మహిళా రిజర్వేషన్ అమలు చేయడం ద్వారా కూడా బీజేపీ మార్క్ పాలిటిక్స్ చూపిస్తుందని చెబుతున్నారు. మరి దీనికి తట్టుకునేలా ప్రత్యర్ధి శిబిరం వ్యూహాలు ఉ న్నాయా అన్నదే ఇపుడు కీలకమైన మౌలికమైన ప్రశ్నగా ముందుకు వస్తోంది. ఆ దిశగా తాము కూడా సన్నద్ధం కావాల్సిన అవసరం అనివార్యత అయితే ఇండియా కూటమికి ఉన్నాయని అంటున్నారు.




ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య మొదలైన యుద్ధం తీవ్ర రూపం దాలుస్తుండటంతో చమురు ధరలకు రెక్కలొచ్చాయి. ఇక ఈ పోరు ఇతర గల్ఫ్ దేశాలకు కూడా వ్యాపిస్తే మాత్రం ప్రపంచ ఇంధనానికి జీవనాడి లాంటి ఓ జలసంధి మూతపడే ప్రమాదం ఉంది. కేవలం కొన్ని కిలోమీటర్ల వెడల్పున్న ఈ ప్రదేశం నుంచి ప్రపంచం వాడే చమురులో ఐదో వంతు రవాణా అవుతుందంటే దాని ప్రాముఖ్యత అర్థం చేసుకోవచ్చు. అదే హర్మూజ్ జలసంధి.

**ఇరుకైన జలసంధి..** అరేబియా సముద్రంలో ఒమన్‌కు చెందిన ముసాండం ద్వీపకల్పం-ఇరాన్ మధ్య ఉన్న అత్యంత ఇరుకైన జలసంధి ఇది. దీనిలో ఓ చోట అత్యంత ఇరుకుగా కేవలం 33 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఇరు దేశాలు ఇందులో అత్యధిక భాగం తమదే అని చెబుతున్నాయి. దీనిలో రెండు షిప్పింగ్ లేన్లు ఉన్నాయి. ఇందులో వెరీలార్జ్ క్రూడ్ క్యారియర్లు సులువుగా ప్రయాణించగలుగుతాయి. దీనిలో ఒమన్ తీరం నుంచి నౌకలు పర్షియన్ గల్ఫ్‌లోకి ప్రవేశిస్తాయి. చమురును నింపుకొని ఇరాన్ సమీపం నుంచి హర్మూజ్‌ను దాటి బయటకు వస్తాయి.

**చమురు వ్యాపారానికి జీవనాడి..** ఈ మార్గం నుంచి నిత్యం 2 కోట్ల పీపాల చమురు వివిధ దేశాలకు వెళుతుంది. ఇది మొత్తం ప్రపంచం వినియోగించే దానిలో ఐదో వంతుకు సమానం. సౌదీ, ఇరాన్, యూఏఈ, కువైట్, ఇరాక్‌ల నుంచి ఎగుమతి అవుతోంది. ఇక లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ రవాణాకు కూడా అత్యంత కీలకం. మూడింట ఒక వంతు ఎల్ఎన్‌జీ కూడా ఇక్కడి నుంచే వివిధ దేశాలకు చేరుతుంది. దీనిలో అత్యధికం ఖతార్ ఎగుమతి చేస్తుంది.

ఈ జలసంధిలో ఏర్పడే ఏ అంతరాయమైనా ప్రపంచ వాణిజ్యాన్ని గజగజలాడిస్తుంది. దీన్ని గుర్తించిన అమెరికా బహ్రెయిన్‌లో తన ఫిఫ్త్ ఫ్లీట్ స్థావరాన్ని ఏర్పాటు చేసుకొంది. ఇక ఈ మార్గం నుంచి వచ్చే చమురు, ఎల్ఎన్‌జీ అత్యధికంగా భారత్, చైనా, దక్షిణ కొరియా, జపాన్ దేశాలకు ఎగుమతి అవుతోంది.

**భారత్‌పై పెను ప్రభావం...** భారత్ అవసరాలకు వాడే చమురులో 40 శాతం ఈ మార్గం నుంచే రవాణా అవుతోంది. ఇరాక్, సౌదీ, యూఏఈ, కువైట్, ఖతార్ నుంచి మనం దిగుమతి చేసుకొంటున్నాం. మన దేశం వినియోగించే ఇంధనంలో 90 శాతం వివిధ మార్కెట్ల నుంచి దిగుమతి చేసుకొంటున్నాం. ఈ క్రమంలో హర్మూజ్ జలసంధి మూసుకుపోతే.. ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవడంతోపాటు.. రవాణా, బీమా ఖర్చులు గణనీయంగా పెరుగుతాయి. దీంతో దేశీయంగా పెట్రోల్, డీజిల్, ఎల్ఎన్‌జీ ధరలకు రెక్కలు రావడం ఖాయం. దీంతో భారత ప్రభుత్వ రంగంలోని చమురు సంస్థల ఆర్థిక పరిస్థితి మళ్లీ దారుణంగా మారుతుంది. ఈ నేపథ్యంలో జూన్ 13న కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పురి మాట్లాడుతూ దేశీయ అవసరాలకు సరిపడా చమురు సరఫరా అవుతుందని భరోసా ఇచ్చారు. ఇప్పటికే వివిధ దేశాలతో మనకు ఉన్న చమురు ఒప్పందాలకు తోడు.. మనకు ఉన్న వ్యూహాత్మక నిల్వలు 74 రోజులకు సరిపోతాయి.

**ఈ జలసంధిలో ఉద్రిక్తతలు..** ఇరాన్ ఎన్నడూ ఈ జలసంధిని మూయలేదు. వాస్తవానికి టెహ్రాన్ ఉత్పత్తి చేసే చమురులో 80శాతం చైనా కొనుగోలు చేస్తుంది. ఈ నేపథ్యంలో హర్మూజ్‌ను మూస్తే.. దాని ఆర్థిక వ్యవస్థ మరింత దిగజారుతుంది. గతంలో ఇరాన్-ఇరాక్ యుద్ధం సమయంలో కూడా ఈ జలసంధి తెరిచే ఉంది. 1973లో ఈజిప్ట్-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమ దేశాలపై నాడు సౌదీ అరేబియా, దాని మద్దతుదారులు చమురు వ్యాపారం నిలిపేశారు. కాకపోతే ఇప్పుడు అలాంటి నిర్ణయాలు పెద్దగా ప్రభావం చూపకపోవచ్చు. కొంతకాలం కిందట వరకు అమెరికా అత్యధికంగా ఇంధనం దిగుమతి చేసుకొనేది.. ఇప్పుడు అది కూడా భారీ ఎత్తున చమురును ఎగుమతి చేస్తోంది. 1980-88 వరకు జరిగిన ఇరాన్-ఇరాక్ యుద్ధం ప్రభావం జలసంధిపై పడింది. నాడు ఇరు దేశాలు పరస్పర ఎగుమతులను దెబ్బతీసేందుకు.. ట్యాంకర్లపై దాడులు చేసుకొన్నాయి. దీనిని ట్యాంకర్ వార్ అని కూడా అంటారు. ఆ సమయంలో వివిధ దేశాల పతాకాలపై ప్రయాణించిన దాదాపు 450కు పైగా నౌకలపై ఇరు దేశాలు దాడులు చేశాయి. 1988లో అమెరికా యుద్ధ నౌక పొరబాటున ఓ ఇరాన్ పౌర విమానాన్ని కూల్చేసింది. దీంతో 290 మంది మరణించారు. ఉద్దేశపూర్వకంగానే కూల్చారని టెహ్రాన్ ఆరోపించగా.. పొరబాటున జరిగిందని వాషింగ్టన్ వివరణ ఇచ్చింది. అమెరికా, ఐరోపా ఆంక్షలకు ప్రతిగా హర్మూజ్ జలసంధిని మూసేస్తామని ఇరాన్ హెచ్చరించింది.

# ట్రంప్ సహా అమెరికా నాయకులను హతమారుస్తాం: అల్‌ఖైదా

ఉగ్ర సంస్థ అల్‌ఖైదా అరేబియన్ పెనున్సులా విభాగం సంచలన ప్రకటన చేసింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సహా ఆయన కార్యవర్గంలోని కీలక మంత్రులను, శ్వేతసౌధం సిబ్బందిని హతమారుస్తామంటూ వెల్లడించింది. ఇటీవల ఈమేరకు ఆ సంస్థ నాయకుడు సాద్‌బిన్ అతేఫ్ అల్-అవ్లాకీ దాదాపు 30 నిమిషాల నిడివితో ఓ వీడియో విడుదల చేశాడు. అతడి తలపై అమెరికా 6 మిలియన్ డాలర్ల రివార్డును ఇప్పటికే ప్రకటించింది. 2024 మార్చిలో అల్-అవ్లాకీ ఈ సంస్థకు అధిపతిగా బాధ్యతలు చేపట్టాడు. గాజాలో ఇజ్రాయెల్ చేపట్టిన యుద్ధానికి ప్రతీకారం తీర్చుకోవాలని సాద్ బిన్ అతేఫ్ అల్-అవ్లాకీ పిలుపునిచ్చాడు. అమెరికాలోని లక్ష్యాలపై దాడులు చేసేందుకు ఎలాంటి హద్దులు లేవని చెప్పాడు. ఈసందర్భంగా అధ్యక్షుడు ట్రంప్, వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్సె, టెక్ బిలియనీర్ ఎలాన్ మస్క్ సహా.. శ్వేతసౌధంతో సన్నిహిత సంబంధాలున్న ప్రతిఒక్క అధికారిని, నాయకుడిని, వారి కుటుంబాలను, బంధువులను లక్ష్యంగా చేసుకొంటామని అల్-అవ్లాకీ హెచ్చరించాడు. గాజాలో పాలస్తీనా వాసులకు వీరు ఎటువంటి ఆధారం మిగల్చలేదని.. అందుకే ఈ స్థాయిలో దాడులు చేయాలని పిలుపునిచ్చాడు. గతంలో అల్-అవ్లాకీ అమెరికాలో యూదులపై జరిగిన దాడులను పొగుడుతూ మాట్లాడాడు. వారికి ఎక్కడా సురక్షిత ప్రదేశమంటూ లేకుండా చేయాలన్నాడు. అల్‌ఖైదా అరేబియన్ పెనున్సులా సంస్థ యెమెన్ కేంద్రంగా పనిచేస్తోంది. గతంలో ఇది సౌదీ, యెమెన్‌లో వేర్వేరుగా పనిచేసేది. అల్‌ఖైదా వ్యవస్థాపకుడు ఒసామా బిన్ లాడెన్ మరణం తర్వాత అత్యంత ప్రమాదకర గ్రూపుగా అల్‌ఖైదా అరేబియన్ పెనున్సులా అవతరించింది. సాద్ బిన్ అతేఫ్ అల్-అవ్లాకీ ఆ గ్రూపు నాయకత్వ బాధ్యతలు చేపట్టాడు. అతడు గతంలో పలుమార్లు అమెరికాపై దాడికి పిలుపునిచ్చాడు. అతడి తల పైనా రూ.50 కోట్ల రివార్డు ఉంది. అల్‌ఖైదాలో ఈ పెనున్సులా విభాగమే అత్యంత చురుగ్గా పనిచేస్తోంది. దీనికితోడు గతంలో ఇది ప్రమాదకర దాడులు నిర్వహించింది. అమెరికా, ఐరోపా దేశాల్లోని లక్ష్యాలపై ఇది గురిపెట్టింది. 2009 అండర్‌వేర్ బాంబర్ కుట్ర, 2015లో చార్లె హెబ్డోపై దాడి దీని పనే. దీంతో అమెరికా విదేశాంగశాఖ దీనిని ఉగ్రజాబితాలో చేర్చింది.

# ఆకలి ఉండదు, నొప్పి పుట్టదు, నిద్ర రాదు.. ఏమిటీ అరుదైన వ్యాధి!

అసలు ఆకలనేదే లేకపోతే ఈ ఆరాటం, పోరాటం ఉండవు కదా?.. చేతిలో చిల్లిగవ్వ కూడా లేనప్పుడు చాలా మందికి ఉండే అభిప్రాయం ఇది! కానీ.. నిజంగానే ఆకలే ఉండని ఓ అమ్మాయి ఈ లోకంలో ఉంది. ఆమెకు ఆకలి ఉండకపోవడమే కాదు.. నొప్పి కూడా తెలియదు. ఇక నిద్ర అంటారా.. కేవలం రోజుకి రెండు గంటలు మాత్రమే. అందుకే ఈమెను 'బయోనిక్ గర్ల్' అని కూడా అంటారు. అవును... యూకే లోని హడర్స్ ఫీల్డ్ కు చెందిన ఒలివియా ఫార్న్ వర్త్ అనే 13 ఏళ్ల అమ్మాయికి అరుదైన జన్యుపరమైన వ్యాధి ఉంది. ఈ వ్యాధి వల్ల ఆమెకు నొప్పి అంటే ఏమిటో తెలియదు.. ఆకలి కూడా అవ్వదు.. రోజుకి రెండు గంటల నిద్ర మాత్రం సరిపోతుంది. దీనికి కారణం ఆమెకు అరుదైన క్రోమోజోమ్ 6పీ డిలీషన్ అనే అరుదైన పరిస్థితి ఉంది. దీంతో.. ఆమె పరిస్థితి వైద్యులను ఆశ్చర్యపరిచింది. ఒలివియాకు క్రోమోజోమ్ 6పీ డిలీషన్ అనే అరుదైన పరిస్థితి ఉంది. ఇది క్రోమోజోమ్ 6 లోని ఒక జన్యుపరమైన సమస్య. నేషనల్





ఆర్గనైజేషన్ ఫర్ రేర్ డిజార్డర్స్ ప్రకారం... ఈ పరిస్థితి ఉన్న వ్యక్తులు మానసిక వైకల్యం, ప్రత్యేకమైన ముఖ లక్షణాలను కలిగి ఉంటారు. అయితే... ఈ ప్రపంచంలో ఇలాంటి సమస్య ఉన్న ఏకైక వ్యక్తి ఒలివియా. దీంతో ఈమె కేసును ప్రపంచంలోని ప్రత్యేకమైన వైద్య రహస్యంగా చెబుతారు!

**ప్రపంచాన్ని ఆశ్చర్యపరచిన కారు ప్రమాదం!:** ఒలివియా జీవితంలో అత్యంత షాకింగ్ క్షణాల్లో ఒకటి ఆమెకు ఏడేళ్ల వయసులో జరిగింది. ఆ సమయంలో ఆమెను ఓ కారు ఢీకొట్టి సుమారు 10 మీటర్లు రోడ్డుపై లాక్కెళ్లిపోయింది. ఈ సమయంలో మరో బిడ్డ అయితే తీవ్రంగా గాయపడి, గట్టిగా ఏడ్చేసేవారు! కానీ.. ఒలివియా మాత్రం లేచి నిలబడి.. అంతా ఎందుకు టెన్షన్ పడుతున్నారో తెలియక వెళ్లిపోయింది. ఇటీవల ఆమె తల్లి ఆ భయానక క్షణాన్ని గుర్తుచేసుకుంటూ.. ఆమె ఛాతిపై టైర్ల గుర్తులు కూడా ఉన్నాయని.. ఆమె కాలి బొటనవేలు, తుంటిపైన చర్మ లేదని.. అయినప్పటికీ ఆమె ఏడవలేదని.. ఆమెకు అంత తీవ్రమైన గాయమైందని కూడా గ్రహించలేదని తెలిపారు. ఆమె పరిస్థితి ఎంత అసాధారణమైనదో నిజంగా ధృవీకరించే క్షణం అది అని ఆమె అన్నారు. ఇదే సమయంలో.. ఒలివియా తల్లి ఆమె చిన్నతనంలోనే మరో అసాధారణమైన విషయాన్ని గమనించింది. ఇందులో భాగంగా.. ఆమె చాలా చిన్నప్పటి నుంచీ ఆహారాన్ని తిరస్కరించేది. ఎప్పుడూ ఆకలి అనే మాట అనేది కాదు! ఇప్పుడు కూడా స్కూల్లో పిల్లలతో కలిసి భోజనం చేయడానికి కూర్చుంటుంది.. ఇంట్లో మాత్రం నెలల తరబడి ఆహారాన్ని తీసుకోవడానికి ఆసక్తి చూపదు! ఇక నిద్ర కూడా బాల్యం నుంచి రాత్రి కేవలం రెండు గంటలు మాత్రమే. ఆమె శరీరానికి ఇలా సహజంగా నిద్ర అవసరం అనిపించకపోవడంతో. ఆమె తల్లి చివరికి వైద్య సహాయం తీసుకోవాల్సి వచ్చింది. ఈ సందర్భంగా స్పందించిన వైద్యులు... ఒలివియా అనారోగ్యానికి చికిత్స లేదు.. తాము తీసుకోవాల్సిన ఉత్తమ చర్య ఏదైన ఉంటే.. అది ఆమె సాధ్యమైనంత సాధారణ జీవితాన్ని గడపడానికి సహాయం చేయడం అని అన్నారు.

# ట్రంప్ టవర్స్ అదిరిపోలా.. వైరల్ వీడియో

గురుగ్రామ్ నగరం మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. న్యూయార్క్ వెలుపల ట్రంప్ బ్రాండ్ టవర్స్ నిర్మితమైన ఏకైక ప్రాంతంగా గుర్గావ్ చరిత్ర సృష్టించింది. ఇది దేశీయ గృహ నిర్మాణ రంగంలోనే ఒక కొత్త అధ్యాయాన్ని లిఖించిందని చెప్పడంలో సందేహం లేదు. హర్యానా రాష్ట్రానికి, ముఖ్యంగా భారతదేశానికి ఇది గర్వకారణంగా మారింది.

**– అత్యాధునిక సౌకర్యాలతో ట్రంప్ టవర్స్...** సెక్టార్ 69లో 12 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు అద్భుతమైన టవర్స్ రూపుదిద్దుకున్నాయి. ఈ 51 అంతస్తుల భవనాలు అత్యాధునిక వసతులతో, ప్రపంచ స్థాయి లగ్జరీ నివాసాలతో ఆకట్టుకుంటున్నాయి.



మొత్తం 298 విలాసవంతమైన అపార్ట్‌మెంట్‌లు ఈ ప్రాజెక్ట్‌లో అందుబాటులో ఉన్నాయి. ప్రతి అపార్ట్‌మెంట్ ధర రూ. 8 కోట్ల నుంచి రూ. 15 కోట్ల వరకూ ఉంది. అధునాతన వసతులు, అత్యుత్తమమైన నిర్మాణ నైపుణ్యం, శ్రేష్ఠమైన డిజైన్ కలగలిసి ఈ నివాసాల ప్రత్యేకతను మరింత పెంచాయి.

**– ప్రత్యేక ఆకర్షణలు...** ట్రంప్ టవర్స్ నివాసితుల కోసం అనేక ప్రపంచ స్థాయి సౌకర్యాలను అందిస్తున్నాయి. ప్రపంచ స్థాయి క్లబ్ హౌస్ విశ్రాంతి, వినోదం కోసం అధునాతన క్లబ్ హౌస్ అందుబాటులో ఉంది. శారీరక దృఢత్వం, పునరుత్తేజం కోసం అత్యాధునిక జిమ్, స్విమ్మింగ్ పూల్ ఉన్నాయి. వివిధ కార్యక్రమాలకు అనువైన విశాలమైన హాల్ ఏర్పాటు చేశారు. పిల్లల ఆటల కోసం ప్రత్యేకంగా కేటాయించిన సురక్షితమైన ప్రదేశం. నివాసితుల భద్రత కోసం నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. అంతేకాకుండా, టవర్స్ చుట్టూ విస్తారమైన హరిత ప్రదేశాలు, స్వచ్ఛమైన గాలి, శాంతియుత వాతావరణం ఇక్కడి నివాసదారులకు అదనపు ఆకర్షణగా నిలుస్తున్నాయి. గ్లోబల్ బ్రాండ్ అయిన ట్రంప్ పేరు ఈ ప్రాజెక్ట్‌కు ప్రత్యేక గౌరవాన్ని తీసుకొచ్చింది. ఈ విలాసవంతమైన అపార్ట్‌మెంట్ల కొనుగోలుపై ఆసక్తి ఉన్నవారు త్వరగా బుక్ చేసుకోవాలి. ఇప్పటికే మార్కెట్‌లో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌పై భారీ ఆసక్తి వ్యక్తమవుతోంది. ఇది గురుగ్రామ్‌కు, భారతదేశానికి కొత్త కీర్తిని తెచ్చిపెట్టిన ప్రాజెక్ట్‌గా నిలిచింది.

చురకలు

# సంపాదకీయం

## పాక్ కు భారత్ బిగ్ స్కెచ్.. అదే జరిగితే బొట్టు బొట్టుకూ చుక్కలే!

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ సైనిక చర్యకంటే ముందు దౌత్యం రంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... 1960లో భారత్ – పాక్ లు సంతకం చేసిన సింధూ నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేసింది. ఈ సమయంలో ఆ ఒప్పందం రద్దు నిర్ణయానికి పూర్తి న్యాయం జరిగే దిశగా భారత్ అడుగులు వేస్తోంది. అవును... పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ తీసుకున్న సింధూ నదీ జలాల ఒప్పందం రద్దు నిర్ణయానికి కొనసాగింపు చర్యలు చేయపడుతోంది భారత్. ఇందులో భాగంగా.. ఇప్పటికే జమ్మూకశ్మీర్ లో హైడ్రో పవర్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెంపుపై ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని చెబుతోన్న వేళ.. మరో ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా... సింధు నదీ జల వ్యవస్థలోని మూడు పశ్చిమ నదుల నుండి మిగులు ప్రవాహాన్ని హర్యానా, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాలకు మళ్లించడానికి.. 113 కి.మీ పొడవైన కాలువను నిర్మించడానికి భారత్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు సాధ్యాసాధ్యాలపై అధ్యయనాన్ని నిర్వహిస్తోందని జాతీయ మీడియాలో కథనాలొస్తున్నాయి. చినాబ్ ను రవి – బియాస్ – సట్లేజ్ వ్యవస్థతో అనుసంధానించే కాలువ నిర్మాణ పనులు రాబోయే మూడేళ్లలో పూర్తవుతాయని భావిస్తున్నారని అంటున్నారు. ఈ సందర్భంగా స్పందించిన హోంమంత్రి అమిత్ షా... మూడేళ్ల లోపు సింధూ జలాలను కాలువల ద్వారా రాజస్థాన్ లోని గంగానగర్ కు తీసుకెళ్తామని తెలిపారు. అప్పుడు పాకిస్థాన్ ప్రతీ నీటి చుక్క కోసం తహతహలాడుతుందని షా అన్నారు. ఇదే సమయంలో.. దీనిని యమునా నదికి అనుసంధానించే ప్రతిపాదన కూడా ఉందని.. అలా జరిగితే కాలువ పొడవు 200 కి.మీ అవుతుందని అంటున్నారు. ఈ పథకం వల్ల ఢిల్లీ, హర్యానా, పంజాబ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలు ఎంతో ప్రయోజనం పొందుతాయని భావిస్తున్నారు. కాగా... భారత్ ఆపరేషన్ సిందూర్ ను ప్రారంభించినప్పుడు ప్రధాని నరేంద్ర మోడీ స్పందిస్తూ.. "నీరు, రక్తం కలిసి ప్రవహించలేవు", "ఉగ్రవాదం, చర్చలు ఒకేసారి జరగవు" అని నొక్కి చెప్పిన సంగతి తెలిసిందే.


# తెలుగు భాషకు ఖండవల్లి ఎనలేని సేవ - జూన్ 18...ఖండవల్లి లక్ష్మీరంజనం వర్ధంతి



తెలుగునాట తెలుగు భాష నేర్చుకోవడానికి అవకాశాలు మృగ్యమైన కాలంలో మాతృభాషపై మమకారంతో విద్యార్థులకు తెలుగు భాష నేర్చుకునే అవకాశం కల్పించడానికి ఆచార్య ఖండవల్లి లక్ష్మీ రంజనం చేసిన కృషి అనన్య సామాన్యం. సానుకూల దృక్పథంతో, అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పరిపాలనా కాలంలో తెలుగు సాహిత్యానికి, చరిత్రకు ఖండవల్లి లక్ష్మీ రంజనం విశేష సేవలు అందించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఆచార్యుడిగా పనిచేసిన ఆయన విద్యార్థుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో తెలుగు భాషకు ప్రముఖ స్థానం లభించడం వెనుక ఆయన విశేష కృషి దాగి ఉంది. ఆంధ్రప్రదేశ్ లో ప్రథమంగా ప్రాచ్య కళాశాలను, తెలుగు మీడియం సాయం కళాశాలను, ఒక సంగీత పాఠశాలను నెలకొల్పి, వాటికి విశాలమైన భవనాలు కట్టించారు. తన ఇంటిలోనే వేద పాఠశాలను 1980లో స్థాపించి సర్వ వర్ణాల వారికి తానే వేదాన్ని స్వయంగా బోధించారు. ఆంధ్ర రచయితల సంఘానికి 1957లో అధ్యక్షులై అనేక గ్రంథాలను ముద్రించారు. ఇంగ్లీషు, తెలుగు భాషలలో శరవేగంగా రాసేవారు. మద్రాసు మెయిల్, దక్కన్ క్రానికల్, భారతి, కృష్ణా, స్రవంతి మొదలైన పత్రికలలో అనేకమైన వ్యాసాలు ప్రకటించారు. ఖండవల్లి లక్ష్మీరంజనం ( మార్చి 1, 1908 – జూన్ 18, 1986) సుప్రసిద్ధ సాహిత్యవేత్త, పరిశోధకులు. ఆయన తూర్పు గోదావరి జిల్లా పెదపూడి గ్రామంలోని మాతామహులైన కోరాడ నరసింహులు ఇంటిలో మార్చి 1, 1908 న జన్మించారు. సూర్యనారాయణ, సీతమ్మ తల్లిదండ్రులు. తండ్రి ఉద్యోగ రీత్యా వరంగల్లుకు రావడంతో ఆయన మాధ్యమిక, ఉన్నత పాఠశాల విద్యలు మట్టెవాడలో, హనుమకొండ లోను పూర్తయ్యాయి. తరువాత ఉన్నత విద్యకై హైదరాబాదు చేరుకుని 1924లో నిజాం కళాశాలలో బీఏ సంస్కృతం చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. 1928లో నిజాం కళాశాలలో తెలుగు, సంస్కృతం, ప్రాచీన భారత చరిత్రలలో బి.ఎ. పట్టా పొందారు. తరువాత సిటీ కళాశాలలో అధ్యాపకులుగా చేరి 1936లో తెలుగు, సంస్కృతాలలో ఎం.ఎ. పరీక్షలో మద్రాసు ప్రెసిడెన్సీలో సర్వ ప్రథములుగా ఉత్తీర్ణులయ్యారు. ఖండవల్లి 1936 నుంచే సాహిత్యసేవ ప్రారంభించారు. 'తెలుగుదుక్కి' శీర్షికతో వ్యాసాలు ప్రచురించారు. త్రివేణి లాంటి ఆంగ్ల పత్రికల్లో ఆధునిక కవిత్వం గురించి అనేక వ్యాసాలు రాశారు. 1936లో ఎంఏ (తెలుగు సంస్కృతం)లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉస్మానియా విశ్వ విద్యాలయంలో తెలుగు లెక్చరర్ గా చేరారు. రాయప్రోలు సుబ్బారావు పదవీ విరమణ చేశాక ఆచార్య (ప్రొఫెసర్) పీఠాన్ని అధిష్టించారు. ఖండవల్లికి విద్యార్థి దశ నుంచే ఆదిరాజు వీరభద్రరావు లాంటి పరిశోధకులతో, గోలకొండ పత్రికా సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డి లాంటి ప్రజా సాహిత్య సేవకులతో, లోకనంది నారాయణ లాంటి సాహిత్య పోషకులతో పరిచయం ఏర్పడింది. ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో అధ్యాపకులుగా చేరి, తరువాత 1946లో ఆ శాఖకు అధ్యక్షులై, 1964లో పదవీ విరమణ చేశారు. ఆయన కృషి కారణంగా తెలంగాణలో 1956 నుంచి ప్రాచ్య భాషాధ్యయనంలో డిగ్రీ తరగతులు (బీఓఎల్) మొదలయ్యాయి. 1957 నుంచి ఓరియంటల్ కళాశాలలు సాయంకాలం పూట పనిచేసేలా ప్రారంభమయ్యాయి. ఇంగ్లీషు భాషా పరిచయం లేని పేదసాదా విద్యార్థులు ఈ కళాశాలల్లో చదివి, ఎంఏ తెలుగు, సంస్కృతం పట్టాలు పొంది కళాశాలల ఉపన్యాసకులు కాగలిగారు. 1966లో తెలుగు మాధ్యమంలో సాయం డిగ్రీ కళాశాలను స్థాపించారు. 1960లో హైదరాబాదులో వేద పాఠశాలను ప్రారంభించి, తాను కూడా తరగతులు తీసుకునేవారు. ఉస్మానియాలో ఆయన కాలంలో తెలుగు శాఖ బాగా అభివృద్ధి చెంది, తెలుగు ఎం.ఎ. చదివే విద్యార్థుల సంఖ్య పెరిగి, 1952 నుండి తెలుగులో పి.హెచ్.డి. పట్టాలకు పరిశోధన ప్రారంభమైంది. ఆయన రాసిన పుస్తకాల్లో ఆంధ్రుల చరిత్ర%–% సంస్కృతి, ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము, తెనుగుదుక్కి, లక్ష్మీరంజనం వ్యాసావళి, ఆంధ్రదేశ చరిత్ర భూగోళ సర్వస్వము మూడు సంపుటాలు, కాసె సర్వప్ప రాసిన సిద్దేశ్వర చరిత్రము, శ్రీనాథుని హరవిలాసము (పరిష్కరణ గ్రంథాలు) ప్రసిద్ధాలు. ఆయన ఆంధ్ర మహాభారతం పరిశోధన ప్రతిని ఎనిమిది సంపుటాలుగా తెలుగు శాఖ పక్షాన ప్రకటించారు. వివేకానంద ఎడ్యుకేషనల్ సొసైటీ పేరుతో ఒక విద్యాసంస్థను ప్రారంభించి బాల బాలికలకు వేరువేరుగా ఉన్నత పాఠశాలలను నెలకొల్పారు. కొమర్రాజు లక్ష్మణరావు... విజ్ఞాన సర్వస్వం ముద్రించడంలో ఖండవల్లి విశిష్టమైన కృషిచేశారు. ఆయన 'ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము' అనే చక్కని రచన చేశారు. సోదరుడు ఖండవల్లి బాలేందు శేఖరంతో కలసి తెలుగులోను, ఇంగ్లీషులోను రచించిన 'ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి' అమూల్యమైన గ్రంథం. హైదరాబాద్ లోని శ్రీకృష్ణదేవరాయ గాంధ్ర భాషా నిలయం కార్యదర్శిగా రెండేళ్లపాటు పనిచేశారు. పుస్తకాల సేకరణ, చందాల కోసం తెలంగాణ అంతటా పర్యటించారు. వర్ధంతులు, జయంతులు ఎన్నో జరిపారు. ఆంధ్ర సారస్వత పరిషత్ సభ్యులుగా పనిచేసి దాని విస్తరణకు విశేష కృషి చేశారు. 'నిజాం రాష్ట్ర గ్రంథాలయ సంఘం' కార్యదర్శిగా కూడా పనిచేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధ్యక్షులుగా 1964లో విశ్రాంతి తీసుకున్నాక, మరో 22 సంవత్సరాలు సాహిత్య సేవ చేసి, 1986, జూన్ 18న హైదరాబాద్‌లో మరణించారు. ఆయన స్థాపించిన ఆంధ్ర ప్రాచ్య కళాశాల ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం ప్రభుత్వ ప్రాచ్య కళాశాలగా అభివృద్ధి చెందింది. ఖండవల్లి శత జయంతి, కళాశాల స్వర్ణోత్సవాలు 2008లో హైదరాబాదులో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక సంచికను ప్రచురించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# తెలుగు భాషకు "వేదం" ఎనలేని సేవ - జూన్ 18...వేదం వెంకట రాయ శాస్త్రి వర్ధంతి




పందొమ్మిదవ శతాబ్ది ఉత్తరార్ధమున భారత దేశమంతటా అన్ని భాషలలో నూతన వికాసానికి తెర లేచింది. పాశ్చాత్య నాగరికత, అంగ్ల విద్య ప్రభావాలు ప్రజల వేష భాషలపై అనూహ్య ప్రభావాలు చూపా యి. ఇందుకు తెలుగు భాష, ప్రజలకు మినహాయింపు ఏమీ లేకుండే. ఆ సంధి కాలంలో వేంకటరాయ శాస్త్రి ఆగమనము ఆంధ్ర వ్మాయమున క్రొత్త యుగానికి సూచిక అయింది. వేదం వెంకట రాయ శాస్త్రి అంటే ఒక ప్రాచీన పండితుడిని తప్ప, అయన గొప్పతనం గురించి, ఆయన తెలుగు భాషకు చేసిన అమూల్య, అపూర్వ సేవల గురించి, అయన చూపిన నూతన మార్గాల గురించి నేటి తరంలో చాలా మందికి తెలియదు. కనీసం శాస్త్రి ఏమి రచనలు చేశారో కూడా నేటి సాహిత్యాభిమానులకు తెలియదు. గద్య పద్య నాటక విమర్శకాది విషయములలో శాస్త్రి చూపిన మార్గములు అనేకాలు. నాటి కాలంలో శాస్త్రి గ్రంథములు విమర్శకు గురి అయినట్లు ఆధునికులలో ఎవ్వరి గ్రంథాలు కాలేదన్నది వాస్తవం. సుప్రసిద్ధ పండితుడు, కవి, విమర్శకుడు, నాటకకర్త అయిన వేదం వేంకటరాయ శాస్త్రి... వేంకట రమణశాస్త్రి, లక్ష్మమ్మ దంపతులకు డిసెంబర్ 21, 1853న చెన్నైలో జన్మించారు. 1886లో మద్రాసు క్రైస్తవ కళాశాలలో సంస్కృత పండిత పదవిని 25 సంవత్సరాలు సమర్ధ వంతంగా నిర్వహించారు. 1887లో బి.ఎ. పరీక్షలలో ఆంగ్లం, సంస్కృతంలలో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణుడయ్యారు. పరవస్తు చిన్నయసూరికి సహపాఠు లైన, సంస్కృతాంధ్రములలో గొప్ప పండితులు అయిన తండ్రి వేంకటరమణ శాస్త్రి ప్రభావం వేంకట రాయ శాస్త్రి పై పడింది. దాని ప్రభావం వ్యవహార భాషా సాంప్రదాయం అనుసరణకు ప్రేరణ అయింది. 1899లో తెలుగు భాషాభిమాని నాటక సమాజాన్ని స్థాపించారు. ఈ సంస్థలో వెంకటరాయ శాస్త్రి వ్రాసిన నాటకాలని ప్రదర్శించే వారు. ఆయన మూల నాటకాలలో 1897లో వ్రాసిన ప్రతాపరుద్రీయ నాటకం, 1901లో వ్రాసిన ఉషా నాటకం ప్రముఖమైనవి. అనేక సంస్కృత నాటకాలను తెనుగించారు. 1916లో సూర్యారాయాంధ్ర నిఘంటువుకు ప్రధాన సంపాదకుడుగా కొంతకాలం పనిచేశారు. అముక్త మాల్యద, శృంగార నైషధ తదితర వ్యాఖ్యలు శాస్త్రి పాండిత్యానికి నిలువుటద్దాలు. ఆముక్త మాల్యద వ్యాఖ్య శతాధిక వసంతాలను చూసింది. 24-6-1920 నాడు ప్రారంభించి 20-10-1920 నాటికి పూర్తి చేసినట్లు ఆయనే తన జీవిత చరిత్రలో సుస్పష్టంగా చెప్పు కున్నారు. ఆముక్తమాల్యద – సంజీవినీ వ్యాఖ్య, భోజ చరిత్రము, శ్రీకృష్ణ దేవరాయ, విజయము–నాటకము కథా సరిత్సాగరము పలు భాగాలు, దశకుమార చరితం, శతక వ్మాయ చరిత్ర – ప్రథమ సంపుటం, చరిత్ర రచన – ప్రథమ భాగం, తెనుగు లఘు వ్యాకరణము వ్యామోహము తదితరాలు అయన ప్రముఖ రచనలు. నాగానందం, బొబ్బిలి యుద్ధం, ఉత్తరరామ చరిత, ఆంధ్ర విక్రమోర్వశీయ, ప్రతాపరుద్రీయ, ఉషా నాటకము ప్రియదర్శికాది నాటకములు, అమర కావ్యం, ఆంధ్ర హితోపదేశము – చంపువు, శ్రీ శారదా కాంచిక, ఆంధ్ర బిల్హణియము, విక్రమార్క చరిత్రము, కావ్యాలంకార చూడామణి, మేఘ సందేశం వ్యాఖ్యానం, ఉదయన చరిత్రము, భరతాభారత రూపక మర్యాదలు, తిక్కన సోమయాజి విజయము, ఆంధ్రవ్యాకరణ సర్వస్వ తత్త్వము, ఆంధ్ర భాషా సర్వస్వ నియమ కతిపయములు, ఆంధ్ర సాహిత్య దర్పణము, విమర్శ వినోదము, ఆంధ్ర ప్రసన్నరాఘవ విమర్శనము, తానాషా అక్కన్న మాదన్నలు, ఆంధ్ర రత్నావళీ నాటిక, సారంగధర చరిత్రము, పుష్పబాణ విలాసం, రసమంజరీ, కుమార సంభవము వ్యాఖ్య, ఉదయన చరిత్రము, పంచ తంత్రం, ఆంధ్ర దశకుమార చరిత్రము తదితర రచనలు గావించారు. 1920లో ఆంధ్ర మహా సభ చేత 'మహోపాధ్యాయ' బిరుదు పొందారు. 1922లో ద్వారక పీఠ శంకరభగవత్పాదులచేత 'సర్వ తంత్ర స్వతంత్ర', 'మహా మహోపాధ్యాయ', 'విద్యా దాన వ్రత మహోదధి' అనే సత్కారాలు పొందారు. 1927లో ఆంధ్ర విశ్వకళా పరిషత్తు చేత 'కళా ప్రపూర్ణ' గౌరవంతో సన్మానించబడ్డారు. 1958లో కుమార సంభవ ప్రబంధకర్త నన్నెచోడుని కవిత్వంపై వీరు రాసిన 'నన్నెచోడుని కవిత్వము' అనే విమర్శనా గ్రంథానికి 'ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి' బహుమతి లభించింది. వెంకటరాయ శాస్త్రి 1929, జూన్ 18న మద్రాసులో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# అంతర్జాతీయ విహార దినోత్సవం - ప్రకృతిలో పరవశించే పర్వదినం - జూన్ 18...అంతర్జాతీయ విహార దినోత్సవం



ప్రతి సంవత్సరం జూన్ 18న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే అంతర్జాతీయ విహార దినోత్సవం ఒక చిరస్మరణీయమైన సందర్భం. ఇది కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరులతో కలిసి ప్రకృతి మధ్య సుఖంగా గడిపే అవకాశాన్ని కల్పించే పర్వ దినం. ప్రకృతిలో మనుషుల అనుబంధాన్ని, విశ్రాంతిని, ఉల్లాసాన్ని ప్రతిబింబించే ఈ దినోత్సవం, వాస్తవానికి మన ఆరోగ్యానికి, భావోద్వేగాలకు, సమాజానికి విశేషంగా ఉపయోగపడే ఒక ప్రకృతి పండుగ లాంటిది. ఈ దినోత్సవం వెనక ఉన్న చరిత్ర స్పష్టంగా లిఖితంగా లేనప్పటికీ, 19వ శతాబ్దం నుంచే పాశ్చాత్య దేశాల్లో వేసవి కాలంలో కుటుంబాలు, స్నేహితులతో కలిసి పచ్చిక బయళ్లలో భోజనం చేస్తూ సమయం గడిపే సంప్రదాయం ప్రారంభమైంది. అప్పటి నుంచే ఇది ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి ప్రజల జీవనశైలిలో భాగమైపోయింది. విహార దినోత్సవానికి అనేక ప్రకృతి నిర్మిత ప్రయోజనాలున్నాయి. ఆధునిక జీవితపు యాంత్రికత మధ్య ఒత్తిడిని తగ్గించేందుకు, ప్రకృతిలో ఒక రోజు గడిపితే మనసుకు ప్రశాంతత కలుగుతుంది. తాజా గాలిని పీల్చడం, పచ్చదనాన్ని వీక్షించడం, పక్షుల కిలకిల ధ్వనులను వినడయ విహారాలు మన ఆరోగ్యాన్ని మెరుగు పరచడమే కాక, కుటుంబ బంధాలను బలపరిచే, మానవ సంబంధాలకు ఉత్సాహాన్ని అందించే వినూత్న మార్గంగా నిలుస్తాయి. ఈ రోజును సార్ధకంగా చేసుకోవాలంటే, పార్కులు, సరస్సుల తీరాలు, జలపాతాలు, పర్వత ప్రాంతాలు వంటి పచ్చని ప్రదేశాలను ఎంచుకోవాలి. ఇంట్లోనే తయారు చేసిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకెళ్లి ప్రకృతి సన్నిధిలో భోజనం చేయడం ఒక విశిష్ట అనుభవం. ఆటలు ఆడటం, పుస్తకాలు చదవటం, గానం చేయడం, పిల్లలతో సమయాన్ని గడపటయ అంతేకాదు, ఈ సందర్భాన్ని పర్యావరణ జాగ్రత్తల కోసం ఉపయోగించు కోవాలి. ప్లాస్టిక్ వాడకం నివారించాలి, శుభ్రత పాటించాలి, చెట్లను నాటి ప్రకృతికి కృతజ్ఞత తెలియ జేయాలి. విహారం అనేది చిన్న విరామం, నిత్య జీవిత ఆందోళనల నుంచి విముక్తి పొందే మార్గం. ఇది పర్యటన కన్నా మరింత సహజమైన, స్వేచ్ఛానుభూతిని కలిగించే అనుభవం. సాంకేతికత మధ్య చిక్కుకు పోయిన ఆధునిక మానవుడు సహజత్వాన్ని తిరిగి గుర్తుచేసుకునే అద్భుతమైన అవకాశం ఇది. ఈ దినోత్సవం ద్వారా ప్రతి ఒక్కరూ ప్రకృతితో మమేకమై, జీవితాన్ని హర్షభరితంగా ఆవిష్కరించు కోవచ్చు. ఈ రోజును కుటుంబ సమేతంగా, ప్రకృతి మధ్యలో గడిపితే, కేవలం మధుర జ్ఞాపకాలు మాత్రమే కాదు, జీవన శైలిలో ఒక మేలైన మార్పు కూడా ఏర్పడుతుంది. మనిషి మానవత్వాన్ని, ప్రకృతి ప్రేమను, మరియు అనుబంధాలను తిరిగి గుర్తు చేసే ఈ దినోత్సవాన్ని, ప్రతి ఒక్కరిమీ సమయాన్ని, సహృదయతను, పరిసరాలను పంచుకునే రోజుగా మార్చుకుందాం. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# గండవరం జీవితం నాటక రంగానికి అంకితం - జూన్ 18...గండవరం సుబ్బరామిరెడ్డి వర్ధంతి




గండవరం సుబ్బరామిరెడ్డి (1937 – జూన్ 18, 2017) ప్రముఖ నాటక రచయిత, నటులు, దర్శకులు, నిర్వహకులు, విమర్శకులు. ఆయన 1937 సంవత్సరంలో జానకమ్మ, బలరామిరెడ్డి దంపతులకు నెల్లూరు జిల్లా లోని గూడూరులో జన్మించారు. ఉన్నత పాఠశాల చదువు గూడూరులో పూర్తిచేసి, నెల్లూరు లోని వి.ఆర్.కాలేజీలో బి.ఏ పట్టభద్రులయ్యారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సహాయ కార్యదర్శిగా పనిచేసి, 1995లో పదవీ విరమణ చేశారు. 1952నుండే రంగస్థలంతో అనుబంధం ఉంది. విద్యార్థిగా ఉన్నప్పుడే మమత అనే నాటిక రాసి స్కూలు వార్షికోత్సవాలలో ప్రదర్శింప చేసారు. నెల్లూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి నాటక పోటీల్లో ఏది మార్గం అనే నాటిక రాసి ప్రదర్శింపచేసి, ఉత్తమ నిర్వహణ బహుమతి పొందారు. నాటక రచన, పాత్ర పోషణ, విమర్శ, పరిశోధన వీరి ప్రత్యేకతలు. మన ఊరు, శిఖరం కూలింది, వెంటాడే నీడలు అనే రంగస్థల నాటికలు, నీరు పల్లమెరుగు, చీమలు పెట్టిన పుట్టలు, నయనతార అనే రేడియో నాటకాలు రాశారు. వెలుగు%అ%పూలు అనే కార్యక్రమానికి 105 ఎపిసోడ్‌ల స్క్రిప్ట్ రాశారు. నాటకరంగం పై సుమారు 300 వ్యాసాలు వివిధ పత్రికలకు రాశారు. తెలుగు నాటకరంగం పైన, అటు పాశ్చాత్య నాటకరంగం పైన పరిశోధన చేసి ఆధునిక తెలుగు నాటకం అనే పుస్తకంగా 1860నుంచి 1985 వరకు వచ్చిన మార్పులు రాశారు. గ్లింప్సెస్ ఆఫ్ తెలుగు డ్రామా అనే పేరుతో ఇంగ్లీషులో తెలుగు నాటక రచయితల రచనలపైన గ్రంథం రచించారు. మూడు ప్రసిద్ధ నాటకాలు అయిన వరవిక్రయం, నిజం, గయోపాఖ్యానం పైన విమర్శనాత్మక గ్రంథాలు రాశారు. ఆంధ్రదేశంలోని తెలంగాణ, ఆంధ్రా రాయలసీమ జిల్లాలలోనే కాక రాష్ట్రేతర పరిషత్తుల్లో కూడా నిర్వహించిన ఎన్నో నాటక పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. అనేక ప్రతిష్ఠాత్మక పరిషత్ నాటకాలకు 77సార్లు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. అమెరికాలోని తెలుగు సంస్థ ఆటావారు 1998లో నిర్వహించిన ప్రపంచ నాటక రచన పోటీలకు కూడా న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. సుమారు మూడుసార్లు అమెరికాలో పర్యటించి అక్కడి రంగస్థల విశేషాలను గమనించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించిన గ్రంథానికి సంగ్రహ సంపాదకులుగా వ్యవహరించి నాటక విజ్ఞాన సర్వస్వం అనే గ్రంథాన్నినాటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ చేతుల మీదుగా ఆవిష్కరింప చేశారు. ఉత్తమ సాహితీ విమర్శకునిగా ఆరాధనా జవ్వాది ట్రస్ట్, లలిత కళాసమితి వారి ఉగాది పురస్కారం, విశేష నాటక రంగ కృషివలుడుగా నార్ల ఫౌండేషన్‌వారి పురస్కారం, అభినయ స్టేజ్ అవార్డ్ తంగిరాల కృష్ణప్రసాద్ స్మారక అవార్డులు పొందారు. జీవన సాఫల్య పురస్కారం (ప్రగతి కళామండలి, సత్తెనపల్లి– త్యాగరాయ గానసభ, హైదరాబాదు, 8 ఆగస్టు 2016 తదితర అవార్డులు అందు కున్నారు. గూడూరులోని సాంస్కృతిక సమ్మేళనం, కాళిదాసు కళానికేతన్ లకు వ్యవస్థాపక సభ్యులుగా ఉంటూ సుమారు 50 సంవత్సరాలపాటు రాష్ట్రస్థాయి నాటక పోటీలు, సంగీత పోటీలు నిర్వహించారు. ఆయన 2017, జూన్ 18న హైదరాబాద్ లో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

చురకలు



# సాంకేతిక విద్య.. ఉన్నతికి బాట

సంగారెడ్డి : బాలికలు సాంకేతిక విద్య నేర్చుకొని తమ ఉన్నతికి బాట వేసుకునేలా తీర్చిదిద్దాలని విద్యాశాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకు అనుగుణంగా కంప్యూటర్ విద్య ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ముందుగా ఎంపిక చేసిన కస్తూర్బాలు, ఆదర్శ పాఠశాలల్లో దీన్ని అమలు చేస్తారు. సాంకేతిక విద్య బోధనకు ప్రత్యేకంగా శిక్షకులను సైతం నియమించనున్నారు.

**ఎంపిక చేసిన పాఠశాలల్లోనే..**

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఎంపిక చేసిన కస్తూర్బా, ఆదర్శ పాఠశాలలకు కంప్యూటర్లను పంపిణీ చేశారు. సంగారెడ్డి జిల్లాలో నాలుగు ఆదర్శ, మూడు కస్తూర్బాలు, మెదక్ జిల్లాలో ఐదు ఆదర్శ, సిద్దిపేట జిల్లాలో 12 ఆదర్శ, వికారాబాద్ జిల్లాలో 9 ఆదర్శ పాఠశాలలకు వాటిని పంపిణీ చేయనున్నారు. కంప్యూటర్లు, ప్రింటర్, 2 కేవీఏ యూపీఎస్, 24 పోర్ట్ నెట్‌వర్క్ స్విచ్ బోర్డు, 305 మీ. కేబుల్ వైరు, పాఠశాలకు 125 మీటర్ల లాన్, ఆరు రాక్‌లు, జాక్ ప్యానెల్, ఎలక్ట్రికల్ స్విచ్ బోర్డు, 75 మీ. ఎలక్ట్రికల్ కేసింగ్, కంప్యూటర్ టేబుల్స్, కుర్చీలు పంపిణీ చేస్తారు.

**బాలికలకు మాత్రమే అవకాశం**

ఆదర్శ పాఠశాలల్లో బాలికలకు వసతి ఉన్న చోటికి మాత్రమే



కంప్యూటర్లు కేటాయించారు. వసతిగృహానికి చేరుకున్నాక శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ రూపొందించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అవకాశం కల్పించనున్నారు. మెదక్, సిద్దిపేట, వికారాబాద్ జిల్లాల్లో ఆదర్శ పాఠశాలలను మాత్రమే ఎంపిక చేయగా, సంగారెడ్డిలో ఆదర్శ పాఠశాలతో పాటు మూడు కస్తూర్బాలు ఈ జాబితాలో ఉన్నాయి.

**జిల్లాల వారీగా..**మెదక్: రామాయంపేట, చిన్నశంకరంపేట, టేక్మాల్, చేగుంట, నర్సాపూర్ (ఆదర్శ)

సంగారెడ్డి: మునిపల్లి, రామచంద్రాపురం, పుల్కల్, కల్హేర్ (ఆదర్శ), చౌటకూరు, గుమ్మడిదల, మొగుడంపల్లి (కస్తూర్బాలు)

సిద్దిపేట: దుబ్బాక, నంగునూరు, జగదేవపూర్, మిరుదొడ్డి, చిన్నకోడూరు, కోహెడ, హుస్నాబాద్, బెజ్జంకి కొండపాక, మద్దూరు, సిద్దిపేట, చేర్యాల (ఆదర్శ)

వికారాబాద్: యాలాల, వికారాబాద్, నవాబ్‌పేట, మర్పల్లి, పరిగి, తాండూరు, పుడూరు, బంట్వారం, కుల్కచర్ల (ఆదర్శ).

సద్వినియోగం చేసుకోవాలి

ఆదర్శ, కస్తూర్బా విద్యాలయాల్లో బాలికల కోసమే కంప్యూటర్లు కేటాయించారు. వీరికి చదువుతో పాటు సాంకేతిక బోధన అందించేం దుకు వాటిని అందిస్తున్నాం. నేరుగా ఆయా పాఠశాలలకు అందించి ఇన్‌స్టాల్ చేయిస్తాం. కంప్యూటర్ బోధనను సద్వినియోగం చేసుకోవాలి. సుప్రియ, జిల్లా బాలికల అభివృద్ధి అధికారిణి, సంగారెడ్డి

# కాన్పు కష్టాలిక దూరం

ఆదిలాబాద్ : వర్షాకాలంలో రవాణా సౌకర్యం లేని, వాగుల పక్కనే ఉన్న గ్రామాల్లోని గర్భిణులు కాన్పుల సమయంలో ఇబ్బందులు పడకుండా వైద్య శాఖ జిల్లాలో 'బర్త్ వెయిటింగ్ రూం' (కాన్పుకోసం వేచిఉండే గది)లను ఇప్పటికే సిద్ధం చేసింది. వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నప్పుడు నొప్పులు వస్తే కాన్పు కోసం ఆసుపత్రికి తీసుకెళ్లటం దుర్లభంగా మారుతుంది. ఇలాంటి సందర్భాల్లో మాతా,శిశు మరణాలు జరిగే అవకాశాలు ఎక్కువ. జిల్లాలో 201 సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించింది. ఆయా గ్రామాల్లో ప్రసవ తేదీలు సమీపించిన గర్భిణులను వారం ముందే ఇక్కడికి తరలించటానికి ఏర్పాట్లు చేసింది.

జిల్లాలోని 22 పీహెచ్‌సీల పరిధిలో మొత్తం 201 గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా వైద్య శాఖ గుర్తించింది. ఈ గ్రామాల్లో మొత్తం జూన్‌లో 43 మంది గర్భిణులు కాన్పులు కావాల్సి ఉన్నట్లు



గుర్తించగా ఇప్పటికే 18 మంది ప్రసవం కాగా ఇంకా 25 మందికి కాన్పులు కావాల్సి ఉంది. సమస్యాత్మక గ్రామాల గర్భిణులకు వైద్య శాఖ అవగాహన కార్యక్రమాలను సిబ్బంది ద్వారా నిర్వహిస్తోంది. వాగులు, వంకలు ఉన్న గ్రామాలకు వెళ్లి కాన్పుల సమయంలో వరదల వల్ల ఇబ్బందులు పడకుండా కాన్పుకు వారం రోజుల ముందే నిర్దేశిత కాన్పు కోసం వేచి ఉండే గదులకు వెళ్లి ఆసుపత్రిలో కాన్పులు చేయించుకోవాలని సూచిస్తున్నారు. అంబులెన్స్‌లు సైతం సిద్ధం చేస్తున్నారు.

**జిల్లాలో పది చోట్ల..**

జిల్లాలోని పెద్దాసుపత్రి రిమ్స్, ఝరి, నేరడిగొండ, గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి పీహెచ్‌సీలు, నార్నూర్, ఉట్నూర్, బోథ్ సీహెచ్‌సీల్లో బర్త్ వెయిటింగ్‌రూంలను వైద్య శాఖ సిద్ధం చేసింది.

**ఇదీ పరిస్థితి..**

జిల్లాలో గర్భిణులు: 9,213

జూన్‌లో కాన్పు కావాల్సిన వారు 25

జులైలో ,, 50

ఆగస్టులో ,, 56

**అన్ని ఏర్పాట్లు చేశాం** రాథోడ్ నరేందర్, డీఎంహెచ్ఓ

జిల్లాలోని పది ఆసుపత్రుల్లో బర్త్ వెయిటింగ్ రూంలు సిద్ధం చేశాం. సమస్యాత్మక గ్రామాల్లో కాన్పు దగ్గర పడ్డ గర్భిణులను ప్రత్యేక అంబులెన్స్‌లో వారం, పది రోజులు ముందుగానే అక్కడకు తరలించి వసతి కల్పించడానికి ఏర్పాట్లు చేశాం. అక్కడ వారికి అన్ని వసతులు అందుబాటులో ఉంచి సుఖ ప్రసవాలు అయ్యేలా ఏర్పాట్లు చేశాం.

# సేంద్రియం.. సర్కారు మంత్రం!



పరిగి : వ్యవసాయంలో పెరుగుతున్న పెట్టుబడులను నియంత్రించేందుకు జిల్లా వ్యవసాయ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. సేంద్రియ సాగును పెంచడం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులను సాధించేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. తద్వారా అన్నదాతల్లో మార్పు తీసుకురావడం ద్వారా అనవసర ఖర్చులను, వాతావరణ కాలుష్యాన్ని నియంత్రిస్తూ ఆర్థికాభివృద్ధి దిశగా నడిపించాలని యోచిస్తోంది. ఈ వానాకాలం నుంచే సాగుకు శ్రీకారం చుడుతోంది. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

**ప్రస్తుతం రెండు శాతమే:** జిల్లా వ్యాప్తంగా ఈ పద్ధతిన సాగు చేస్తున్నది కేవలం రెండు శాతమే. వాస్తవానికి వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు పంట కాలం మొత్తం రెండు బస్తాల డీఏపీ ఎరువులు వాడితే చాలు. అలాంటిది ఎకరాకు ఆరు బస్తాల చొప్పున వినియోగిస్తున్నారు. దీంతో భూసారం నిస్సారంగా మారడంతో పాటు పంటలపై కీటకాల బెడద పెరుగుతోంది. వాతావరణ కాలుష్యం అధికమవుతోంది. కాంప్లెక్స్, డీఏపీ పైపాటుగా వేయకుండా దుక్కిలోనే వాడాలి. ఒక్క యూరియాను మాత్రమే పైపాటుగా చల్లుకోవాలి. కానీ ఇష్టానుసారంగా పైపాటుగా చల్లడండంతో ఆర్థిక భారం పెరిగి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. దీనిని అడ్డుకట్ట వేసేందుకు సేంద్రీయ విధానాన్ని అమలు చేస్తున్నారు.

**అమలు ఇలా..**

జిల్లాలో 20 మండలాలను ఎంపిక చేశారు.

ఒక మండలానికి ఒక క్లస్టరును ఒక గ్రామాన్ని ఎంపిక చేశారు.

దాని పరిధిలో 125ఎకరాలను 125మంది రైతుల ద్వారా సహజ సాగును ప్రోత్సహించనున్నారు.

జిల్లా వ్యాప్తంగా 100క్లస్టర్లలో పథకాన్ని అమలు చేయనున్నారు.

రెండు క్లస్టర్లకు కలిపి ఒక బయో ఇన్‌పుట్ రిసోర్సు సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు. ఎంపిక చేసిన ప్రతి రైతుకు రూ.2వేల చొప్పున రెండేళ్ల పాటు అందజేస్తారు.

గణామృతం, జీవామృతం వంటి వాటిని సరఫరా చేస్తారు.

జిల్లాకు 13 బీఆర్సీ సెంటర్లు వచ్చాయి.

రసాయనిక ఎరువులు వాడకుండా సేంద్రియ ఎరువుతో సాగు చేసేలా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

సఖీ కేంద్రాల్లోని మహిళలను కూడా ఇందులో భాగస్వామ్యం చేయనున్నారు. **రైతుల్లో మార్పు తెస్తాం**

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను సాధించేందుకు రైతుల్లో మార్పు తెస్తాం. ఈక్రమంలోనే సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాం. అధిక మోతాదులో ఎరువుల వినియోగంతోనూ దిగుబడులు పడిపోతున్నాయి. రైతు వేదికల ద్వారా శాస్త్రవేత్తల సహకారంతో రైతులకు సాంకేతిక సహకారాన్ని అందిస్తూ చైతన్యం తెస్తున్నాం. ఎన్.మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

# సర్కారు జాగాలెక్కడ?



కరీంనగర్ : కరీంనగర్ నడిబొడ్డున భగత్‌నగర్‌లోని ఓ ఆక్రమిత స్థలాన్ని ఇలా పొక్లెయిన్‌తో నేలమట్టం చేశారు. జిల్లా పరిషత్తుకు చెందిన 2 గుంటల భూమిని దర్జాగా కొందరు కబ్జా చేశారు. బహిరంగ మార్కెట్‌లో దాదాపుగా రూ.కోటి విలువ చేసే ఈ భూమిని జిల్లా కలెక్టరు పమేలా సత్పతి ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది తిరిగి స్వాధీన పర్చుకున్నారు. అందులో నిర్మించిన రేకుల షెడ్డు, ప్రహరీని తొలగించారు. జడ్పీ క్వార్టర్స్‌కు సమీపంలోని ఈ స్థలం కొన్నేళ్లుగా కబ్జాదారుల చెరలో ఉన్నా ఎవరూ పట్టించుకోలేదు. ఇటీవల జడ్పీ సీఈవో పరిశీలనలో ఇది కబ్జా అని తేలడంతో చర్యలు తీసుకున్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో ప్రభుత్వ భూముల విషయంలో అధికారులు ఆలస్యంగా మేల్కొన్నారు. జిల్లా కేంద్రంలోని చాలా శాఖల పరిధిలో విలువైన భూములున్నాయి. కాలక్రమేణా పలుచోట్ల ఇతరుల చేతుల్లోకి కొన్ని వెళ్లగా.. మిగిలినవి అక్కడక్కడా ఉన్నాయి. రెవెన్యూ రికార్డుల్లో మాత్రం భూ విస్తీర్ణం పక్కాగా ఉన్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం స్థలాల ఆనవాళ్లు సరిగా లేవు. గతంలో కొందరు కలెక్టర్లు ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ప్రతి మూడు నెలలకో మారు సమీక్ష చేసి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల ఇది ప్రభుత్వ స్థలమని గుర్తించేందుకు వీలుగా రాతి కడీలను ఏర్పాటు చేసి వాటికి నీలం, పసుపు రంగులను వేసి ఆక్రమణ కాకుండా కాపాడారు. అయితే గడిచిన దశాబ్ద కాలంగా మాత్రం ఏ శాఖకు చెందిన స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయనే విషయంలో క్షేత్రస్థాయిలో గుర్తింపు కరవైంది. అధికారులు మారుతుండటంతో ఎవరూ పట్టించుకోలేదు. దీంతో అందినకాడికి ఆక్రమణదారులు తమ భూదాహాన్ని మెల్లిమెల్లిగా తీర్చుకున్నారు.

**భూముల అన్వేషణలో భాగంగా..**ఇటీవల కరీంనగర్ పట్టణంలో సామాజిక అవసరాల కోసం ప్రభుత్వ భూములు అవసరమయ్యాయి. కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ భవనాల నిర్మాణాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కరీంనగర్ ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయించేందుకు కేంద్ర మంత్రికి వినతిని అందించారు. ఇందులో భాగంగానే అనువైన స్థలం కోసం అన్వేషించే క్రమంలో సరైన స్థలం లభించలేదు. ఇదే విధంగా కేంద్ర నిఘా కార్యాలయం ఏర్పాటు, నార్కొటిక్ కార్యాలయం మొదలగువాటి కోసం స్థలాలు అవసరమయ్యాయి. దీంతో ఉన్నపళంగా కలెక్టరు పమేలా సత్పతి నగరంలో అన్ని చోట్ల ఉన్న స్థలాల ఆచూకీపై పక్కాగా నజర్ పెట్టాలని రెవెన్యూ, సర్వే విభాగం అధికారులను ఆదేశించారు. దీంతో పాత రికార్డులను పరిశీలిస్తూ భౌతికంగా స్థలాలెక్కడున్నాయనే దిశగా అధికారులు దృష్టి పెడుతున్నారు. ఈ క్రమంలో జడ్పీ స్థలం గుర్తించి అందులో ఉన్న రేకుల షెడ్డు కూల్చివేశారు.

# ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కష్టాలు



గంగాధర : గూడు లేని పేద కుటుంబాలకు ఇందిరమ్మ పథకంలో ఇల్లు నిర్మించి కల సాకారం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదట పైలట్ ప్రాజెక్టుగా మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. తర్వాత నియోజకవర్గానికి 3500 చొప్పున లక్ష్యంగా నిర్ణయించి మొదటి విడతలో కొన్నింటిని మంజూరు చేశారు. జిల్లాలో 7728 ఇళ్లకు మంజూరు ఇచ్చిన అధికారులు 3325 నివాసాలకు మార్కవుట్ ఇచ్చారు. స్థానికంగా ఇసుక లభించకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

**ముంచుకొస్తున్న వర్షం ముప్పు** అసలే వర్షాకాలం.. వానలు కురిస్తే పునాదులు తవ్వడం ఇబ్బందిగా ఉంటుందని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. గతంలోనైతే వాగులు, గుర్తింపు పొందిన రీచ్‌ల్లో ఇసుక లభించేది. కానీ పోలీసుల దాడుల నేపథ్యంలో నిర్మాణాలకు లభించడంలేదని ఆవేదన చెందుతున్నారు. నాలుగు దశల్లో రెండు ట్రిప్పుల చొప్పున 8 ట్రాక్టర్ల ఇసుకను ఉచితంగా ఇవ్వడానికి నిర్ణయించిన అధికారులు జిల్లాలో మొత్తం 22 ఇసుక రీచ్‌లు గుర్తించారు. బేసిమెంట్ స్థాయిలో 2 ట్రిప్పులు, గోడలు, సజ్జల స్థాయిలో రెండు, స్లాబ్ స్థాయిలో 2, ఇంటి నిర్మాణం పూర్తయ్యాక 2 ట్రిప్పుల చొప్పున ఉచితంగా ఇసుక అందజేస్తారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించకపోవడంతో వారు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కార్యదర్శులకు అనుమతి టోకెన్లు అందజేశామని, వారిని కలవండని అధికారులు చెబుతున్నా.. స్పష్టత లేక లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. ఉపాధి హామీ పథకంలో మంజూరైన పశువుల పాకల నిర్మాణానికీ ఇసుక కష్టాలు వెంటాడుతున్నాయి.

**ముగ్గు పోసి వారమైంది –లావణ్య, గంగాధర**

మా మామ నారాయణకు చెందిన రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నాం. ఇందిరమ్మ పథకంలో ఇల్లు మంజూరైందంటే సంతోషించాం. కానీ ఇసుక దొరక్క వారం రోజుల కింద ముగ్గు పోసి ఇబ్బంది పడుతున్నాం. వర్షాలు కురిస్తే ఇంటి నిర్మాణానికి అవస్థలు పడాల్సి ఉంటుంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

**అద్దె ఇంట్లో ఉంటున్నాం– రేష్మ, పత్తికుంటపల్లి**

ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసి 10 రోజులైంది. ఇసుక దొరక్క పనులు మొదలుపెట్టలేదు. వర్షాలు కురిస్తే తవ్విన పునాదిలో మట్టి కూలి ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాం. ఉచితంగా ఇసుక అందజేసి ఇంటి నిర్మాణానికి సహకరించాలి.

**కార్యదర్శులతో కూపన్లు అందజేత – గంగాధర్, గృహనిర్మాణ శాఖ పీడీ** జిల్లాలో 22 ఇసుక రీచులను గుర్తించి ఉచితంగా అందజేసేందుకు ఇప్పటికే గ్రామ పంచాయతీ కార్యదర్శులకు టోకెన్ల జారీ బాధ్యతలు అప్పగించాం. లబ్ధిదారులు కార్యదర్శులను సంప్రదించాలి.

# సమీకృతం.. సందిగ్ధం!

కాగజ్‌నగర్: సుమారు లక్ష జనాభా నివాసం ఉంటున్న కాగజ్‌నగర్ బల్దియాలో సరైన మార్కెట్లు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. రోజూ మార్కెట్‌తోపాటు అంబేడ్కర్ చౌరస్తా, ఎల్లగౌడ్‌తోట రోడ్డు, ఎస్బీఐ రోడ్డు, ఎన్టీయార్ చౌరస్తా, సర్‌సిల్క్ కాలనీల్లో రోడ్లపై దుమ్ము ధూళి మధ్య కూరగాయలు, మాంసం, చేపల విక్రయాలు కొనసాగుతున్నాయి. దీంతో ప్రజారోగ్యం ప్రశ్నార్థకంగా మారింది. ప్రతి ఆదివారం నిర్వహించే సంతతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలంగా మారుతోంది. గత భారాస ప్రభుత్వ హయాంలో 2020లో పురపాలికకు సమీకృత మార్కెట్ మంజూరైనప్పటికీ నిర్మాణానికి నోచుకోవడం లేదు. రూ.7 లక్షల నిధులు ఏళ్ల తరబడి మూలుగుతున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. పాలకవర్గం హయాంలో అధికారులు మార్కెట్ నిర్మాణానికి అనేక స్థలాలు పరిశీలించిన అనంతరం ఆదర్శనగర్ సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న బారెగూడ శివారులో స్థలాన్ని ఎంపిక చేసి భూమిపూజ కూడా చేశారు. అనంతర కాలంలో వివిధ కారణాల దృష్ట్యా అక్కడి నుంచి ఇతర చోటికి తరలించి నిర్మాణం చేపట్టేందుకు తీర్మానించారు. మరోసారి పరిశీలించి ఆర్‌అండ్‌బీ స్థలంలో నిర్మించేందుకు టెండర్లు పిలిచారు. ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ భవనం శిథిలావస్థలో ఉండడంతో.. దాన్ని కూల్చి మార్కెట్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

**అన్నీ ఒక్కచోటకే..**

పట్టణంతోపాటు నియోజకవర్గం, మండలంలోని అనేక గ్రామాల నుంచి వ్యాపారులు నిత్యం కాగజ్‌నగర్‌కు వస్తుంటారు. చిరు వ్యాపారులు కూరగాయలను ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూనే విక్రయాలు జరుపుతున్నారు. పూలు, పండ్లు, తాజా కూరగాయలు ఒకేచోట అమ్మకాలతోపాటు మరోవైపు మటన్, చికెన్, చేపలు తదితర మాంసం విక్రయాలకు ప్రత్యేక వసతులతో కూడిన సమీకృత మార్కెట్‌ను రూపొందించారు. ఉపాధి అవకాశాలతోపాటు వినియోగదారులకు సౌలభ్యంగా ఉంటుందన్న ఉద్దేశంతో దీని నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. అట్టహాసంగా శంకుస్థాపన చేసినప్పటికీ నేటికీ పనులు ప్రారంభం కాలేదు. లక్షల నిధులు విడుదల అయినప్పటికీ నిర్మాణాలు మాత్రం ప్రారంభం కాలేదు. ఈ నిర్మాణాలు పూర్తయితే కాగజ్‌నగర్‌లో కూరగాయలు, మాంసం, చేపలు తదితర వాటి క్రయవిక్రయాలన్నీ ఒకేచోట విక్రయించే అవకాశం ఉంటుంది.

**ముందడుగు పడేనా?**

పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న ఆర్‌అండ్‌బీ అతిథి గృహం శిథిలమైందని, ఈ స్థలంలో నిర్మాణం చేపట్టేందుకు అప్పటి పాలకవర్గం అనుమతులు తీసుకున్నారు. అతిథిగృహం భవనం కూల్చివేస్తే ఆ స్థలం అనుకూలంగా ఉంటుందని ప్రభుత్వానికి లేఖ రాయడంతో అనుమతి లభించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత తిరిగి నిర్మాణ పనులు చేయాలని అధికారులు భావించినప్పటికీ.. టెండరు పొందిన గుత్తేదారు మృతి చెందడంతో పనులు మొదలు కాలేదు. ఎన్నికలు ముగిసి కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి 18 నెలలు గడుస్తోంది. బల్దియాలో పాలకవర్గం సైతం లేకపోవడంతో.. అధికార యంత్రాంగం స్పందించి ప్రజల అవసరాల దృష్ట్యా సమీకృత మార్కెట్ నిర్మాణానికి అడుగులు వేయాల్సిన అవసరం ఉంది.

# సిరాలపై చిగురిస్తున్న ఆశలు

భైంసా : భైంసా మండలం సిరాల శివారులో శ్రీరామసాగర్ (సిరాల) ప్రాజెక్టు 135 ఏళ్ల క్రితం నిజాం కాలంలో నిర్మించారు. అప్పట్లో నియోజకవర్గంలోనే అతిపెద్ద ప్రాజెక్టు అది. సిరాల, ఇలేగాం, మచ్కల్, దేగాం శివారులోని 1,895 ఎకరాల ఆయకట్టుకు రెండు పంటలకు నీరందేది. కాల క్రమంలో పూడిక చేరి ఆయకట్టు 1500 ఎకరాలకు పడిపోయింది. 2023 జులై 28న కురిసిన భారీ వర్షాలకు ఎగువన ఉన్న చెరువులు తెగి పోవడంతో వరద ఉద్ధృతికి కట్ట కొట్టుకుపోయింది. దీని దిగువన వరద కాలువపై నిర్మించిన కొత్త చెరువు సైతం తెగి కాలువలు దెబ్బతిన్నాయి. దీంతో రైతుల పొలాలు కొట్టుకుపోయి పూడ్చని నష్ట వాటిల్లింది. అప్పటి నుంచి రెండేళ్లుగా సాగు నీటికి నోచుకోలేదు. అధికారులు అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదించారు. 2024లో ప్రభుత్వం రూ.12.46 కోట్లకు ఆర్థికపరమైన అనుమతి ఇచ్చింది. టెండర్లు పిలిచే నాటికి వానాకాలం రావడంతో పనులు చేపట్టలేదు. ఈ ఏడాది జనవరిలో ప్రాజెక్టుతో పాటు వరద కాలువపై నిర్మించిన కొత్త చెరువు పునర్నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆరు నెలల్లో ఆనకట్ట ప్రధాన తూము పనులు పూర్తయ్యాయి. కొత్త చెరువును పునరుద్ధరించారు. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురించాయి. సాగు నీటిపై భరోసా కలుగుతోంది. మిగిలిన చిన్న చిన్న పనులను పూర్తి చేసి ఖరీఫ్ పంటలకు నీరందిస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**కాలువల పనులు ఎలా..?**

కాలువ కొట్టుకు పోయినచోట మొరం వేశారు. కాలువ తవ్వి తీయాల్సి ఉంది. దెబ్బతిన్న చోట్ల మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. 9.5 కి.మీ. పొడవు ఉన్న ప్రధాన కాలువలో ఏపుగా పెరిగిన తుంగ,



పిచ్చి మొక్కల తొలగింపు, పూడికతీత పనులు మిగిలి ఉన్నాయి. వానాకాలం రావడంతో పనులు నిలిచి పోతాయేమోనని, సాగు నీటిపై లభ్యతపై రైతుల్లో అనుమానాలు చోటు చేసుకుంటున్నాయి.

**రెండేళ్లు నష్టపోయాం ఉప్పు సంతోశ్, రైతు, ఇలేగాం**

కట్ట తెగడంతో ఇప్పటికే నాలుగు పంటలు నష్ట పోయాం. ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటాయి. చెరువు పూర్తి కావడంతో సాగు నీరు అందుతుందనే నమ్మకం పెరిగింది.

**కాలువలు బాగు చేస్తేనే..**చెవుల నరేశ్, రైతు, సిరాల

చెరువు పనులు పూర్తయినా.. కాలువలు బాగులేక సాగు నీరందే అవకాశం లేదు. వానాకాలం వచ్చేసింది. పనులు చేపడుతారో లేదోనని అనుమానంగా ఉంది. వెంటనే కాలువలో తుంగ, పూడిక తొలగించి బాగు చేస్తేనే సాగు నీరందే అవకాశం ఉంది. **తుంగ తొలగించాలి**సిరం శ్రీనివాస్, రైతు, ఇలేగాంప్రధాన కాలువ పొడవునా తుంగ పెరిగింది. దిగువన ఉన్న మచ్కల్, దేగాం గ్రామాల పొలాలకు నీరు వెళ్లే అవకాశం లేదు. వెంటనే తుంగ తొలగింపు పనులు చేపట్టాలి.**సాగు నీరందిస్తాం** అనిల్‌కుమార్‌జాదవ్, ఈఈ, నీటిపారుదల శాఖ, నిర్మల్‌ప్రాజెక్టు పనులు ఆరు నెలల్లో పూర్తి చేశాం. ఖరీఫ్‌కు సుమారు 1800 ఎకరాలకు సాగు నీరందించేందుకు సిద్ధంగా ఉన్నాం. కాలువ దెబ్బతిన్న చోట నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. 15 రోజుల్లో తుంగ, పూడిక తొలగించి కాలువను శుభ్రం చేసి రైతుల పంటలకు నీరందిస్తాం.

చురకలు



# పసుపు సాగుకు మొగ్గు

జగిత్యాల : రెండేళ్లుగా పసుపు కొమ్ములకు మంచి ధర పలకటం, నిజామాబాద్‌లో పసుపుబోర్డు ఏర్పాటుతో ఈ వానాకాలంలో పసుపుపంట సాగుపై జిల్లా రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. రాష్ట్రంలో నిజామాబాద్ తర్వాత జగిత్యాల జిల్లాలోనే అధిక విస్తీర్ణంలో పసుపుపంటను విత్తుకోనున్నట్లు అధికారులు అంచనా వేస్తుండగా రైతులకు సర్కారు దన్ను కల్పించాల్సి ఉంది.ప్రస్తుతం పసుపు విత్తన లభ్యత ప్రధాన సమస్యగా మారింది. ఎకరాకు కనీసం 8-12 క్వింటాళ్ల విత్తనం అవసరం ఉంటుండగా క్వింటాలుకు రూ.5 వేల వరకు వెచ్చిద్దామన్నా విత్తన పసుపు లభించటంలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇతర రాష్ట్రాల నుంచి మన నేలలకు అనువైన విత్తనాన్ని తెప్పించి ఇవ్వాలి. జిల్లాలో కనీసం 30 వేల ఎకరాల్లో పసుపు పంటను సాగుచేయనున్నందున నిజామాబాద్‌లోని జాతీయ పసుపుబోర్డు అధికారులు, కమ్మర్‌పల్లి పసుపు పరిశోధనస్థానం శాస్త్రవేత్తలతో ముందస్తు సాగు సలహాలను అందించాలి. ఉద్యానశాఖ ద్వారా పసుపు విత్తనం, బిందుసేద్య పరికరాలను రాయితీపై ఇవ్వాలి. పసుపు బోర్డు ద్వారా విత్తనంతో పాటు యంత్రపరికరాలు రాయితీపై ఇవ్వాలి.

జిల్లాలో దుగ్గిరాల(ఎర్రగుంటూరు) ఏసీసీ79 తదితర రకాలు సాగులో ఉండగా బీఎస్ఆర్1, బీఎస్ఆర్2, సేలం, పీటీఎస్10, ఏసీసీ49, ప్రతిభ, రాజేంద్రసొనాలి, రాజేంద్రసోనియ తదితర మేలురకం విత్తనాలకు తెప్పించి రైతులకు అందించాలి.

ప్రస్తుతం పసుపు సాగుచేస్తున్న రైతులు పశువుల ఎరువు, వర్మికంపోస్టుతో పాటు పెద్దఎత్తున చెరువుల్లోని పూడికమట్టిని తోటలకు తరలించారు. పసుపులో మిశ్రమసాగుకు అనువైన మక్క విత్తనాలను కూడా రాయితీపై ఇవ్వాల్సిఉంది.



పసుపు దీర్ఘకాలిక పంట కాబట్టి ఈ సీజన్‌లో అధికధరతో రైతులు పసుపుసాగుకు మళ్లుతున్నా మళ్లీ వచ్చే వేసవివరకు ధరలు తగ్గకుండా ప్రభుత్వం పసుపుబోర్డు ద్వారా ఎగుమతులకు అవకాశం కల్పించాలి. రైతులు కోరుతున్నట్లుగా కేంద్రప్రభుత్వం పసుపునకు క్వింటాలుకు రూ.15 వేల కనీస మద్దతు ధర కల్పించాలి.

ఉమ్మడి జిల్లాలో ఉద్యాన పంటలపై పరిశోధనలు సాగించేలా జగిత్యాల మండలం వాలంతరి ప్రదర్శన క్షేత్రంలో ఉద్యాన పరిశోధనస్థానం ఏర్పాటుచేస్తే పసుపుతోపాటు మామిడి, మిరప, కూరగాయలు పండించే రైతులకు ఆసరాగా ఉంటుంది. మల్యాలలో ఉద్యాన కేవీకేను ఏర్పాటు చేయటం, పడిగెల్ వద్ద తలపెట్టిన స్పైసెస్‌పార్కు నిర్మాణాన్ని పూర్తిచేయటం, మన జిల్లాలోనూ పసుపు పాలిషింగ్, పొడి, రంగులు తదితర ఉప ఉత్పత్తుల తయారీ పరిశ్రమలను ఏర్పాటుచేస్తే ధరలో స్థిరత్వంతో రైతులకు దీర్ఘకాలికంగా లాభించనుంది.

# వానాకాలం గట్టెక్కేదెలా!

పెద్దపల్లి : పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది. చిన్నపాటి వర్షాలకే రహదారులు చిత్తడవుతున్నాయి. వీధుల్లో చెత్తా చెదారం పేరుకుపోతోంది. ఇళ్లలో సేకరించిన చెత్త తరలింపులో జాప్యం నెలకొంది. డీజిల్ కొరతతో పంచాయతీ ట్రాక్టర్లు కదలడం లేదు. బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు కోసం దిక్కులు చూడాల్సిన పరిస్థితి. పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో బ్లీచింగ్ పౌడర్, వీధి దీపాలు, డీజిల్, ఇతర అవసరాలకు సొంత డబ్బులు వెచ్చిస్తున్నామని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ సాధారణ నిధులు ఖర్చు చేసుకునే అవకాశం లేదు. వర్షాకాలం ప్రారంభం కావడంతో ఈసారి పారిశుద్ధ్య పనులు ఎలా చేయాలనే విషయమై సందిగ్ధం నెలకొంది.

**ఇవీ సమస్యలు**

తట్టలు, పారలు, పలుగులు, కొడవళ్ల కొనుగోలుకు నిధులు లేవు.

ట్రాక్టర్లకు డీజిల్ డబ్బులు లేక సేకరించిన చెత్తను తరలించడం లేదు.

బల్బుల ఏర్పాటుకు నిధులు లేక వీధుల్లో అంధకారం నెలకొంటోంది.

గతంలో జారీ చేసిన చెక్కులపై ఫ్రీజింగ్ ఉంది.

నిర్వహణ భారంతో ట్రాక్టర్లు మూలనపడుతున్నాయి.

ట్రాక్టర్లను వినియోగించుకోవాలంటూ అధికారులు ఒత్తిడి తెస్తున్నారు.

**నిర్వహణ భారమే**జిల్లాలో 267 పంచాయతీలుండగా వర్షాకాలంలో అంతటా రోడ్లు ధ్వంసమవుతున్నాయి. మురుగు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ యంత్రాలను ముందస్తుగా



సిద్ధం చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించినా నిధులు కేటాయించలేదు. దీంతో ఊరంతటికీ కలిపి ఒకసారి ఫాగింగ్ చేయాల్సి వస్తే ద్రావణం, పెట్రోల్, డీజిల్ కొనుగోలుకు కనీసం రూ.4 వేలు ఖర్చవుతోంది. పంచాయతీ ఖాతాల్లో నిధులు లేకుంటే ఫాగింగ్ ఎలా చేయాలో అర్థం కాని పరిస్థితి. గతంలో కొనుగోలు చేసిన వీధి దీపాలు, బ్లీచింగ్ పౌడర్, తాగునీటి పరికరాలకు సంబంధించి బకాయిలుండటంతో దుకాణదారులు తిరిగి అరువుపై ఇచ్చేందుకు వెనకాడుతున్నారు.

**పొంచి ఉన్న వ్యాధుల ముప్పు**

వానాకాలంలో సీజనల్ వ్యాధుల భయం పొంచి ఉంది. ఏటా అపరిశుభ్ర వాతావరణంతో వేల సంఖ్యలో ప్రజలు మంచం పడుతున్నారు. డెంగీ, మలేరియా, చికెన్‌గన్యా వ్యాధులు కోరలు విప్పుతున్నాయి. పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో వానాకాలం గండం నుంచి ఎలా తప్పించుకోవాలో తెలియడం లేదు. గతంలో పంచాయతీలకు నెలకు రూ.7.50 కోట్ల ఆర్థిక సంఘం నిధులు జమయ్యేవి. పాలకవర్గాలు లేకపోవడంతో ఈ నిధులు నిలిచిపోయాయి. గ్రామాల్లో పైపులైన్ల లీకేజీ ఆందోళన కలిగిస్తోంది. లీకేజీల మరమ్మతుకు నిధుల సమస్య తలెత్తింది. ప్రత్యామ్నాయంగా కేటాయిస్తేనే సమస్యలు తొలగనున్నాయి. **పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి**

-వీరబుచ్చయ్య, జిల్లా పంచాయతీ అధికారి

పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాం. మురుగు నిలిచే ప్రాంతాలను గుర్తిస్తున్నాం. ఫాగింగ్ యంత్రాలు సిద్ధం చేశాం. బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ ద్రావణాలు కొనుగోలు చేసుకోవాలని సూచిస్తున్నాం. పారిశుద్ధ్య పనులకు నిధులు మంజూరు కానున్నాయి. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా పారిశుద్ధ్యం మెరుగుపరుస్తాం.

# ఆగితే మాకేంటి?



హైదరాబాద్: అభివృద్ధి జరిగితే ఏంటి.. జరగకపోతే ఏంటి.. కమీషన్లు వచ్చాయా.. లేదా అన్నదే ముఖ్యం.. జీహెచ్ఎంసీలోని పలువురు ఇంజినీరింగ్ ఉన్నతాధికారుల తీరు ఇది. అసమర్థత, లంచాలకు మరిగి.. ప్రజలకు అవసరమైన పనులను కూడా గందరగోళంగా మార్చుతున్నారు. అందుకు ఎస్ఎన్‌డీపీ-2 ప్రాజెక్టు, హెచ్-సిటీ ప్రాజెక్టులు నిలువెత్తు నిదర్శనం. ఓ ఇంజినీరింగ్ ఉన్నతాధికారి.. హడావుడిగా ఎస్ఎన్‌డీపీ పనులకు టెండర్లు పిలిచి రూ.4.5 కోట్ల కమీషన్ తీసుకుని చేతులు దులిపేసుకున్నారు. టెండరు ప్రక్రియలోని లోపాలతో పనులు ఇప్పటికీ మొదలవలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాదిన్నర కిందట రూ.7వేల కోట్ల పనులకు శంకుస్థాపన చేసింది. టెండరు ప్రక్రియ సరిగా చేపట్టకపోవడం, ఇతరత్రా కారణాలతో ఏడాదిన్నర అవుతున్నా.. పాతబస్తీలోని ఓ రోడ్డు విస్తరణ పని మినహా.. ఒక్కటీ మొదలవలేదు. ఇంజినీరింగ్ ఉన్నతాధికారుల తీరుతో నాసిరకం పనులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

**ఒక్క పనీ ముందుకు సాగితే ఒట్టు..**

చెరువుల మధ్య గొలుసుకట్టు నాలాల అభివృద్ధికి ఏడాది కిందట ప్రస్తుత సర్కారు రూ.650 కోట్లతో ఎస్ఎన్‌డీపీ-2 పనులకు టెండర్లు పిలిచింది. కానీ ఇప్పటి వరకు ఒక్క పని కూడా మొదలవలేదు. ఇదేంటని ఓ ఇంజినీరింగ్ ఉన్నతాధికారిని అడిగితే.. క్షేత్రస్థాయి సర్వే చేపట్టకుండా.. కన్సల్టెన్సీ ఇచ్చిన ప్రతిపాదనలకు నేరుగా టెండర్లు పిలిచారని, సైట్ క్లియరెన్స్ సర్టిఫికెట్లు లేకపోవడం, స్థానికుల అభ్యంతరాలతో పనులు చేపట్టలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఎందుకలా అని ప్రశ్నిస్తే.. ఆయన బదులిస్తూ.. ఒక శాతం కమీషన్ కోసం టెండర్లను హడావుడిగా పూర్తి చేసి, రూ.450 కోట్ల పనులకు గుత్తేదారులతో ఒప్పందాలు పూర్తి చేశారని, రూ.4.5 కోట్లు చేతులు మారినట్లు తెలిపారు.

**క్షేత్రస్థాయిలో దారుణం..**

రోడ్డుపై నిలిచే నీరు.. మ్యాన్‌హోల్ నుంచి భూగర్భ వరద నీటి పైపులైనులోకి వెళ్లాలి. కానీ.. పైపులైనులోని నీరు రోడ్డుపైకి చేరుకునేలా.. కేబీఆర్ పార్కు ఎదురుగా ఉన్న జూబ్లిహిల్స్ రోడ్డు నెం.14లో ఇంజినీర్లు పనులు చేపట్టారు. రోడ్డుకు అడుగు ఎత్తున మ్యాన్‌హోళ్లను ఏర్పాటు చేశారు. పంజాగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా.. ప్రధాన రహదారిపై ఆర్నెల్ల కిందట చేపట్టిన వరదనీటి పైపులైను, రోడ్డు పునరుద్ధరణ పనులు అప్పుడే దెబ్బతిన్నాయి.

రోడ్డు నిర్మించకుండానే ఐఎస్ సదన్ డివిజన్‌లో ఇంజినీర్లు, గుత్తేదారు కలిసి రూ.9లక్షల బిల్లులు నొక్కేశారు. కాచిగూడ ప్రధాన రహదారిపై, హైదర్‌గూడ ప్రధాన రహదారిపై భూగర్భ వరద నాలా నిర్మాణం, రోడ్డు పునరుద్ధరణ పనులు తూతూమంత్రంగా జరిగాయి.

భూసేకరణ, ఇతర సమస్యలేమీ లేకున్నప్పటికీ.. అమీన్‌పూర్‌లో రోడ్డు విస్తరణ చేపట్టేందుకు చీఫ్ ఇంజినీరు ఆసక్తి చూపట్లేదని స్థానిక ప్రజాప్రతినిధులు గగ్గోలుపెడుతున్నారు.

# భూములు తక్కువ.. పాస్‌పుస్తకాలు ఎక్కువ!



హైదరాబాద్: భూ భారతి పోర్టల్‌లో రెవెన్యూ రికార్డులు లోపరహితంగా ఉండాలన్న లక్ష్యంతో రంగారెడ్డి జిల్లాలో ఉన్నతాధికారులు సేత్వారు రికార్డులను సవరించనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా సర్వే నిర్వహించనున్నారు. ధరణిలో భూముల రికార్డులు అస్తవ్యస్తంగా ఉన్నాయని.. పట్టా భూములను నిషేధిత జాబితాల్లో చేర్చారని.. ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు కొత్త సర్వేనంబర్లు సృష్టించారన్న ఆరోపణలు.. ఫిర్యాదులు రావడంతో రెవెన్యూ ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో మండలాల వారీగా సేత్వారు రికార్డులను పరిశీలించారు. 95శాతం మండలాల్లో రెవెన్యూ రికార్డుల్లో భూముల కంటే పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఎక్కువగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఒక్కో మండలంలో 500 ఎకరాల నుంచి 800 ఎకరాలు ఎక్కువగా ఉన్నాయని తేలింది. సమగ్ర సర్వే నిర్వహించాక అక్రమ పట్టాదారులకు తాఖీదులు ఇచ్చి రెవెన్యూ రికార్డులను సవరించనున్నారు.

**అదనపు నంబర్లు సృష్టించి..**రంగారెడ్డి జిల్లాలోని 26 మండలాల్లో రెవెన్యూ రికార్డులను అధికారులు క్షుణ్నంగా పరిశీలించారు. జిల్లాలో అభివృద్ధి పుంజుకోవడంతో అక్రమార్కులు ప్రభుత్వ, అసైన్డ్ భూముల వివరాలను సేకరించి ఆయా సర్వే నంబర్లకు బై నంబర్లు వేసి రెవెన్యూ రికార్డుల్లోకి చేర్పించుకున్నారు. ధరణి పోర్టల్ వచ్చాక కొందరు కిందిస్థాయి రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు చేయించుకున్నారు. దీంతో అక్రమార్కులు కొట్టేసిన వ్యవసాయ భూములకు రైతుబంధు పథకం కింద నగదు కూడా వారి ఖాతాల్లో జమయ్యింది.**జమాబందీ వ్యవస్థ లేకపోవడంతో..**

భూ భారతి చట్టం ప్రకారం సేత్వారు రికార్డులను, ప్రస్తుత రికార్డులను పరిశీలిస్తున్నామని, ఏఏ సర్వే నంబర్లలో పట్టాదారు పాసుపుస్తకాలున్నాయన్నది గుర్తించామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. సేత్వారు రికార్డుల ప్రకారం ఒక సర్వే నంబరులో భూమి విస్తీర్ణం ఎంతుంటే అంతమేరకే రికార్డులను సవరిస్తామని, భూ విస్తీర్ణం కంటే ఎక్కువగా ఉన్న పట్టాదార్ పాస్‌పుస్తకాలను నిబంధనల ప్రకారం తొలగిస్తామని వివరించారు.

# కాలెట్టా మోపేది.. కసరత్తెలా చేసేది?



వికారాబాద్ : ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరిగింది. ఉద్యోగులు, విద్యార్థులు, యువతీ, యువకులు సమయానుకూలంగా నడకను ప్రారంభించారు. కానీ పురపాలికల్లో ప్రత్యేక స్థలాలు లేకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారుల అంచున నడుస్తూ ప్రాణాలు కోల్పోతున్నారు.

**పేరుకే పార్కు..**

వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 36 పార్కుల్లో రెండు చోట్లనే సౌకర్యాలున్నాయి. వార్డుల్లో ఉన్న ఖాళీ స్థలాల చుట్టూ ప్రహరీలు నిర్మించి వాటిని పార్కులంటున్నారు. కమలానగర్ కాలనీలో వాకింగ్ ట్రాక్ ఉంది. అదీ చివర్లో చిన్న పాటి ఇటుకుగోడను నిర్మించి ట్రాక్‌గా మార్చారు. సాకేత్‌నగర్‌లో ఓపెన్ జిమ్ కోసం 5ఏళ్ల క్రితం పరికరాలను ఏర్పాటు చేశారు. అక్కడా నడకదారి లేదు. జిమ్‌లో పరికరాలు సగం దెబ్బతిన్నాయి. ఈ విషయమై కమిషనర్ జాకీర్ అహ్మద్ మాట్లాడుతూ.. ఉద్యానాల అభివృద్ధికి రూ.1.80కోట్లు నిధులు మంజూరు చేశామని.. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.

**చెత్త దిబ్బలుగా మారాయి..**తాండూరు పట్టణంలో ఉద్యానాలు ఉన్నప్పటికీ కనీస వసతులు లేవు. 36 వార్డుల్లో మొత్తం 71,008 జనాభా అవసరాలకు 9ఉద్యానాలు ఉన్నాయి. వాటిలో పచ్చదనం, ఆహ్లాదం కనిపించదు. ఉద్యానాలు చెత్తదిబ్బ కేంద్రాలుగా మారాయి. ప్రహరీలు, గేట్లు విరిగి పోయాయి. ఆట పరికరాలు విరిగి పోయి నిరుపయోగంగా పడి ఉన్నాయి. కొన్ని చోట్ల వాకింగ్ ట్రాక్‌లు ఉన్నా.. అపరిశుభ్రంగా ఉన్నాయి. వాటిపై ఎవరూ నడవటం లేరు. ఆదర్శనగర్ కాలనీలో రూ.6కోట్లు నిధులు మంజూరైనా పనులు ముందుకు సాగలేదు. వాటి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని పురపాలిక కమిషనరు విక్రమ్‌సింహారెడ్డి తెలిపారు.

**రెండింటికి ప్రతిపాదనలు**పరిగి పట్టణంలో పార్కులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది స్థానికంగా ఉన్న ఇండోర్ స్టేడియం ఆవరణలో నడుస్తున్నారు. ప్రత్యేక స్థలం లేని కారణంగా ప్రధాన రహదారులపై ఉదయం సమయంలో వ్యాయామం చేస్తున్నారు. బీజాపూర్ -హైదరాబాద్ జాతీయ రహదారి పట్టణం మీదుగా వెళ్లడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకుంటుందోనని భయాందోళన చెందుతున్నారు. 15వార్డుల పరిధిలో దాదాపు 30వేల జనాభా ఉంది. నిత్యం వంద మందికి పైగా నడుస్తుంటారు. కమిషనర్ వెంకటయ్య మాట్లాడుతూ.. రెండు నెలల క్రితం పట్టణంలోని తిరుమల వెంచర్, ఎన్ఆర్ఐ కాలనీల్లో ఒక్కో పార్కుకు రూ.10లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసేందుకు ఇటీవలే ప్రతిపాదించామన్నారు. **సౌకర్యాలు కల్పించాల్సి ఉంది..**రూ.1.05కోట్లతో లాహోటీ, శాంతినగర్ కాలనీలోని పార్కులను ఈనెల 12న ప్రారంభించారు. పార్కులో వ్యాయామ సామగ్రి కొంతే ఉంది. మరి కొన్ని పరికరాలు రావాల్సి ఉంది. సన్‌సిటీ కాలనీలో ఏర్పాటు చేసిన పార్కులో రెండుసార్లు బోర్లు వేసినా నీరు పడలేదు. దీంతో ప్రస్తుతం పనులు నిలిచిపోయాయి. పుర కమిషనర్ బలరాంనాయక్ మాట్లాడుతూ.. వర్షం పడినా వందలాది మంది వ్యాయామం చేసేలా అన్ని సౌకర్యాలు త్వరలో కల్పిస్తున్నామన్నారు.

# వ్యాధుల కాలంలో అప్రమత్తత ఏదీ?

ఎల్లారెడ్డిపేట : పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేస్తోంది. వర్షాకాలం ప్రారంభమైన తరుణంలో కాలానుగుణ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. వీర్నపల్లి మండలం కంచర్లలో ఇటీవల పలువురు జ్వరాల బారిన పడ్డారు. మరికొందరికి డెంగీ సోకినట్లు నిర్ధారణ అయింది. వర్షాలు కురుస్తున్న ప్రస్తుత కాలంలో పలు గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం తలెత్తుతోంది. పారిశుద్ధ్య నిర్వహణపై అధికార గణం పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గ్రామాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు శూన్యమయ్యాయి వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది.

**క్లోరినేషన్ చర్యలేవీ?**

గ్రామాల్లో మిషన్ భగీరథలో భాగంగా ఇంటింటికీ కుళాయిలను బిగించాల్సి ఉండగా ఆ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. నేరుగా ఇళ్లకు సరఫరా కావాల్సిన మిషన్ భగీరథ నీటిని నీటి ట్యాంకుల్లోకి చేర్చుతున్నారు. ఆ నీరు సరిపోవడం లేదనే ఉద్దేశంతో గ్రామాల్లోని మంచినీటి బోరుబావుల నీటిని కూడా ట్యాంకుల్లోకి మళ్లిస్తున్నారు. ట్యాంకుల నుంచి నీటిని పైప్‌లైన్ ద్వారా ఇళ్లకు అందిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో నీటిని అందించే పైప్‌లైన్‌లు మురుగునీటి కాల్వల గుండా వేశారు. పైప్‌లైన్ పగిలిపోయి, తాగునీరు కలుషితమవుతోంది. మురుగు కాల్వల నిర్వహణ, నీటి ట్యాంకుల క్లోరినేషన్ పనులు ఎక్కడా



కానరావడం లేదు. మురుగునీటి కాల్వల పక్కనే ఉన్న గడ్డిని తొలగించడం, బ్లీచింగ్ పౌడర్‌ను చల్లడం, ప్రతివారంలో రెండు రోజులు డ్రై డే కార్యక్రమాలను పంచాయతీ కార్యదర్శులు పూర్తిగా విస్మరిస్తున్నారు. పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణను పర్యవేక్షించే ఎంపీడీవో స్థాయి అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు మిన్నంటుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతుండగా ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారు. అధికారులు స్పందించి, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ చర్యలను పకడ్బందీగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**నిర్లక్ష్యంతో సమస్య మరింత జటిలం**

పల్లెలతోపాటు పట్టణాల్లోని ఆయా వార్డుల్లో స్వచ్ఛత లోపం కనిపిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. మురుగు కాలువలు పూడికతో నిండిపోయి కనిపిస్తున్నాయి. మురుగంతా నిల్వ కావడంతోపాటు దుర్గంధం వెదజల్లుతోంది. రోడ్లవెంట చెత్తాచెదారం దర్శనమిస్తోంది. వీధుల్లో చెత్త సేకరణ వాహనాలను తిప్పడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు మురుగు నీటి కాల్వల్లో పూడికను తీయించడం లేదనే విమర్శలు వినిస్తున్నాయి. దోమలు, ఈగలు విజృంభిస్తున్నా ఫాగింగ్ చేపట్టడం లేదని, బ్లీచింగ్ పౌడర్ చల్లించడం లేదని స్థానికులు వాపోతున్నారు. కొన్నిచోట్ల ఏళ్ల కిందట నిర్మించిన కాల్వలు ధ్వంసంకాగా మరికొన్నిచోట్ల పూర్తిగా కనుమరుగయ్యాయి. మరమ్మతు పనులు, కొత్తగా నిర్మాణాలను చేపట్టకపోవడంతో పారిశుద్ధ్య సమస్య మరింత జటిలమవుతోంది.

# దోస్త్‌లో క్రీడా కోటా ఏదీ?

మెదక్ : ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశం పొందేందుకు తెలంగాణ ప్రభుత్వం డిగ్రీ ఇన్ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించిన విషయం విదితమే. ఇందులో రిజర్వేషన్, విద్యార్హతలు తదితర వాటి ఆధారంగా విద్యార్థులకు సీట్లను కేటాయిస్తుంటారు. కానీ తెలంగాణ ఉన్నత విద్యామండలి దోస్త్ ప్రక్రియలో క్రీడా అంశాన్ని (క్రీడా కాలమ్)ను తొలగించడం గమనార్హం. దీంతో క్రీడల్లో రాణిస్తున్న వారు ఆందోళన చెందుతున్నారు. ఈ కోటా కింద విద్యార్థులకు నచ్చిన కోర్సు, కళాశాలలో సీటు రాదని నిరుత్సాహానికి గురవుతున్నారు.

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు, గురుకులాలు కలిపి మొత్తం 80కి పైగా డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. క్రీడాంశాల్లో ప్రతిభ చూపుతున్న వారికి క్రీడా కోట తొలగించడంతో నష్టం కలుగుతుందని వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటలను ప్రోత్సహించేందుకు క్రీడాకారులకు ప్రత్యేకంగా ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత చదువులు, ఇతర పోటీ పరీక్షలు, ప్రవేశపరీక్షలు తదితర వాటిల్లో రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించాయి. కానీ తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన దోస్త్ ప్రవేశంలో



మాత్రం క్రీడా కోటా అంశం తొలగించడం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎంతోమంది తమకిష్టమైన క్రీడాంశాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్నారు. దోస్త్ ద్వారా ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, పలు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రత్యేకంగా సీట్లు కేటాయించి క్రీడాంశాన్ని మాత్రం మరిచారు.

**2 శాతం రిజర్వేషన్..**

భారత ఒలింపిక్ సంఘం గుర్తించిన క్రీడలను పరిగణనలోకి తీసుకొని విద్య, ఉపాధి రంగాల్లో 2 శాతం క్రీడాకారులకు రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం గతంలోనే ఉత్వర్వులు జారీ చేసింది. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారుల మెరిట్ ఆధారంగా కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో వారికి సీట్లు కేటాయిస్తుంది.

**సదుపాయాన్ని కల్పిస్తే..**

దోస్త్‌లో సవరణలు చేసి క్రీడా విభాగాన్ని జత చేసి రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించాలి. అప్పుడే అర్హులైన క్రీడాకారులకు న్యాయం జరుగుతుంది. దోస్త్ ప్రక్రియలో క్రీడా రిజర్వేషన్ సౌకర్యం కల్పించేలా అన్ని క్రీడా సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి, పెటా టీఎస్, మెదక్

చరకలు



# అన్నదాతలూ పారాహుషార్..!

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్‌తండాకు చెందిన గిరిజన రైతు ధరావత్ రమేష్ 2023 యాసంగి సీజన్‌లో మరో రైతుకు చెందిన 4.20 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని, వరిపంట సాగుచేశాడు. ఏప్రిల్ మాసంలో రాచర్ల గొల్లపల్లిలోని ఓ డీలర్ వద్ద పురుగు మందు కొనుగోలు చేసి, పంటకు పిచికారీ చేశాడు. 18 రోజుల్లో పురుగు మందు ప్రభావంతో వరిపైరు మొత్తం పాడై, వరి కంకులు వేయలేదు. నష్టపరిహారం ఇస్తానని నమ్మబలికిన సదరు డీలర్ ఆ తర్వాత చేతులెత్తేశాడని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకోలేదు.

జిల్లాలో 187 లైసెన్సు కలిగిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల విక్రయ దుకాణాలున్నాయి. ఇటీవల 15 మంది స్వయం సహాయక మహిళా సంఘాలకు విత్తనాలను విక్రయించేందుకు కొత్తగా లైసెన్సులు జారీ చేశారు. కాగా జిల్లాలో కొందరు డీలర్లు రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల అమ్మకాలను యథేచ్ఛగా చేపడుతున్నారనే ఆరోపణలు మిన్నంటుతున్నాయి. దీంతో రైతులు తీవ్రస్థాయిలో నష్టపోతున్నారు. గడచిన రెండేళ్లలో సుమారు 15 మంది డీలర్లపై కేసులు నమోదు చేశామని అధికారులు చెబుతున్నారు.

**నిబంధనలు పాటిస్తే మేలు**

చాలామంది రైతులు తమకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ఇటీవల ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయడం పరిపాటిగా మారింది. దీనివల్ల కల్తీ జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. సామాజిక మాధ్యమాల్లో పంట దిగుబడిపై వచ్చే పోస్టులను నమ్మవద్దు.




లైసెన్స్ కలిగిన డీలర్లను మాత్రమే సంప్రదించాలి. రసీదులతోపాటు ఖాళీ విత్తన ప్యాకెట్లను భద్రపర్చుకోవాలి.

**డీలర్ల మాయాజాలం**

విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాల్లో కొంత మంది డీలర్లు మాయాజాలాన్ని ప్రదర్శిస్తున్నారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి రసీదులు ఇవ్వడం లేదు. డిమాండ్ ఉన్న విత్తనాలను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పలు చోట్ల స్టాక్ పొజిషన్, ధరల పట్టికను ప్రదర్శించడం లేదు. పత్తి విత్తనాల్లో బీజీ-2(బోల్‌గార్డ్-2) రకాన్ని పండించడం, విక్రయించడం వరకే ప్రభుత్వ అనుమతి ఉంది. కానీ కొన్ని మండలాల్లో అనుమతి లేని బీజీ-3 లేదా హెచ్‌టీ(హెర్బిసైడ్ టాలరెంట్) విత్తనాలు కూడా అంటగడుతున్నట్లు తెలిసింది. మరికొన్ని చోట్ల ఇతర రాష్ట్రాల నుంచి విడి పత్తి విత్తనాలను, నకిలీ విత్తనాలను తీసుకొచ్చి గ్రామాల్లో విక్రయిస్తూ పట్టుబడిన సంఘటనలు జిల్లాలో చాలా ఉన్నాయి.

**నిఘా తీవ్రతరం చేస్తాం**

విత్తనాలు, ఎరువులు, పురుగుమందు దుకాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం. ఏవోలు తనిఖీ చేస్తున్నారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల్లో నాణ్యతాప్రమాణాలపై అనుమానం వస్తే వాటి నమూనాలను పరిశోధన కేంద్రానికి పంపిస్తాం. ఏదైనా తేడా వస్తే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు అవసరమైతే డీలర్ లైసెన్సులను రద్దు చేస్తాం. వ్యవసాయాధికారులు సిఫార్సు చేసిన పురుగు మందులను మాత్రమే కొనుగోలు చేయాలి. అఫ్జల్‌బేగం, జిల్లా వ్యవసాయాధికారి

# ఉపాధికి ఊతం..!

సూర్యాపేట : జిల్లాలో జాతీయ ఉపాధిహామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పనులకు కూలీల చెల్లింపుల్లో అక్రమాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఇకపై అవకతవకలకు తావులేకుండా పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోనున్నారు. ఇందుకు గాను అయిదుగురితో కూడిన పర్యవేక్షణ కమిటీల ఏర్పాటుకు జిల్లాలో సన్నాహాలు చేపడుతున్నారు. గ్రామాల్లోనే ఏర్పాటుకు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికే గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి జిల్లాకు, అక్కడి నుంచి మండల అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

అక్రమాలకు తావులేకుండా పర్యవేక్షణ కమిటీలు

గ్రామ స్థాయిలో నిఘా పర్యవేక్షణకు విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలను రూపొందించనుంది. ఈ కమిటీలో మండల ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి, మహిళా సంఘం సభ్యురాలు, ఉపాధి కూలీ, స్వచ్ఛంద సంస్థ సభ్యుడు ఉంటారు. వారం పాటు జరిగిన పనులపై



క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుంది. పనుల మంజూరు, కూలీల హాజరు, కూలీ చెల్లింపులు పారదర్శకంగా జరిగాయా లేదా అని పరిశీలించి నివేదికను మండల పరిషత్తు అధికారులకు సమర్పిస్తారు. ఆ తరువాత మండల పరిషత్ అధికారులు జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తారు. దీంతో పనుల ఎంపిక, పనుల నిర్వహణ, కూలీ చెల్లింపులు మొత్తం ఇక పారదర్శకంగా కొనసాగే అవకాశం ఉంది.

ఎంపికకు సూచనలిచ్చాం.. : అప్పారావు, డీఆర్డీవో, సూర్యాపేట

ఉపాధి పనులు పారదర్శకంగా జరిగేలా చూసేందుకు గ్రామీణ స్థాయిలో పర్యవేక్షణ కమిటీల ఏర్పాటుకు గ్రామీణ అభివృద్ధి శాఖ నుంచి ఆదేశాలు అందాయి. కమిటీలను గుర్తించి ఎంపిక చేసేలా మండల అధికారులకు సూచనలు జారీ చేశాం. త్వరలో ఏర్పాటు చేసి పనులు పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకుంటాం.

# చివరి మజిలీకి చిక్కులు




కరీంనగర్ : నగర పరిధిలో పేద, మధ్యతరగతి ప్రజల చివరి మజిలీకి చిక్కులు వచ్చాయి. నగరంలో అమలు చేస్తున్న రూపాయికే అంత్యక్రియల పథకం నిలిచిపోయింది. రెండు రోజులుగా గుత్తేదారు చేతులెత్తయడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఈ పథకం అమలవుతోంది. దహన సంస్కారం చేసేందుకు గుత్తేదారుకు రూ.10 వేల చొప్పున చెల్లిస్తారు. టెండర్ గడువు ముగియగా కొన్ని నెలలపాటు పొడిగించారు. చివరికి బిల్లులు రాలేదనే కారణంతో గుత్తేదారు ఆ పథకం నిలిపివేయడం చర్చనీయాంశంగా మారింది. టెండర్ పొడిగించినా సక్రమంగా పని చేయడంలేదని, నిర్వహణ పూర్తిగా గాడి తప్పిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**కార్పొరేటర్ల లేఖలు**

నగర పరిధిలోని 60 డివిజన్లలో చనిపోయిన వారికి అంత్యక్రియలు నిర్వహించేందుకు పాలకవర్గ పదవీకాలంలో ఉన్నప్పుడు కార్పొరేటర్లు లేఖలు అందించారు. ఆ లేఖల ప్రకారం రేషన్‌కార్డు లేకున్నా, డివిజన్‌కు చెందిన వారు కాకున్నా సిఫార్సు చేసేవారు. మొత్తం మీద నెలకు 90 నుంచి 120 వరకు అంత్యక్రియలు చేసే వారు. పదవీకాలం ముగిసిన తర్వాత వార్డు అధికారులు ధ్రువీకరిస్తే తప్ప బల్దియా పథకం అమలు కావడంలేదు. మరో వైపు అంత్యక్రియల పథకం బిల్లులపై విచారణ జరిపించాలని పలువురు మాజీ కార్పొరేటర్లు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందని చెబుతున్నారు.

**ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి**

రూపాయికే అంత్యక్రియల పథకం దుర్వినియోగం కాకుండా సిఫార్సు లేఖలు పక్కన బెట్టి నగరవాసులకు మాత్రమే ఈ పథకం వర్తించేలా నిబంధన పొందుపర్చారు. నగరంలో నివసిస్తున్నట్లు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు ఉన్న వారికి వార్డు అధికారి ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఇలా ఉంటే నిలిచిపోయిన అంత్యక్రియల పథకంపై అధికారులు ఎలా స్పందిస్తారో చూడాల్సిందే.

**టెండర్..రీకాల్**

నగరపాలక అధికారులు రూపాయికే అంత్యక్రియల పథకానికి ఇటీవల టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ సమయంలో ఎవరూ ముందుకు రాలేదు. మళ్లీ రీకాల్ చేసేందుకు చర్యలు చేపట్టారు. రూ.90 లక్షలతో టెండర్ నిర్వహిస్తుండగా ఈసారి వైకుంఠ రథం(వ్యాన్) నిర్వహణతోపాటు డీజిల్, డ్రైవర్‌తోపాటు రూపాయికే అంత్యక్రియలు చేసేలా పొందు పర్చారు. దాంతో వెనక్కి తగ్గుతున్నట్లుగా తెలుస్తోంది.

**వారం రోజుల్లో పూర్తి చేస్తాం**

కాంట్రాక్టు గడువు ముగియకముందే ఇంజినీరింగ్ అధికారులు టెండర్ పిలిచారు. ఎవరు పాల్గొనకపోవడంతో మళ్లీ రీకాల్ చేస్తున్నట్లు చెప్పారు. వారం రోజుల్లో ప్రక్రియ పూర్తి చేస్తాం.

వేణుమాధవ్, సహాయ కమిషనర్, నగరపాలిక

# ఇసుక లభ్యత.. పూర్తి పారదర్శకత



సిరిసిల్ల: జిల్లాకు డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్ మినరల్ ఫండ్ ట్రస్ట్)కు ఆదాయం సమకూరడంలో ప్రధానమైనది ఇసుక. అనుమతుల జారీలో రెవెన్యూశాఖ లోపాలు.. గనులు భూగర్భశాఖ పర్యవేక్షణలేమి.. అక్రమార్కులకు వరంగా మారింది. ఇటు ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. అక్రమాలకు అడ్డుకట్టవేసి.. అనుమతుల్లో పారదర్శకంగా వ్యవహరించేలా 'సాండ్ టాక్స్' విధానం తీసుకురాబోతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఇసుక లభ్యత.. ప్రభుత్వానికి సమకూరే ఆదాయం.. సామాన్యులకు కలిసివచ్చే తీరుపై కథనం.

**రూ.63 కోట్ల ఆదాయం**

జిల్లాలోని 13 మండలాలు ఉండగా 12 మండలాల్లో మానేరు, మూలవాగులు ప్రవహిస్తున్నాయి. వీటిలో నాణ్యమైన ఇసుక లభ్యమవుతోంది. గృహ అవసరాలు, ప్రాజెక్టులకు దీనికి ప్రాధాన్యం ఇస్తారు. జిల్లాలో 12 ఇసుక రీచ్‌లను గనులశాఖ గుర్తించింది. వీటిలో వర్షాలకు వరదల ద్వారా ఏటా 14 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అందుబాటులో ఉంటుంది. దీని ద్వారా ఏటా రూ.6.34 కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా. జిల్లాలో ఇంజినీరింగ్ శాఖల ద్వారా చేపడుతున్న నిర్మాణాలకు వినియోగించిన ఇసుక మొత్తానికి ఎంబీ రికార్డుల్లో వే బిల్లుల రసీదులను నమోదు చేయాలి. అప్పుడే బిల్లులు మంజూరు చేసేలా నిబంధనలు కఠినతరం చేశారు. ప్రస్తుతం వే బిల్లులో ట్రాక్టర్ ఇసుక (మూడు క్యూబిక్ మీటర్లకు) రూ.450 చెల్లిస్తున్నారు. సాండ్ టాక్స్‌లోనూ ఇదే ధరను నిర్ణయించే అవకాశం ఉంది.

**నిబంధనలు ఇవీ..**

కలెక్టర్ ఛైర్మన్‌గా ఇసుక నిర్వహణ కమిటీ ఏర్పాటైంది. గనులు, భూగర్భశాఖ సహాయ సంచాలకులు, మండల రెవెన్యూ అధికారులు కమిటీలో సభ్యులుగా వ్యవహరిస్తారు. కలెక్టరేట్‌లో సాండ్‌టాక్స్ నిర్వహణకు రెవెన్యూశాఖకు చెందిన ఇద్దరు నోడల్ అధికారులు ఉంటారు. కాల్‌సెంటర్, ఖాతాలు, ఆన్‌లైన్ నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని నియమిస్తారు. కమిటీ నిర్వహణకు మొదట బ్యాంకుఖాతాను ప్రారంభిస్తారు.

ఇసుక రవాణాను జీవనాధారంగా చేసుకున్న వారు రెవెన్యూశాఖలో ట్రాక్టర్‌కు రూ.10వేలు చెల్లించి సాండ్ ట్యాక్స్ పథకంలో నమోదు చేసుకోవాలి.

నమోదు చేసుకున్న ట్రాక్టర్ ట్రాలీలకు ఎంపికచేసిన రంగుతో ఇసుక నిర్వహణ కమిటీ గుర్తును వేస్తారు. ట్రాక్టర్ యాజమాని ఎప్పుడైనా వ్యవసాయ అవసరాలకు మళ్లించుకోవాలనుకుంటే.. డిపాజిట్ సొమ్మును కమిటీ నుంచి చెల్లిస్తారు.

ఇసుక క్వారీల నుంచి దూరాన్ని బట్టి రవాణా, ఇతర రుసుములను ఆన్‌లైన్‌లో చెల్లించాలి. అనుమతి పొందిన 24 గంటల్లో వినియోగదారుడు పేర్కొన్న చిరునామాకు పంపిస్తారు.

అక్రమాలకు తావు లేకుండా

ఇసుక రీచ్‌ల నిర్వహణలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించేందుకు సాండ్‌టాక్స్ విధానం తీసుకురాబోతున్నాం. దీనిలో ఎలాంటి అవకతవకలు, అక్రమాలకు తావులేకుండా పూర్తిస్థాయి సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహణ జరుగుతుంది. ట్రాక్టర్ యజమానులు నమోదు చేసుకుంటున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే వచ్చే నెలలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

సందీప్ కుమార్ ఝా, కలెక్టర్

# రాములోరి గోశాలకు మహర్దశ!

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానానికి ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామ పంచాయతీలో ఉన్న గోశాలకు మహర్దశ పట్టనుంది. రామాలయానికి 3 కి.మీ. దూరంలో గల ఈ గోశాలను పూర్తిస్థాయిలో విస్తరించే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. 104 ఎకరాల విస్తీర్ణంలోని ఈ ప్రాంగణంలో ఇప్పటికే రూ.30లక్షలతో రెండు షెడ్లు నిర్మించగా.. వీటిలో సుమారు 75 ఆవులు, దూడలు ఉంటున్నాయి. ఎండకు, వానకు దెబ్బతినకుండా గోవుల దాణాను భద్రపర్చేందుకు రూ.5 లక్షలతో ఇనుప రేకులతో కంటైనర్ తరహాలో రెండు గదులను ఉపయోగిస్తున్నారు. తాజాగా ప్రవాస భారతీయుల సహకారంతో రూ.40లక్షలతో రెండు షెడ్లను నిర్మించేందుకు ఈఓ రమాదేవి పర్యవేక్షణలో ఈఈ రవీంద్రనాథ్ పనులు ప్రారంభించారు. ఇవి కాకుండా మరో రూ.2 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు.

**భవిష్యత్తు కార్యాచరణ?**

రాములవారికి నిత్యపూజలు, అభిషేకాలకు గోవు పాలు అవసరం. నిత్య అన్నదాన సత్రంలో రోజుకు 2వేల మందికి భోజనాలు వడ్డిస్తుంటారు. మజ్జిగ తప్పనిసరి. ఇందుకోసం పాలను తోడు పెట్టి మజ్జిగను అన్నదానంలో ఉపయోగిస్తున్నారు. రామాలయం వద్ద గోకులంతో పాటు పురుషోత్తపట్నంలోని శ్రీ గోకుల రామం పేరిట గోశాలలు ఉన్నాయి. ఈ రెండుచోట్ల కలిపి సుమారు 80 గోవులను ఉంటున్నప్పటికీ పాలు ఇచ్చేవి పది లోపే. రోజుకు 15 లీటర్ల నుంచి 20 లీటర్ల పాలు లభిస్తున్నాయి. ఈనేపథ్యంలో ఆలయ అవసరాలకు ఇవి చాలకపోవటంతో వ్యాపారుల నుంచి కొంతమేర కొనక తప్పటం లేదు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలంటే వందల సంఖ్యలో గోవులతో గోశాలను విస్తరించాలి. ఇది జరిగితే పవిత్రమైన గోక్షీరం పుష్కలంగా లభిస్తుంది. లీటరు పాలను కూడా బయట కొనకుండా చూడొచ్చు.

**దాతల సహకారంతో..**



గోశాల వద్ద మూడేళ్ల క్రితం రూ.10 లక్షలతో ముఖద్వారం పూర్తయ్యింది. దీన్ని సుందరీకరించాలి. గోశాల రక్షణకు చుట్టూ 2 కి.మీ. పొడవైన ప్రహరీ అవసరమవగా.. రూ.15 లక్షలు వెచ్చించి కొంతమేర నిర్మించారు. దాతల సహకారంతో మరో అర కి.మీ. వరకు రూ.40 లక్షలు వెచ్చించి గోడ నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. ఇంకా మిగిలిన గోడ పూర్తి కావాలంటే మరో రూ.కోటి కావాలని అంచనా వేస్తున్నారు.

వర్షాకాలంలో గోశాల ఆవరణలోని చెరువు పొంగిపొర్లి జగదీశ్ కాలనీ లోతట్టు ఇళ్లను వరద నీరు ముంచెత్తుతుంది. దీనిపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నందున చెరువులో నీటి నిల్వను నియంత్రించేందుకు తగిన పనులు చేపట్టనున్నారు. నక్షత్ర వనం, రాశీ వనాల పేరిట పూదోటలను ఏర్పాటు చేయాలని యోచిస్తు న్నారు. దీన్ని ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా మార్చాలని భావిస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన పనులు కాకుండా దాతల సహకారంతో మరో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందని ఆలయాధికారులు చెబుతున్నారు.

# పడకేసిన పల్లె పాలన

జగిత్యాల : పల్లెలపై అధికారుల పట్టింపు లేకపోవడంతో అధ్వానంగా మారుతున్నాయి. ప్రత్యేకాధికారులు కన్నెత్తి చూడకపోవడంతో పారిశుద్ధ్యం గాడితప్పుతోంది. పంచాయతీ కార్యదర్శులు సొంతంగా నిధులు వెచ్చించాల్సి వస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల విడుదలలో జాప్యంతో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. జిల్లాలో 385 గ్రామ పంచాయతీలు ఉండగా 9 లక్షలకుపైగా జనాభా జీవిస్తున్నారు. పల్లెల్లో సర్పంచుల పదవీ కాలం ముగిసిన తర్వాత ప్రత్యేకాధికారులకు అప్పగించారు. ప్రభుత్వం నుంచి గ్రాంటు విడుదల కాక పంచాయతీలలో నిధులు లేకపోవటంతో ప్రత్యేకాధికారులు పల్లెల వైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. పంచాయతీ కార్యదర్శులు ఉన్న నిధులతో చిన్న చిన్న పనులు చేస్తున్నారు. చిన్న గ్రామ పంచాయతీల్లో నిధులు లేక పంచాయతీ కార్యదర్శులే ఖర్చులు భరించాల్సిన పరిస్థితి నెలకొంది. దాదాపు ఏడాదికిపైగా ప్రభుత్వం నుంచి నిధులు రాక జిల్లాలోని పల్లెల్లో అభివృద్ధి కానరావటంలేదు. పెద్ద గ్రామ పంచాయతీలకు నిధులు మెండుగా ఉండగా చిన్న గ్రామ పంచాయతీల పరిస్థితి అధ్వానంగా తయారైంది. పల్లెలకు ప్రత్యేకాధికారులు వెళ్లకపోవటంతో పారిశుద్ధ్యం లోపించింది.

పారిశుద్ధ్య కార్మికులు, ఈ పంచాయతీ ఆపరేటర్లు, ఇతర సిబ్బందికి



వేతనాలు కూడా రావటంలేదు. వేతనాలు రాకపోతే తమ పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఏప్రిల్ నెలలోనైనా ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని వేడుకుంటున్నారు. పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే సర్పంచులైన తమ సమస్యలు పట్టించుకుంటారని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

**విధుల్లో చేరని జిల్లా పంచాయతీ అధికారి**

పల్లె పాలనను పట్టించుకోవటంలేదనటానికి మరో నిదర్శనం జిల్లా పంచాయతీ అధికారి లేకపోవటం. జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ బదిలీ అయిన తర్వాత డీఆర్‌డీవో ఏపీడీ మదన్‌మోహన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఆయన రెండు విధులు నిర్వహించటం ఇబ్బందిగా మారింది. నిజామాబాద్ డీఎల్‌పీవోగా పని చేస్తున్న ఎం.శ్రీనివాస్‌కు బదిలీ ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ఆయన విధుల్లో చేరలేదు. రెండోసారి సైతం విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ చేరకపోవటంతో పూర్తి బాధ్యతలు లేక పాలన పూర్తిగా కుంటుపడింది.

# చిల్లర సమస్యలు ఉండవిక..!

వలిగొండ : ఆర్టీసీ ప్రయాణికులకు బస్సులో చిల్లర సమస్య అధికంగా ఉంది. టికెట్‌కు సరిపడ డబ్బులు ఇవ్వాలని కండక్టర్లు అడుగుతున్నా చిల్లర లేక నోట్లు ఇస్తుంటారు. దీంతో అటు ప్రయాణికులు, కండక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో వారి మధ్య వాగ్వాదాలకు దారి తీస్తోంది. ఈ సమస్యలకు చెక్ పెట్టెందుకు ఆర్టీసీ డిజిటల్ చెల్లింపులను అమల్లోకి తీసుకురానుంది. బస్సులో ఎలక్ట్రానిక్ టికెట్ ఇష్యూ (ఈ-టిమ్)ను ప్రవేశపెడుతోంది. ఫోన్-పే, గూగుల్ పే, స్వైపింగ్ ద్వారా టికెట్ తీసుకునే సౌకర్యం త్వరలోనే అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం అన్ని రంగాల్లో డిజిటల్ చెల్లింపులు నిత్యకృత్యమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీ కూడా ఈ విధానంపై కొన్ని నెలలుగా కసరత్తులు మొదలు పెట్టింది. దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో ప్రయోగాత్మకంగా డిజిటల్ చెల్లింపులు అమల్లోకి తీసుకురాగా ఇది విజయవంతమైంది. అన్నీ చోట్ల ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. బస్సులతో పాటు టికెట్ రిజర్వేషన్ కేంద్రాలు, టికెట్ బుకింగ్ ఏజెన్సీల వద్ద ప్రవేశపెట్టనున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో యాదగిరిగుట్ట డిపోకు 70 ఈ-టీమ్ మిషన్లు రావడంతో కండక్టర్లకు త్వరలో శిక్షణ తీసుకోనున్నారు.

త్వరలో అందుబాటులోకి సేవలు:మురళీకృష్ణ, డిపో మేనేజర్, యాదగిరిగుట్టయాదగిరిగుట్ట డిపోకు ఈ-టిమ్స్ మిషన్లు 70 వచ్చాయి, మరికొన్ని రావాల్సి ఉంది. యంత్రాల పని తీరు పరిశీలించి కండక్టర్లకు శిక్షణ ఇవ్వనున్నాం. త్వరలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

# చెరువుల వద్ద.. చేపల కొలనులు

చేగుంట : ప్రతి గ్రామంలో కొలనులు ఏర్పాటు చేసి చేపల పెంపకానికి చేయూత నివ్వాలని కేంద్రం ప్రభుత్వం సంకల్పించింది. ఉపాధి పథకంలో ప్రతి గ్రామంలో చెరువు శిఖంలో వీటి నిర్మాణాలను చేపట్టాలని నిర్ణయించగా, కొన్ని చోట్ల పనులు మొదలయ్యాయి. దీనివల్ల కూలీలకు పనులు, శిఖం భూముల పరిరక్షణ, మత్స్యకారులకు మరింత ఆదాయం సమకూరాలన్నదే లక్ష్యం. జిల్లాకు ప్రస్తుతం 85 చేపల కొలనులు మంజూరుకాగా, 59 చోట్ల పనులు ప్రారంభమయ్యాయి, చేగుంట, నార్సింగి, హవేలీఘనపూర్, కొల్చారం, పాపన్నపేట, చిన్నశంకరంపేట, శివ్వంపేట, టేక్మాల్, మెదక్, నర్సాపూర్ మండలాల్లో కొనసాగుతున్నాయి. నార్సింగి మండలంలో నార్సింగి, సంకాపూర్, భీంరావుపల్లి, నర్సంపల్లిలో నిర్మాణాలను ముమ్మరం చేశారు. ఒక్కో కొలనుకు రూ.8 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు ఖర్చు చేయనున్నారు.

అత్యధిక పనిదినాలు కల్పించేలా..: ఆర్థిక సంవత్సరం 2025-26లో ఉపాధి పథకంలో కొత్తగా మరిన్ని పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా వివిధ పనులను పరిశీలించి చేపల కొలనులు ఏర్పాటు చేపట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా ఉత్తర్వులు ఇచ్చింది. ఒక్కో గ్రామంలో 3,300 పనిదినాలు కల్పించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఒక్కో కొలను 14 మీటర్ల పొడవు, 24 మీటర్ల వెడల్పు, 2 మీటర్ల లోతుతో నిర్మిస్తున్నారు. ఎంపిక చేసిన చెరువు శిఖంలో నాలుగు కొలనులు నిర్మిస్తున్నారు. వర్షాలు కురిసిన సమయంలో వాటిలో నీరు నిల్వ ఉండటంవల్ల చేపలు పెంచుకునేందుకు దోహదపడుతుంది. శిఖం భూముల పరిరక్షణకు: ప్రస్తుతం మత్స్యశాఖ రాయితీతో చేప పిల్లలను నీటి వనరుల్లో పెంచుతున్నారు. వీటికి వంద నుంచి మూడు వందల మీటర్ల దూరంలో కొలనులు నిర్మిస్తున్నారు. కూలీలకు ఉపాధి, చెరువుల శిఖం భూముల ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేలా పనుల రూపకల్పన చేశారు. వీటి నిర్మాణం పూర్తయ్యాక, రాయితీ చేపపిల్లలను కూడా వీటిలో వదిలేలా ఏర్పాటు చేస్తున్నారు. **ఎన్ని ప్రతిపాదనలు వచ్చినా అనుమతి : శ్రీనివాస్‌రావు, డీఆర్డీవో** గ్రామాల నుంచి చేపల కొలనుల నిర్మాణాలకు ప్రతిపాదనలు వస్తే మంజూరు చేయటానికి సిద్ధంగా ఉన్నాం. జిల్లా వ్యాప్తంగా మొదటగా కొన్నింటికి ప్రతిపాదనలు రావడంతో పనులు కొనసాగుతున్నాయి. వర్షాకాలం ప్రారంభం వరకు పెద్ద ఎత్తున నిర్మాణాలను చేపట్టి మత్స్యసంపదను పెంపొందించాలన్నది లక్ష్యం. శిఖం భూములను రక్షించేందుకు కూడా ఇది దోహదపడుతుంది. గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసుకుని ప్రతిపాదనలు పంపించాలి.

చరకలు



## డిజి'డల్' లావాదేవీలు

నెల్లూరు : 'కొన్ని పంచాయతీల్లో ఇంటి, కుళాయి పన్ను వసూళ్లకు కొందరు కార్యదర్శులు పాత పద్ధతులనే అనుసరిస్తున్నారు. పాత బిల్లు పుస్తకాలు తమ వద్ద ఉంచుకుని వాటినే రాసి ఇస్తున్నారు. ఇది సరైన విధానం కాదు. అందరూ నూతన పద్ధతిపై శ్రద్ధపెట్టాల్సిందే' ఇటీవలి సమీక్షలో జిల్లా పంచాయతీ అధికారి అసంతృప్తి

స్థానిక సంస్థల్లో పారదర్శక పాలనకు.. ఆర్థిక అంశాల్లో జవాబుదారీ తనం పెంపునకు డిజిటల్ లావాదేవీలను తీసుకొచ్చినా.. జిల్లాలో అమలు అంతంత మాత్రంగానే ఉంది. గత ప్రభుత్వంలోనే ఈ విధానం తీసుకొచ్చినా.. ఇటీవల కూటమి ప్రభుత్వం సరికొత్త నిబంధనలు పెట్టినా.. సిబ్బంది అనుసరిస్తున్న పరిస్థితి లేదు. దాంతో లక్ష్యం నీరుగారుతోంది.

**గత ఆగస్టు 15 నుంచి..**

గత ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం నుంచి జిల్లాలోని ప్రతి పంచాయతీలో ఆర్థిక లావాదేవీలన్నీ డిజిటల్ చెల్లింపుల విధానంలోనే సాగాల్సి ఉంది. 722 పంచాయతీల్లో ఇంటి, కుళాయి పన్నులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం చెల్లించే నగదు, లైసెన్స్ ఫీజులు అన్ని కొత్త విధానంలోనే ప్రత్యేక ఖాతాలకు జమ చేయాల్సి ఉంది. ఇందుకు అనుగుణంగా ఎస్బీఐలో ప్రత్యేక కరెంట్ ఖాతాలను ప్రారంభించారు. కానీ, సుమారు 60 శాతం పంచాయతీల్లో దీన్ని నీరుగార్చారు.




**జనాభా ఆధారంగా**

మూడు వేల మందిలోపు జనాభా ఉన్న పంచాయతీలు 607 ఉండగా.. ఇక్కడ ఉన్నవారంతా యూపీఐ, క్యూఆర్ కోడ్ ద్వారానో చెల్లింపులు జరిపే ఏర్పాట్లు చేశారు. ఇక మూడు వేలమందికిపైగా ఉన్నవి 115 ఉండగా.. వీటిలో పీవోఎస్ ద్వారా చేయాల్సి ఉంది. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశామని ప్రకటించిన అధికారులు.. ఆ ఖాతాకు వచ్చే నగదును ఏరోజుకు ఆరోజు కార్యదర్శి నుంచి స్థానిక ట్రెజరీకి చెల్లిస్తారని ప్రకటించారు. కానీ, ఈ తీరున ఎక్కడా ఆశించిన స్థాయిలో జరగడం లేదు.

**పాత పద్ధతులు అనుసరిస్తే చర్యలు**

పంచాయతీల్లో నగదు పక్కదారి పట్టకుండా నేరుగా బ్యాంక్ ఖాతాలకే చేరేలా డిజిటల్ చెల్లింపులకు శ్రీకారం చుట్టాం. ఇప్పటికే అనేక పంచాయతీలు ప్రారంభించాయి. ఇంకా కొందరు పాత పద్ధతులు అవలంబిస్తున్నారు. తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవు. మరోసారి ఆదేశాలు ఇస్తాం.శ్రీధర్‌రెడ్డి, డీపీవో

## గోదావరి గట్టు.. ఆహో అనిపించేట్టు

రాజమహేంద్రవరం : రానున్న పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని గోదావరి ఘాట్ల నిర్వహణపై యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. వాటి నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. పైలట్ ప్రాజెక్టుగా మూడు నెలలుపాటు ప్రైవేటు ఏజెన్సీలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించేం దుకు సిద్ధపడుతోంది. దీన్ని బట్టి భవిష్యత్తులో ఘాట్ల విషయంలో ఎటువంటి చర్యలు తీసుకోవాలనే దానిపై అంచనాకు రావచ్చని భావిస్తోంది. వాస్తవానికి గోదావరి నది పరివాహక ప్రాంతం జలవనరుల శాఖ పరిధిలో ఉంటుంది. బయట ఘాట్లు, రోడ్ల వద్ద పారిశుధ్యం, ఇతర సౌకర్యాలు నగరపాలక సంస్థ కల్పించాల్సి ఉంటుంది. అయితే ఘాట్లను ఆనుకొని నది లోపలి భాగం స్నానాలకు అనుకూలంగా శుభ్రం చేయడంలో మున్సిపల్ కార్మికులకు అనుభవం లేకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో శిక్షణ పొందిన కార్మికులను ప్రైవేటు ఏజెన్సీల ద్వారా రప్పించి ఘాట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసే ప్రక్రియకు నాంది పలుకుతున్నారు.

**నిత్యం పరిస్థితి ప్రమాదకరం..**

గోదావరి ఘాట్ల వద్ద పరిస్థితి నిత్యం ప్రమాదకరంగా మారుతోంది. కాస్త ఆదమరిచి ఎవరైనా నదిలో స్నానానికి దిగితే లోతు తెలియక మునిగిపోయి మృత్యువాతపడుతున్నారు. ఇటీవల కాలంలో ఇటువంటి సంఘటనలు ఒకదాని వెంట మరొకటి చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఘాట్ల లోపల నదీ సమతుల్యత దెబ్బతినడమే ఇందుకు కారణం. ఊబలు పెరిగిపోవడం, ఘాట్ల వద్ద లోతు ఎక్కువగా ఉండడం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ప్రమాదాలను అరికట్టాలంటే నదిలో ఎప్పటికప్పుడు ఎగుడుదిగుడులు సరిచేసి, లోతు ఎక్కువ ఉన్న చోట ఇసుక వేయాల్సి ఉంటుంది. అందుకోసం యంత్రాల సహాయంతో ప్రతీ రెండు నెలలకు ఒకసారి డ్రెడ్జింగ్ చేయాల్సి ఉంది. ఇవేమీ జరగకపోవడం వల్ల ఘాట్ల వద్ద స్నానాలు చేయాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఘాట్ల వద్ద మెట్లను మాత్రమే శుభ్రం చేస్తున్నారు. నదిలోకి దిగి లోతు ఉన్న చోట్ల ఇసుక వేయడం, డ్రెడ్జింగ్ పనుల్లో అనుభవం లేకపోవడంతో వారు నది లోపలికి దిగడానికి భయపడి పోతున్నారు. దీంతో ప్రైవేటు ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగించనున్నారు.

**ప్రయోగాత్మకంగా అమలు..**పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని పుణ్యస్నానాల కోసం వచ్చే భక్తుల విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ప్రయోగాత్మకంగా ఘాట్ల నిర్వాహణ ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించే విధానం అమలు చేస్తున్నారు. ఇందుకు గోదావరి గట్టు వెంబడి మొత్తం 13 ఘాట్లను ఎంపిక చేశారు. వీటిని మూడు నెలలు పాటు ప్రైవేటు ఏజెన్సీకి అప్పగిస్తారు. నదిలోపల ఘాట్ల వద్ద స్నానాలకు అనుకూలంగా సిద్ధం చేయడంతోపాటు బయట పారిశుద్ధ్యం, ఇతర సేవలను అందించాల్సి ఉంటుంది. అందుకు సంబంధించి శిక్షణ పొందిన కార్మికులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రతీ ఘాట్‌కు నెలకు రూ.15 వేలకు పైగా వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇందుకు సంబంధించి కార్యాచరణ అమలు చేస్తున్నట్లు కమిషనర్ కేతన్ గర్గ్ కు తెలిపారు.

# ఏకేయూకు జవసత్వాలు!



ఒంగోలు : ఒంగోలు నగరంలోని ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం (ఏకేయూ) బాలారిష్టాలను అధిగమించి అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. మూడేళ్ల కిందట ఏర్పాటైన ఈ విశ్వవిద్యాలయానికి గత వైకాపా ప్రభుత్వంలో నిధులివ్వకపోవడంతో పీజీ కేంద్రంలోనే అరకొర వసతులతో నడుస్తోంది. తరగతులు నిర్వహణకు గదులు సరిపోని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు చేరడానికి ఆసక్తి చూపకపోవడంతో గడిచిన రెండేళ్లు వందల సంఖ్యలో సీట్లు మిగిలిపోయాయి. మూడేళ్ల కిందట వరకు ఉమ్మడి ప్రకాశంలోని అన్ని కళాశాలలు నాగార్జున విశ్వ విద్యాలయం పరిధిలో ఉండగా, ప్రస్తుతం ఏకేయూ గొడుగు కిందకు వచ్చాయి. మొత్తం 226 కళాశాలలతో పెద్ద విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందింది. గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడాది వ్యవధిలో కొన్ని నిధులు సమకూరాయి. కళాశాల అఫ్లియేషన్ పీజులతోపాటు పీజీ విద్యార్థులు, స్కాలర్లు చెల్లిస్తున్న ఫీజులతో కొంత ఆర్థిక స్థిరత్వం లభించింది. దీంతో ఈ ఏడాది కొన్ని నిర్మాణపనులకు శ్రీకారం చుట్టారు.

ఒంగోలు నగర సమీపంలోని పేర్నమిట్ట కొండపైనున్న 110 ఎకరాల విశ్వవిద్యాలయం స్థలంలో భవన నిర్మాణాలు చేపట్టడానికి పాలనపరమైన ఉత్తర్వులందాయి. విశ్వవిద్యాలయం నిధులు రూ.9 కోట్లతో 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అకడమిక్ బ్లాక్ నిర్మాణం జరగనుంది. గ్రౌండ్ ఫ్లోర్, పైఅంతస్తులో మొత్తం 40 గదులు నిర్మించనున్నారు. ఏపీఈడబ్ల్యూఐడీసీ సంస్థకు నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. ఇవన్నీ వచ్చే విద్యాసంవత్సరానికి అందుబాటులోకి రానున్నాయి. మంత్రులు, ప్రజాప్రతినిధుల సూచనల మేరకు బాలికల వసతి గృహం భవన నిర్మాణానికి కలెక్టర్ మినరల్ డెవలప్‌మెంట్ ఫండ్ రూ.4.64 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులు కూడా ఏపీఈడబ్ల్యూఐడీసీ చేపట్టడానికి టెండర్లు పిలిచింది. త్వరలో రూ.3 కోట్లతో పరిపాలన భవనం, రూ.79 లక్షలతో ఇండోర్ స్టేడియం నిర్మించాలని ప్రతిపాదించారు. ఇవన్నీ కూడా 2026 విద్యా సంవత్సరానికి అందుబాటులోకి వస్తాయని అంచనా.

**239కి పెరిగిన విద్యాలయాలు**

ఏకేయూ పరిధిలో ఈ విద్యాసంవత్సరం వివిధ కోర్సులతో 13 ప్రైవేటు కళాశాలలు రానున్నాయి. ఎంబీఏ, ఎంసీఏ రెండు, ఫార్మసీ రెండు, న్యాయవిద్య కళాశాలలు రెండు, బీఈడీ కళాశాలలు ఏడు ఏర్పాటు చేయడానికి అనుమతులకు అవసరమైన ఫీజులు చెల్లించారు. దీంతో మొత్తం కళాశాలల సంఖ్య 239కి చేరనుంది. ప్రస్తుతం విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో 48 వేల మంది విద్యార్థులు చదువుతుండగా, 53 మంది రీసెర్చి స్కాలర్లు ఉన్నారు. ఈ ఏడాది పీజీ మొదటి బ్యాచ్, వచ్చే ఏడాది డిగ్రీ మొదటి బ్యాచ్ బయటకు రానుంది.

**తీరని ఫీజు రీఎంబర్స్‌మెంట్ సమస్య**

ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పీజీ చేసే విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ సౌకర్యం ఉంది. ఏకేయూలో విద్యార్థులు తక్కువగా ఉన్న రెండు ఆర్ట్స్ కోర్సులకే వర్తింపజేశారు. మిగిలిన కోర్సులకు కూడా ఫీజు రీఎంబర్స్‌మెంట్ కల్పిస్తే ఎక్కువ మంది పేద విద్యార్థులకు మేలు జరుగుతుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన దస్త్రం ఉన్నత విద్యామండలి వద్ద ఉంది.**రూ.215 కోట్లు కోరాం** భవనాల నిర్మాణం, సైన్స్ కోర్సులు, లైబ్రరీ, ఆటస్థలం అభివృద్ధి, రహదారుల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు రూ.215 కోట్లు మంజూరు చేయాలని కోరుతూ ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం ఉన్న 13 కోర్సులకు అనుబంధంగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఎమ్మెస్సీ ఫిజిక్స్, ఎంఏ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, యోగా కోర్సులు ప్రవేశపెట్టాలని ప్రతిపాదించాం. పీజీసెట్ పూర్తయినందున త్వరలో ప్రవేశాలు ప్రారంభమవుతాయి. డీవీఆర్ మూర్తి, ఉపకులపతి

# సచివాలయాల్లో బదిలీల సందడి!




కందుకూరు : గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వ మార్గదర్శకాలు విడుదల చేయడంతో సందడి నెలకొంది. 2019, అక్టోబరు 2న గత వైకాపా ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ అమల్లోకి తీసుకొచ్చింది. గతంలో సొంతూరులో పనిచేయకూడదన్న నిబంధన ఉంది. తాజాగా కూటమి ప్రభుత్వం సొంత మండలంలో పోస్టింగ్ ఇవ్వరాదని నిబంధనను అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో సచివాలయ ఉద్యోగులు ఎక్కువ మంది పొరుగు మండలాలకు బదిలీ కానున్నారు. గతేడాది సెప్టెంబరులో జరిగిన సాధారణ బదిలీల సమయానికి సచివాలయ ఉద్యోగులకు అయిదేళ్ల నిండలేదు. బదిలీల్లో భాగంగా రిక్వెస్ట్ పెట్టుకోవడానికి అవకాశం ఇవ్వడంతో కౌన్సెలింగ్ ద్వారా 20 శాతం మందికే స్థాన చలనం కలిగింది. తాజాగా ఇచ్చిన బదిలీల జీవో ద్వారా దీర్ఘకాలంగా పనిచేస్తున్న వారికి స్థానచలనం కలగనుంది. 2025, మే నెలాఖరు నాటికి ఒకే సచివాలయంలో అయిదేళ్లకుపైగా పని చేస్తుంటే బదిలీ తప్పనిసరి. దీంతో 80 శాతానికిపైగా ఉద్యోగులు బదిలీ కానున్నారు. గత ప్రభుత్వం హయాం నుంచి పనిచేస్తున్న వారందరూ మరో చోటకు మారనున్న నేపథ్యంలో కొత్త వారిని తెచ్చుకునేందుకు స్థానిక అధికార పార్టీ నాయకులు ఆసక్తి చూపుతున్నారు. ఇదే సమయంలో పక్క మండలాలకు వెళ్లేందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేల చుట్టూ సచివాలయ ఉద్యోగులు ప్రదక్షిణలు చేస్తున్నారు. కొందరైతే ఒక అడుగు ముందుకేసి తమకు తెలిసిన నాయకుల ద్వారా ఆసక్తి ఉన్న చోటుకు ఎమ్మెల్యేల నుంచి సిఫార్సు లేఖలు తీసుకుంటున్నారు.

**హేతుబద్ధీకరణతో కలిపి ఒకేసారి...**

గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా క్షేత్రస్థాయిలో మరింత మెరుగైన సేవలందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. జనాభా, ఆదాయం ఆధారంగా గ్రామ పంచాయతీలను ఇప్పటికే గ్రేడ్ల వారీగా విభజించేందుకు ప్రతిపాదించారు. మరోపక్క పౌర సేవలను మరింత సులభతరం చేసేవిధంగా సచివాలయాలను క్లస్టర్లుగా విభజించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ నెలాఖరులోపు బదిలీల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండడంతో జిల్లా అధికారులు కసరత్తు ప్రారంభించారు. సచివాలయాల ఉద్యోగుల హేతుబద్ధీకరణతోపాటు, బదిలీలు ఒకేసారి జరుగనున్నాయి. గత ప్రభుత్వం సచివాలయానికి 8 నుంచి 11 మంది వరకు ఉద్యోగులను నియమించింది. తాజా మార్గదర్శకాలతో 'ఏ' కేటగిరి సచివాలయాల్లో ఆరుగురుబీ 'బీ'లో ఏడుగురుబీ 'సీ'లో ఎనిమిది మంది ఉద్యోగులు ఉండనున్నారు. మిగతా ఉద్యోగులను ఇతర శాఖలకు సర్దుబాటు చేయనున్నారు.

# యంత్రం కదలక.. సమస్య తొలగక!




కందుకూరు : కందుకూరు పట్టణాన్ని చెత్త సమస్య వీడటం లేదు. ఏళ్లుగా పేరుకుపోయిన చెత్త కొండను తలపిస్తుండగా– ఈ సమస్యకు పరిష్కారంగా ప్రారంభించిన ఎంఆర్ఎఫ్ (మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్) నిరుపయోగంగా ఉంది. రూ. కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ఇప్పటి వరకు ఊరట ఇవ్వలేదు.

**కొండలా డంపింగ్ యార్డు**

మున్సిపాలిటీలో విలీన గ్రామాలు పోను.. మిగిలిన 30 వార్డుల్లో సుమారు 70వేల మంది జనాభా ఉన్నట్లు అంచనా. రోజూ పారిశుద్ధ్య కార్మికులు చెత్తను పోగు చేసి.. వాహనాల్లో గుర్రంవారిపాలెం సమీపంలోని డంపింగ్ యార్డుకు తరలిస్తుంటారు. నిత్యం సుమారు 25 టన్నులు ఉత్పత్తి అవుతున్నట్లు అధికారుల అంచనా. 30వేల టన్నులు పోగుపడినట్లు గుర్తించినా.. వైకాపా ప్రభుత్వం అయిదేళ్లు కనీసం పట్టించుకున్నది లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ఈ సమస్యపై దృష్టిసారించింది. అందులో భాగంగానే ఈ ఏడాది ఫిబ్రవరిలో స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆ సందర్భంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ.. వంద రోజుల్లో ప్రస్తుతం ఉన్న చెత్తను గుంటూరుకు తరలిస్తామని.. మరో నెల రోజుల తర్వాత రోజూ ఉత్పత్తి అయ్యే చెత్తను ప్రాసెస్ చేస్తామని చెప్పారు. అందులో భాగంగా చెత్త తరలింపునకు తరుణి అసోసియేట్స్‌కు టెండర్ అప్పగించారు. ఇప్పటికీ అడుగు ముందుకు పడలేదు.

**అడుగు పడకనే..**

స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కందుకూరుకు వచ్చిన ముఖ్యమంత్రి ఫిబ్రవరి 15వతేదీ ఎంఆర్ఎఫ్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇక్కడ నిర్దేశించిన ప్రక్రియ మార్చి ఒకటో తేదీ నుంచే ప్రారంభమవుతుందని ప్రకటించినా.. సదరు సంస్థ ఇంకా ప్రక్రియ మొదలుపెట్టలేదు. మరోవైపు రోజూ 30 టన్నుల చెత్తను గుంటూరుకు తరలించేందుకు కంప్రెస్డ్ వాహనం 50 శాతం రాయితీతో కందుకూరుకు మంజూరు చేస్తామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ తెలిపినా.. అదీ రాలేదు. దాంతో సమస్య అలాగే ఉండిపోయిందని ప్రజలు అంటున్నారు. ఎంఆర్ఎఫ్ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి.. చెత్త సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

**తరలింపునకు చర్యలు** డంపింగ్ యార్డులో ప్రస్తుతం ఉన్న చెత్త తరలింపునకు టెండరు పూర్తయింది. సదరు సంస్థ ఇటీవల వచ్చి సర్వే నిర్వహించింది. త్వరలోనే తరలింపు ప్రక్రియ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. కంప్రెస్డ్ వాహనం త్వరలోనే మంజూరవుతుంది. కె.అనూష, మున్సిపల్ కమిషనర్

## మెరక అన్నారు.. నిధులు మెక్కేశారు!

కాకినాడ: వైకాపా ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల్లో మెరక పేరుతో ఆ పార్టీ నేతలు కొందరు మేసేశారు. కొండ దిగువన, లోతట్టు ప్రాంతాలు, సముద్రతీరం, మడ భూముల్లో స్థలాలు ఇవ్వడంతో వాటిని చదును చేసే క్రమంలో రూ.కోట్లను వెనకేసుకున్నారు. కొన్నిచోట్ల అరకొరగా లేఅవుట్లను పోల్చి మొత్తం చేసినట్లు బిల్లులు చేసుకున్నారు. వీటిపై ఇప్పటికే విజిలెన్స్ విచారణ చేపట్టారు. తాజాగా మరోసారి జిల్లాలోని 300 లేఅవుట్లలో గ్రావెల్‌తో చేసిన పనుల్లో నాణ్యత ఎంతో నిగ్గుతేల్చడానికి సిద్ధమవుతున్నారు.

కాకినాడ జిల్లాలో 320కి పైగా లేఅవుట్లలో గ్రావెల్‌తో చదును పనులు చేశారు. ఇందుకు సుమారు రూ.300 కోట్ల పైనే ఖర్చుచేశారు. వాటిలో చాలావరకు గత ప్రభుత్వంలోనే బిల్లులు చేసుకున్నారు. ఇంకా కొంతమంది నేతలు తమకు బిల్లులు చేయాల్సి ఉందని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే చెల్లించిన సొమ్ము ఎక్కువగా ఉందని, అసలు క్షేత్రస్థాయిలో చేసిన పని, నాణ్యత చూసి నివేదిక ఇవ్వాలని ఆర్‌డబ్ల్యుఎస్, గృహనిర్మాణశాఖ, నరేగా నాణ్యత విభాగం అధికారులకు ఆదేశాలందాయి. 12 బృందాలతో విచారణకు సిద్ధమవుతున్నారు. ఆయా లేఅవుట్లకు వెళ్లి నిజంగా గ్రావెల్‌తో చదును చేశారా.? ఎం.బుక్‌లో రికార్డు మేరకు జరిగిందా? ఈ గ్రావెల్‌ను ఎక్కడి నుంచి తెచ్చారు.? నిబంధనల ప్రకారం బిల్లులు చెల్లించారా.? అనేది పరిశీలించాలి. గుత్తేదారులకు ఇంకా చెల్లించాల్సి ఉన్నా, అవకతవకలు జరిగినట్లు గుర్తించినా తుది నివేదికను ప్రభుత్వానికి అందజేయాలి.

**కొమరగిరి, కరప లేఅవుట్లలో కనికట్టు**

కాకినాడ పట్టణం, గ్రామీణ నియోజకవర్గాల వారికి యు.కొత్తపల్లి మండలంలో సముద్రతీరానికి ఆనుకుని కొమరగిరి, కరప సమీప



లోతట్టు ప్రాంతంలో భారీ లేఅవుట్లు వేశారు. భూముల కొనుగోలులోనే భారీగా అక్రమాలు జరిగాయి. ఆయా లేఅవుట్లను అప్పటి ప్రజాప్రతినిధులే తమ అనుచరుల పేరుతో చదును పనులు చేయించారు. ఈ రెండు లేఅవుట్లకు సంబంధించే సుమారు రూ.150 కోట్ల వరకు గ్రావెల్‌తో లెవలింగ్ చేశామని లెక్కల్లో చూపించినట్లు తెలిసింది. అప్పట్లోనే సీఎంవో నుంచి ఓ ప్రత్యేకాధికారి పరిశీలించి ఇంత భారీ మొత్తంలో ఎందుకు ఖర్చుచేయాల్సి వచ్చిందనే అనుమానం వ్యక్తంచేశారు. బిల్లుల చెల్లింపుల్లో కొర్రీలు పెట్టారు. అయినా అధికారం అడ్డుపెట్టుకుని బిల్లులు చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి.

**లెక్కలు తేలుస్తారా..**

జిల్లాలోని మిగతా లేఅవుట్లలోనూ చదును పనుల పేరిట సొమ్ములు భారీగానే బొక్కేశారు. కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేపట్టినా నివేదిక ఇంకా బయటపెట్టలేదు. ఇప్పుడు ప్రత్యేక బృందాలతో మళ్లీ తనిఖీలు చేస్తున్నారు. డ్వామా పీడీ వెంకటలక్ష్మి వద్ద ప్రస్తావించగా కొంతమంది బకాయిలు కోసం న్యాయస్థానానికి వెళ్లడంతో వాటిని చెల్లించడానికి ముందు ఓసారి పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. కలెక్టర్ సూచనలతో తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు.

## అంతర్వేది.. సౌకర్యాల జాడేది!

అంతర్వేది: దక్షిణ కాశీగా.. నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటిగా పేరొందిన అంతర్వేదిలో లక్ష్మీనరసింహస్వామి, పార్వతీ నీలకంఠేశ్వర స్వామి, వశిష్ఠ.. ఇలా అనేక ఆలయాలతో పాటు దీపస్తంభం, గోదావరి సాగర సంగమం, గలగలపారే గోదావరిలో లాహిరి లాహిరి అంటూ సాగిపోయే బోటింగ్, సందర్శకులను కట్టి పడేసే వందలాది రకాల జలపుష్పాలు (చేపలు), ఫిష్ ల్యాండింగ్ సెంటర్, వేట దృశ్యాలు.. ఇలాంటి అనేక వనరులున్నాయి. ఇంతటి ప్రాముఖ్యం ఉన్న ఈ ప్రాంతంలో అభివృద్ధి జాడ కనిపించకపోవడంతో ఇక్కడికి వచ్చే వేలాది మంది పర్యాటకులు అసంతృప్తితో వెనుదిరుగుతున్నారు. కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

**ఇదీ పరిస్థితి..**

ముందుగా ఆలయాలను దర్శించుకుని అనంతరం బీచ్‌లో సరదాగా గడపడానికి వస్తుంటారు. వీరికి దుస్తులు మార్చుకోవడానికి, విశ్రాంతి తీసుకోవడానికి వసతులు, తాగునీరు లేదు. రక్షణ చర్యలు శూన్యం. దీంతో వచ్చిన వెంటనే వెనుదిరుగుతున్నారు.

దీపస్తంభం వద్ద ఏడాదిన్నర కిందట రూ.90 లక్షలతో కేంద్ర ప్రభుత్వం పార్క్ నిర్మించింది. ఇది సముద్రయాన, రక్షణశాఖ ఆధ్వర్యంలో ఉ



ంది. ఇక్కడికి వెళ్లేందుకు కూడా సరైన రహదారి సౌకర్యం లేదు. దీంతో నిరుపయోగంగా మారింది.

**ఉపాధి అవకాశాలు మెండు**

అంతర్వేదిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. బీచ్‌కి వచ్చే సందర్శకులకు ఫొటోలు తీస్తూ, తినుబండారాలు విక్రయిస్తూ, పిల్లలు, పెద్దలకు గుర్రపుస్వారీ చేయించేవారు, ఏటీవీ వాహనాలు నడుపుతూ, బోట్లలో బోటింగ్ చేయిస్తూ ఎంతోమంది జీవనోపాధి పొందుతున్నారు. ప్రభుత్వం మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే వందల సంఖ్యలో కుటుంబాల వారికి ఉపాధి కలుగుతుంది. దీనికితోడు పర్యాటకులు జలపుష్పాలను, ఎండుచేపలను చూసి కొలుగోలు చేసుకుంటున్నారు. వీటి విక్రయాలు పెరగడానికి సైతం అవకాశం ఉంటుంది. **టెంపుల్ టూరిజంగా తయారు చేస్తాం** అంతర్వేది పరిసర ప్రాంతాలను టెంపుల్ టూరిజంగా తయారు చేయడానికి ప్రణాళిక తయారు చేసి ప్రభుత్వానికి ఇచ్చాం. సఖినేటిపల్లి నుంచి నిర్మించబోయే 216 జాతీయ రహదారికి అనుసంధానంగా అంతర్వేదికి ప్రత్యేక రోడ్డు నిర్మిస్తాం. 2026 జనవరిలో బీచ్ ఫెస్టివల్ జరుపుతాం. వేలాది మంది సందర్శకులను ఆకర్షించేలా ఇక్కడ ఏర్పాట్లు చేస్తాం.

# విరామానికి సెలవు!

నక్కపల్లి : సుదీర్ఘ విరామానికి మత్స్యకారులు సెలవిచ్చే సమయం ఆసన్నమైంది. వేట నిషేధం గడువు ముగియనుండటంతో అగాధ జలరాశిలో నుంచి మళ్లీ వేటకు సిద్ధం అవుతున్నారు. ఇప్పటివరకు బోసిపోయిన తీరప్రాంతంలో సందడి నెలకొంది. జిల్లాలోని పాయకరావుపేట మండలం పాల్మన్‌పేట నుంచి నక్కపల్లి, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం తదితర మండలాల్లో పొడవైన తీరప్రాంతం ఉంది. దాదాపు 80 వేల మంది వేటపై ఆధారపడి జీవిస్తున్నారు. కర్రతెప్పలు, ఇంజిన్ బోట్లు 2,360 ఉండగా వీటిపై నిత్యం వేట సాగిస్తుంటారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకు 61 రోజుల పాటు సంద్రంలో చేపలపై నిషేధం కొనసాగుతోంది. వేట లేకపోతే మత్స్యకారులు ఉపాధి కోల్పోతారు. దీన్ని గట్టెక్కించేందుకు కూటమి ప్రభుత్వం ఎన్నడూ లేనివిధంగా మత్స్యకారులకు పరిహారాన్ని రూ.20 వేలకు పెంచింది. జిల్లాలోని పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాల్లో 12,644 మంది లబ్ధిదారులను గుర్తించి గతనెలలోనే నగదు జమ చేశారు. ఖాతాలు సక్రమంగా లేకపోవడం, ఆధార్ లింక్ తేదాలు తదితర కారణాలతో జిల్లాలో 800 మందికి నగదు జమ జరగలేదు. వీరంతా తమకు రావల్సిన లబ్ధికోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం నిషేధం గడువు ముగింపు దశకు చేరడంతో పాల్మన్‌పేట, రత్నాయంపేట, రాజానగరం, వెంకటనగరం, రాజవరం, గజపతినగరం, పెంటకోట తదితర మత్స్యకార గ్రామాల పరిధిలో తీరప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది.



ఎక్కడ చూసినా గంగపుత్రులు వలలను సిద్ధం చేసుకుంటున్నారు. కొంతమంది పడవలకు మరమ్మతు చేస్తూ వేటకు ఏర్పాట్లు పూర్తి చేసుకుంటున్నారు. **త్వరలోనే నగదు జమ...** -ఎం.ప్రసాద్, మత్స్యశాఖ జిల్లా అధికారి మత్స్యకారులు యథావిధిగా వేటకు వెళ్ళొచ్చు. మత్స్యకారుల సేవలో పథకానికి సంబంధించి కొందరికి ఇప్పటికి నగదు జమకాని మాట వాస్తవమే. ఇప్పటికే 400 మంది వరకు తమ వివరాలను సరిచేసి ఇచ్చారు. రెండు మూడు రోజుల్లో వీరి ఖాతాలకు పరిహారం సొమ్ము చేరుతుంది. మిగిలిన వారు వివరాలు సమర్పిస్తే త్వరలోనే నగదు జమవుతుంది.

# వే'గంగా' కుడి గట్టు

నంద్యాల : వైకాపా ప్రభుత్వం నిధులివ్వకుండా ఆపేసిన శ్రీశైలం కుడి ప్రధాన కాల్వ (ఎస్‌ఆర్‌ఎంసీ) విస్తరణ పనులపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. శ్రీశైలం కుడిగట్టు ప్రధాన కాల్వను ఏడువేల క్యూసెక్కుల నీటి సామర్థ్యంతో నిర్మించారు. బనకచెర్ల నుంచి గోరుకల్లు జలాశయం వరకు 22వేల క్యూసెక్కుల నీరు పారేలా విస్తరించాలని 2006లో నిర్ణయించారు. కొనసాగుతున్న ఆ పనులను వైకాపా ఆపేసింది.. 34వేల క్యూసెక్కులు తరలించేలా కాల్వను పటిష్ఠం చేస్తామని ప్రగల్భాలు పలికింది. పోతిరెడ్డిపాడు నుంచి గోరుకల్లు రిజర్వాయర్ వరకు విస్తరణ పనులకు రూ.1,167 కోట్లు వెచ్చించనున్నట్లు ప్రకటించారు.

**పనుల పూర్తికి గడువు పెంపు**

2021లో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం పనులు 36 నెలల్లో పూర్తి చేయాలి. తాజాగా వచ్చే ఏడాది సెప్టెంబరు 30 నాటికి పనులు చేయాలని గడువు పెంచారు. సాధారణంగా శ్రీశైలం నీటిమట్టం 840 అడుగులకు చేరుకునే లోపే పనులు చేయాలి.. తర్వాత సాధ్యం కాదు. ఏప్రిల్ నుంచి జులై వరకు మాత్రమే గరిష్ఠంగా నాలుగు నెలలే పనులు చేయడానికి వీలుంటుంది. 78 మీటర్ల వెడల్పు, 12.5 మీటర్ల లోతులో ఉన్న కాల్వలో పనులు చేయాలంటే ముందుగా మోటార్లు పెట్టి నీళ్లను తోడాల్సి ఉంటుంది.

**వైకాపా పైసాచికత్వం**

నిత్యం 80 వేల క్యూసెక్కుల కృష్ణా జలాలను పోతిరెడ్డిపాడు నీటి నియంత్రణ వ్యవస్థ నుంచి బనకచర్ల సముదాయానికి తరలించాలి. ఇందుకు సంబంధించి ఎస్‌ఆర్‌ఎంసీని విస్తరించాల్సి ఉంది. మొదటి ప్యాకేజీ కింద 0-16 కి.మీ. (పోతిరెడ్డిపాడు- బనకచర్ల), రెండో ప్యాకేజీ కింద 16వ కి.మీ. నుంచి గోరుకల్లు వరకు చేపట్టాలి. కాల్వను విస్తరించడంతోపాటు బెడ్‌లైనింగ్, ఇరువైపులా లైనింగ్ పనులు



చేయాలి.రూ.300 కోట్ల పనులు చేసినా గత వైకాపా ప్రభుత్వం పైసా ఇవ్వకపోవడంతో 2023లో గుత్తేదారు పనులు ఆపేశారు. ఆగిన పనుల తీరును గతేడాది అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో రూ.200 కోట్లు విడుదల చేసింది. ఏప్రిల్ నుంచి పనులు మొదలు పెట్టారు. రాత్రింబవళ్లు పనులు చేస్తున్నారు.

**దిగువకు చేరని నీరు**కృష్ణా వెనుక జలాలను 30 రోజుల్లోనే రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లాకు 210 టీఎంసీలను నిల్వ చేయడానికి ఉద్దేశించిన ఎస్‌ఆర్‌ఎంసీ పనులపై నాటి వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని కనబరిచింది. ఒక్క పైసా నిధులు విడుదల చేయలేదు. గతేడాది పదిసార్లకు పైగా శ్రీశైలం రిజర్వాయర్ నిండి గేట్లు ఎత్తి నీటిని దిగువ ప్రాంతానికి వదిలినా రబీలో సాగునీరు లేక రైతులు ఇబ్బందులు పడ్డారు. చివరి ఆయకట్టుకు నీళ్లు అందక అన్నదాతలు రోడ్డెక్కారు. పనులు పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు.

**నిత్యం 7 టీఎంసీలు తరలించేలా**కృష్ణానదికి వరదలొచ్చే 30 రోజుల్లో నిత్యం 7 టీఎంసీల చొప్పున 80 వేల క్యూసెక్కుల నీటిని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమ ప్రాంతానికి తరలించాలని లక్ష్యంగా నిర్దేశించుకొన్నారు. అంటే 30 రోజుల్లో 210 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవాల్సి ఉంటుంది.ప్రస్తుతం బనకచర్ల నుంచి నిత్యం వెలుగోడు రిజర్వాయర్‌కు 12 వేల క్యూసెక్కులు పంపిస్తున్నారు.. విస్తరణ పనులు పూర్తయితే 20 వేల క్యూసెక్కులను పంపిస్తారు. అదేవిధంగా గోరుకల్లు రిజర్వాయరు కు 30 వేలు, కేసీ కాల్వకు 30 వేల క్యూసెక్కుల చొప్పున పంపించనున్నారు.

# 'ఉక్కు' సంకల్పమే కీలకం




విశాఖపట్నం: విశాఖ ఉక్కులో పూర్తిస్థాయి ఉత్పత్తి దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రస్తుతం బ్లాస్ట్ ఫర్నేస్ (బీఎఫ్) 1, 2 నడుస్తున్నాయి. మూడో ఫర్నేస్‌ను ఈ నెల 23న ప్రారంభించేందుకు ప్రణాళిక చేశారు. అవసరమైన బొగ్గు, ఇనుపఖనిజం, ముడిసరకు సిద్ధం చేశారు. కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్ల భారీ ప్యాకేజీ ప్రకటించాక తొలిసారి పూర్తిస్థాయి ఉత్పత్తికి విశాఖ ఉక్కు సిద్ధమైంది. ప్రస్తుతం రెండు ఫర్నేస్‌ల ద్వారా 14 వేల టన్నుల ఉక్కు ఉత్పత్తి జరుగుతోంది. గత నాలుగు నెలలుగా వందశాతానికి పైగా ఉత్పత్తి వస్తుందంటూ గమనార్హం.

**సీఎంతో చర్చల తర్వాత:** కడపలో మహానాడు నిర్వహించిన సమయంలో స్టీలుప్లాంటు అడిషనల్ ఛార్జి సీఎండీ సక్సేనా... సీఎం చంద్రబాబు నాయుడును ప్రత్యేకంగా కలిశారు. ఈ భేటీలో స్టీలు ప్లాంటు పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. స్టీలు ప్లాంటు లాభాల బాట పట్టేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ప్లాంటు ఉద్యోగులు, యాజమాన్యం సమన్వయంతో పనిచేసి ఫలితాలు రాబట్టాలని కోరారు. విద్యుత్ బిల్లుల బకాయిలు, నీటి సరఫరా ఇతరత్రా వంటివాటికి ఈక్విటీ రూపంలో రూ.2,660 కోట్ల మేర రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటుగా నిలిచింది. చర్చల తర్వాత బ్లాస్ట్ ఫర్నేస్-3ని పునఃప్రారంభించేందుకు అన్ని శాఖల నుంచి జీఎం, డీజీఎం, ఏజీఎం స్థాయి అధికారులు 22 మందితో ఓ కమిటీని వేశారు.

**ఆ పరిస్థితి రాకుండా:** 2023 డిసెంబరులో బ్లాస్ట్‌ఫర్నేస్-3 ప్రారంభించినా ముడిసరకు కొరతతో మూడు నెలలకే మూతపడింది. ప్రస్తుతం రెండు, మూడు నెలలకు సరిపడా నిల్వలు ఉన్నట్లు సమాచారం. ఎన్ఎండీసీ నుంచి ప్రతిరోజూ స్టీలు ప్లాంటుకు 8 రేకుల ఇనుప ఖనిజం సరఫరా చేయాల్సి ఉన్నా ఇప్పటికీ అరకొరగానే అవుతోంది. వర్షాకాలంలో ఇనుప ఖనిజం సరఫరా చేయడమూ కష్టమే. దీనిని దృష్టిలో పెట్టుకుని 1.50లక్షల టన్నుల పెల్లెట్‌లను కొనుగోలు చేసి నిల్వ చేశారు. అంతకు ముందు మరో 40వేల టన్నులు కొనుగోలు చేశారు.

**ఉత్పత్తి ఖర్చు పెరిగితే లాభాలు ఎలా?:** పూర్తిస్థాయి సామర్థ్యంతో స్టీలుప్లాంటును నడిపించినా... లాభాలు కచ్చితంగా వస్తేనే కర్మాగారం నిలదొక్కుకోగలుగుతుందని కార్మిక సంఘాలు అంటున్నాయి. ఎక్కువ విలువైన ఉత్పత్తుల కోసం పెల్లెట్ ఐరన్ వాడతారు. సొంత గనులు ఉండి, పెల్లెట్ యూనిట్ ఉంటే టన్ను రూ.3500-5000 వచ్చేస్తుంది. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం ఒక్కో టన్ను రూ.10,500 ఉంది. ఫలితంగా ఉత్పత్తి ఖర్చు పెరిగే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఉత్పత్తి వ్యయం తగ్గాలంటే భారీ ఖర్చులు తగ్గించుకోవాల్సి ఉందని, అది వదిలేసి కార్మికుల తొలగించి ఖర్చులు తగ్గిస్తామంటే ఎలా అని కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

# 'డబుల్ డెక్కర్' తరహాలో విశాఖ మెట్రో ప్రాజెక్టు



విశాఖపట్నం: నగరంలో ట్రాఫిక్ రద్దీ, ప్రయాణికుల అవసరాలు, భవిష్యత్తు విశాఖ ముఖచిత్రాన్ని దృష్టిలో పెట్టుకొని విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం పట్టాలెక్కిస్తోంది. ఈ నేపథ్యంలోనే 'డబుల్ డెక్కర్' తరహాలో నడిపేలా ఈ ప్రాజెక్టులో కీలక నిర్ణయం తీసుకున్నారు. అంటే.. పైన మెట్రో రైలు... కింద వాహనాల రాకపోకలు సాగిస్తాయి. ఇందులో భాగంగా నాలుగు వరుసలతో కూడిన పైవంతెనలు నగరం నడిబొడ్డున రానున్నాయి. ఈ మార్పు కొత్తగా పోటుచేసుకోవడంతో నాలుగు వరుసల పైవంతెనలు, మెట్రో లైనుకు కలిపి సంయుక్తంగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీకి కన్సల్టెంట్ నియామకానికి ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ ఆసక్తి ఉన్న సంస్థల నుంచి తాజాగా దరఖాస్తులు ఆహ్వానించింది. ఆసియా మౌలిక వసతుల, పెట్టుబడుల బ్యాంకు (ఏఐఐబీ) ప్రతినిధులు రుణం ఇచ్చేందుకు ఆసక్తి చూపి.. మెట్రో రైలు కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డితో కలిసి విశాఖలో పర్యటించడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. **(ఆర్థిక భారం తగ్గి:** వాస్తవానికి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ట్రాఫిక్ రద్దీ సమస్యకు పరిష్కారంగా నగరంలో 12 పైవంతెనలు నిర్మించాలని గతంలో ప్రణాళిక చేసింది. వీటిని మధురవాడ నుంచి లంకెలపాలెం మధ్యలో నిర్మించేలా డీపీఆర్ తయారు చేశారు. ఇదే సమయంలో మెట్రో చేపడితే రెండు పనులతో ఇబ్బందులు వస్తాయి. ఖర్చు అధికమవుతుంది. ప్రాజెక్టు సంయుక్తంగా చేపడితే స్థలం, ఖర్చు ఆదా చేసినట్లవుతుందని నిర్ణయించారు. ఇప్పటికే డబుల్ డెక్కర్ తరహా మెట్రో దేశంలోని నాగపూర్‌లో నిర్వహిస్తున్నారు. ఆ ప్రాజెక్టుకు డీపీఆర్ తయారు చేసిన సంస్థ నుంచి వివరాలు సేకరించి జాతీయ రహదారుల సంస్థకు అధికారులు సమర్పించారు. దీంతో ఈ ప్రాజెక్టు వ్యయాన్ని ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్, ఎన్‌హెచ్ఏఐ భరించేలా పట్టాలెక్కించనున్నారు. మొత్తం పర్యవేక్షణ మెట్రో సంస్థ చేపట్టనుంది.

**20 కి.మీ.లలో..:** విశాఖ మెట్రో ప్రాజెక్టును మొత్తం 140.13 కి.మీ.లలో చేపట్టాలనేది ప్రతిపాదన. మొదటి దశలో మూడు కారిడార్లు 46.23 కి.మీ.లలో నిర్మించనున్నారు. ఇందులో 20.16 కిలోమీటర్లు డబుల్ డెక్కర్ తరహాలో పైవంతెనలు నిర్మిస్తారు. మధురవాడ నుంచి తాటిచెట్లపాలెం వరకు, అలాగే గాజువాక నుంచి స్టీల్‌ప్లాంట్ మధ్య రెండు భారీ వంతెనలు నిర్మిస్తారు. ఇక్కడ కింద రోడ్డు.. దానిపై పైవంతెన (ఫ్లైఓవర్), ఆపైన మెట్రో ట్రాక్ వస్తుంది. ఇది అందుబాటులోకి వస్తే ఆసియా ఖండంలోనే పొడవైన మెట్రో డబుల్ డెక్కరుగా గుర్తింపుపొందనుంది.

**వంతెనలను కలిపేసి:** కొమ్మాది- స్టీలుప్లాంటు, గురుద్వారా-పాతపోస్టాఫీసు, తాటిచెట్లపాలెం-చినవాల్తేరు.. మూడు కారిడార్లలో మొదటి దశ కింద విశాఖ మెట్రోకు ప్రణాళిక చేశారు. కొమ్మాది-స్టీల్‌ప్లాంటు మధ్య నిర్మించే 34.40 కి.మీ కారిడార్‌లోనే డబుల్ డెక్కర్ ట్రాక్ రానుంది. మధురవాడ నుంచి తాటిచెట్లపాలెం వరకు 15.06 కి.మీ.లో వచ్చే కారిడార్‌ను 8 పైవంతెనలను అనుసంధానం చేసి ఒకే వంతెనగా ఎన్‌హెచ్ఏఐతో కలిసి నిర్మిస్తారు. గాజువాక నుంచి స్టీల్‌ప్లాంటు మధ్య మరొకటి చేపడతారు.

# రాజాం రహదారి విస్తరణ ప్రారంభం



రాజాం : రాజాం రహదారి విస్తరణ పనులు తిరిగి ప్రారంభించారు. రూ.20 కోట్లతో గాయత్రీ కాలనీ నుంచి బొబ్బిలి కూడలి, అంబేడ్కర్ కూడలి నుంచి జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల వరకూ 80 అడుగుల వెడల్పున రహదారి విస్తరణ పనులు పూర్తి చేయాల్సి ఉంది. రూ.8 కోట్ల వరకు బిల్లులు ఉండడంతో గుత్తేదారు పనులు నిలిపేశారు. ప్రచురితమైన కథనం జనం ఇబ్బందులను కళ్లకు కట్టింది. దీనిపై ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ స్పందించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు రూ.2 కోట్లు, రూ.6 కోట్లు రెండు బిల్లులు ప్రభుత్వానికి నివేదించడంతో రూ.2 కోట్ల బిల్లు మంజూరు చేశారు. దీంతో గుత్తేదారు పనులు మొదలుపెట్టారు. బొబ్బిలి రహదారిలో భవనాలు తొలగించే పనులు చేస్తున్నారు. వర్షాకాలం మొదలవడంతో తొలుత వరద కాలువల నిర్మాణం చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. పోలీస్ స్టేషన్ రోడ్డు నుంచి బొబ్బిలి కూడలి వరకు కాలువ నిర్మించనున్నారు. అంబేడ్కర్ కూడలి నుంచి 150 మీటర్ల మేర కాలువలు పూర్తి చేయాలి. వీటి తర్వాత రహదారి మెటల్, తారుపూత పనులు చేపడతారు. త్వరితగతిన పనులు పూర్తి చేస్తామని రోడ్లు, భవనాల శాఖ జేఈ నాగభూషణరావు తెలిపారు.

# కుళ్లుతున్న కూరగాయలు

ఆదోని : కూరగాయలు నీటిలో కొట్టుకుపోవడం.. మురుగంతా నిల్వ ఉండటం.. అడుగు తీసి అడుగు వేయలేనంతా బురద పేరుకుపోవడం.. దీన్ని యథాస్థానానికి తెచ్చేందుకు అధికారులు, సిబ్బంది నానా అవస్థలు పడటం.. ఇది వర్షాకాలంలో తరచూ ఎదురయ్యే పరిస్థితి. ఆదోని రైతు బజార్‌లో ముంపు సమస్య రైతులు వ్యాపారులు, వినియోగదారులకు చిక్కులు తెచ్చిపెడుతోంది.

**ఎత్తు పెంచడమే పరిష్కారం**

పట్టణ నడిబొడ్డున, ఆదీ రైల్వేస్టేషన్, బస్టాండుతో పాటు వస్త్ర వ్యాపార సముదాయాలకు, షరాఫ్‌బజార్‌కు, వివిధ రకాల మార్కెట్ ప్రాంతానికి రైతుబజార్ దగ్గరగా ఉండటంతో పల్లె, పట్టణ వాసులంతా ఇక్కడే కూరగాయలు కొనుగోలు చేస్తారు.

ప్రధానంగా రైతుబజార్ ఎత్తు పెంచాలి. చుట్టూ షెడ్లు నిర్మించి, వ్యాపారులకు అనుకూలంగా మార్చాలి. ముందు భాగంలో ఆక్రమణలు తొలగించి సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేయాలి. మురుగుదొడ్లు, తాగునీటి వ్యవస్థతో పాటు కేంద్రాన్ని ఆధునికీకరించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత వాతావరణం తగ్గట్లు రూపురేఖలు మార్చడంతో పాటు ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి.




**కొర్రీలు పెడుతున్న పురపాలకశాఖ**

రైతు బజార్‌ను అభివృద్ధి చేయాలని గతంలో చేసిన ప్రతిపాదనలు అటకెక్కాయి. రైతు బజార్‌కు కేటాయించిన స్థలం పురపాలక సంఘానిది.. రైతుబజార్‌ను మార్కెటింగ్ శాఖ నిర్వహిస్తోంది. రెండు శాఖల మధ్య సమన్వయం లోపించింది. స్థలం బదలాయించడానికి పురపాలక శాఖ అధికారులు అంగీకరించడం లేదు.

**నెలకు రూ.50 వేల ఆదాయం**

1999లో తెదేపా ప్రభుత్వ హయాంలో పాత ఆకాశవంతెన ప్రాంతంలో 60 సెంట్ల స్థలంలో రైతుబజార్ నిర్మించారు. ఇక్కడ 30 స్టాల్స్, నాలుగు దుకాణాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 15 స్టాల్స్ కొనసాగుతున్నాయి. నెలకు అద్దెల రూపంలో రూ.40-50 వేలు ఆదాయం సమకూరుతోంది. రోజుకు 1500 మంది వినియోగదారులు ఇక్కడికి వస్తుంటారు.

**వంక ముంచుతోంది**


రైతుబజార్ లోతట్టు ప్రాంతంలో ఉండటంతో వర్షం నీరంతా కేంద్రంలోకి వచ్చి చేరుతోంది. దీనికి తోడు పక్కనే పెద్ద వంక పారుతోంది. ఆ పరిసరాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు, మర్చంట్ క్లబ్ ప్రాంతంలో మురుగు వంక ప్రవాహం తట్టుకోలేక నీరంతా వెనక్కి నెట్టి రైతు బజార్‌లోకి చొచ్చుకెళ్తోంది. ఫలితంగా మోకాలి లోతు నీరు చేరుతుండటంతో వ్యాపారాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిల్వ ఉంచి వెళ్లిన కూరగాయలు వర్షంలో తడిసి నష్టం కలుగుతోంది. కిరాణం, ఇతర వ్యాపారుల పరిస్థితి ఇలానే ఉంది.

# అవసరం అధికం.. అందుతోంది సగం

నంద్యాల : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని నాలుగేళ్ల కిందట సర్వజన ఆసుపత్రిగా మార్చారు. ఇక్కడికొచ్చే రోగుల సంఖ్య పెరిగింది. వీరికి అవసరమయ్యే ముఖ్యమైన మాత్రలు అందుబాటులో ఉండటం లేదు. సూపర్‌స్పెషాలిటీ సేవలందిస్తున్నట్లు చెబుతున్నా కనీసం మధుమేహానికి సంబంధించి ఔషధాలు ఇవ్వకపోవడంతో రోగులు మండిపడుతున్నారు. మందుల కొనుగోలుకు ఏటా రూ.3.2 కోట్లు కేటాయిస్తున్నారు. మూడు నెలలకు ఒకసారి రూ.80 లక్షలు విడుదల చేస్తారు. వాటిని వెచ్చించి సెంట్రల్‌డ్రగ్స్‌లో లేనివి కొనాలి. ఇక్కడ లేని ఔషధాలు వైద్యులు రాస్తుండటంతో డబ్బులిచ్చి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఒక్కోరోగిపై రూ.200 నుంచి రూ.500 వరకు భారం పడుతోంది.

1. మధుమేహంతో బాధపడుతున్న వ్యక్తికి రెండు రకాల ఔషధాలు రాసిచ్చారు. అవి నంద్యాల సర్వజన ఆసుపత్రిలో లేకపోవడంతో ప్రైవేటు దుకాణానికి వెళ్లారు..రూ.500 వెచ్చించి మందులు కొనుగోలు చేశారు.

2. నరాల సమస్యతో బాధపడుతూ బాధితుడు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికొచ్చారు. నాలుగు రకాల ఔషధాలు వాడాలని వైద్యులు రాసిచ్చారు. అందులో కొన్ని లేకపోవడంతో రూ.300



వెచ్చించి బయట తెచ్చుకొన్నారు.

అవసరమైన ఔషధాలు లేకపోవడంతో సర్వజన ఆసుపత్రికొచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు.

**అదీగనని ఇవ్వకుండా**

సర్వజన ఆసుపత్రిలో నిత్యం 20కి పైగా శస్త్రచికిత్సలు చేస్తున్నారు. యూరిన్ పైపు కూడా లేకపోవడంతో బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. పెద్దలకు, పిల్లలకు సెలైన్ ఎక్కించాలంటే అవసరమైన సామగ్రి కొరత వేధిస్తోంది.

చాలా మంది రోగులు డోలో 650 ఎంజీ అడుగుతుంటే...ఆసుపత్రిలో 500 ఎంజీ పారాసెటమల్ ఇస్తున్నారు.. గ్లౌజులూ కొనాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు.

**జనరిక్‌కు తాళం వేసిన వైకాపా** ఆసుపత్రిలో లేని మందులు తెచ్చుకోడానికి జనరిక్ దుకాణం గతంలో ఉండేది. గత వైకాపా ప్రభుత్వంలో రాజకీయ జోక్యంతో జనరిక్ మందుల దుకాణాలు మూతపడ్డాయి. వాటికి టెండర్లు వేసి ఏళ్లు గడుస్తున్నా..అతీగతీ లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తీరడం లేదు.

# రోడ్డు ప్రమాద బాధితులకు అండగా..

విశాఖపట్నం: గుర్తు తెలియని వాహనాలు ఢీకొట్టిన ప్రమాదాల్లో బాధితులకు విశాఖ పోలీసులు అండగా నిలుస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో 2022 ఏప్రిల్ 1వ తేదీ నుంచి జరిగిన హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు పరిహారం అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రం' పేరుతో విశాఖ సీపీ కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం లో సీఐ, ఎస్.ఐ ఆధ్వర్యంలో ప్రత్యేక సిబ్బంది పనిచేస్తున్నారు. గుర్తు తెలియని వాహనాలు ఢీకొన్న ఘోర రోడ్డు ప్రమాదాల్లో మృతులకు రూ.2లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50వేలు కేంద్ర ప్రభుత్వ పథకం నుంచి అందేలా చర్యలు చేపట్టారు. గతేడాది డిసెంబరు నుంచి ఇప్పటి వరకు 51 మంది బాధితులకు రూ.40.50లక్షలు పరిహారం అందేలా చేయడంపై హర్షం వ్యక్తమవుతోంది.

**దగ్గరుండి దరఖాస్తు చేయించి:** హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు ఈ కేంద్ర పథకం గురించి అవగాహన ఉండటం లేదు. ఒకవేళ అవగాహన ఉండి దరఖాస్తు చేసినా అందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సేకరించేందుకు స్టేషన్లు, ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఫలితంగా పరిహారం అందడంలో జాప్యమవుతోంది. ఇది గుర్తించిన విశాఖ సిటీ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ తన కార్యాలయంలోనే ఓ సెల్ ఏర్పాటు చేశారు. ఈ బృందం హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు అవగాహన కల్పించడంతోపాటు, ఓ కానిస్టేబుల్‌ను ప్రత్యేకంగా కేటాయిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందితే పోస్టుమార్టం రిపోర్టు, తీవ్ర గాయాలైతే క్షతగాత్రులకు ధ్రువీకరణ పత్రం, ఎంవీఐ నివేదికలు తెప్పించి బాధితులతో దరఖాస్తు చేయిస్తున్నారు.

**కలెక్టర్ ఛైర్మన్‌గా:** ఈ కేంద్ర ప్రభుత్వ పథకానికి జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఛైర్మన్‌గా ఉన్నారు. గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రదేశాన్ని బట్టి సంబంధిత తహసీల్దార్ తొలుత ఆ దరఖాస్తును విచారిస్తారు. ఆ తర్వాత ఆర్డీవో నుంచి కలెక్టర్ వద్దకు వెళ్లి అక్కడ ఆమోదిస్తారు. కలెక్టర్, ట్రాఫిక్ ఏడీసీపీ, రవాణాశాఖ డీటీసీ అధికారుల కమిటీ



సంతకాలు చేసి ఫైనల్ చేస్తుంది. ఆ దరఖాస్తును జీఐ (జనరల్ ఇన్సూరెన్స్) కౌన్సిల్ ముంబైకు కమిషనరేట్ నుంచి కాపీలు స్కాన్ చేసి పంపిస్తారు. అంతా సక్రమంగా ఉంటే నేరుగా బాధిత ఖాతాలో పరిహారం జమ చేస్తారు.

**ఎంవీవోపీ కేసుల్లోనూ బాధితులకు..:** గుర్తు తెలియని వాహనాలు ఢీకొట్టిన కేసులతోపాటు రోడ్డు ప్రమాదాల కేసుల్లోనూ బాధితులకు ఈ కేంద్రం సహాయం చేస్తోంది. బాధితులకు బీమా ఇప్పించే విషయంలో, డాక్యుమెంటరీ, న్యాయ సహకారం అందిస్తున్నారు. విశాఖ పరిధిలో గడిచిన పదేళ్లలో పరిశీలిస్తే ఎంవీవోపీ (మోటార్ వెహికల్ ఒరిజినల్ పిటిషన్) కేసులు పదివేలకు పైగా ఉన్నాయి. ఈ కేంద్రం ఏర్పాటు చేశాక 353 కేసులు జిల్లా కోర్టులో ఫైల్ చేసేలా చూశారు.

'హిట్ అండ్ రన్ కేసుల్లో రోడ్డు ప్రమాద బాధితులకు న్యాయం జరిగేలా ప్రత్యేక దృష్టిసారించాం. బాధితులు ఎవరైనా పరిహారం అందకపోతే ఈ కేంద్రం సేవలు సద్వినియోగం చేసుకోవచ్చు. టోల్ ఫ్రీ నెంబరు 79950-95793కు కాల్ చేయొచ్చు'. శంఖబ్రత బాగ్చీ, సిటీ పోలీస్ కమిషనర్ హిట్ అండ్ రన్ కేసుల వివరాలు..

2022 ఏప్రిల్ తర్వాత మొత్తం కేసులు: 275
పరిహారం అందిన బాధితులు: 51
జనరల్ ఇన్సూరెన్స్ (జీఐ)లో పెండింగ్: 17
కలెక్టర్ ఆమోదముద్రకు సిద్ధంగా: 21
తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో విచారణ దశలో: 107
స్టేషన్ల నుంచి ఇంకా దరఖాస్తు చేయాల్సినవి: 79

# సరిపడా 'గంగ'.. లేదిక బెంగ..!

విశాఖ : ఏటా వేసవిలో నీటికి ఇబ్బందులు ఎదుర్కొనే నగర ప్రజలకు... ఈసారి అలాంటి అవస్థలేమీ ఉండవని, తాగునీటికి కొదవ ఉండదని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. ఇతర జిల్లాల్లోని వనరులపై ఆధారపడుతున్న విశాఖకు.. అవసరమైన నీటిని సరఫరా చేసేందుకు నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి. గతేడాది వర్షాలు బాగానే కురవడంతో వనరుల్లోకి నీరు చేరింది. ప్రధానమైన ఏలేరు జలాశయంతో పాటు గోదావరిలోనూ నీటి మట్టాలు ఆశాజనకంగా ఉన్నాయి. తాటిపూడి, రైవాడ నగరానికి దగ్గరగా ఉన్నా..., అవి వ్యవసాయానికి వినియోగించే నీటి వనరులు. వాటిల్లోనూ



నగరానికి కేటాయింపులు ఉండటంతో నీటిని తరలిస్తున్నారు.

సుమారు 156 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏలేరు రిజర్వాయర్ నుంచి విస్కో (విశాఖపట్నం పరిశ్రమల నీటి సరఫరా సంస్థ) సహకారంతో కాలువ ద్వారా గ్రావిటీపై నీటిని నగరానికి తీసుకొస్తున్నారు. అలా తెచ్చిన నీటిని శుద్ధి చేసి నగర ప్రజలకు అందిస్తున్నారు. నీటి తరలింపునకు జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఏటా రూ.150 కోట్లు వరకు ఖర్చు చేస్తుండగా, రూ.210 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. ఏటా వ్యయ ప్రయాసలకోర్చి ఆయా వనరుల నుంచి నగరానికి నీటిని తరలించుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. వర్షాలు తక్కువగా ఉంటే వనరుల్లో నీరు తగ్గిపోయి, రెండు రోజులకు ఓసారి కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఈ ఏడాది ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు.

ప్రజలకు- పరిశ్రమలకు..! విశాఖ నగర ప్రజలతో పాటు, పరిశ్రమలకు అవసరమైన నీటిని ఇతర జిల్లాల నుంచి తరలించుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ముడసర్లోవ మినహా, నగరంలో తాగునీటి అవసరాలు తీర్చే రిజర్వాయర్లు లేకపోవడంతో తాటిపూడి, రైవాడ, ఏలేరు, గోస్తనీలపై ఆధారపడాల్సి ఉంటుంది.

# 'చిన్న' చూపేలా?



సాగునీటి వనరుల్లో సమృద్ధిగా నీళ్లున్నా అవి పొలాలకు చేరాలంటే ఆనకట్టలు, కాలువలు సక్రమంగా ఉండాలి. ఎక్కడైనా మరమ్మతులు అవసరమైతే వాటిని సరిచేయించి ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే నాటికి సిద్ధంగా ఉంచాలి. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అత్యవసర పనులకూ పైసా కేటాయించలేదు. సాగునీరు పొలాలకు చేరక రైతులు ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక రైతుల్లో ఆశలు చిగురించాయి. ఈ ఏడాది ఖరీఫ్ నాటికి సాగునీటి వనరులన్నింటికీ మరమ్మతు చేయిస్తారని ఎదురుచూస్తున్నారు. జలవనరుల శాఖ అధికారులు ఎక్కడ ఏ పనులు చేపట్టాలో పరిశీలించి నిధుల మంజూరు కోరుతూ ప్రతిపాదనలు పంపారు. జలవనరుల శాఖ నర్సీపట్నం డివిజన్‌లోని పది మండలాల్లో సాగునీటి కాలువలు, ఆనకట్టలు పలుచోట్ల శిథిలమయ్యాయి. నర్సీపట్నం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 17 పనులకు రూ.2.27 కోట్లు, చోడవరం నియోజకవర్గంలోని రోలుగుంట, రావికమతం మండలాల్లో నాలుగు పనులకు రూ.58 లక్షలు, ఎలమంచిలి నియోజకవర్గంలోని రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల్లో పది పనులకు రూ.46 లక్షలు, పాయకరావుపేట నియోజకవర్గంలోని ఎస్.రాయవరం మండలంలో ఎనిమిది పనులకు రూ.38.15 లక్షలు అవసరమని ప్రతిపాదించారు. ఇవికాక 394 చోట్ల చిన్నపాటి మరమ్మతులకు రూ.50.60 కోట్లు అవసరమని అంచనా వేశారు.

గొలుగొండ మండలంలో రావణాపల్లి ఆవ మదుం ఆరునెలల కిందట దెబ్బతింది. తాత్కాలిక మరమ్మతు కోసం సభాపతి అయ్యన్నపాత్రుడు రూ.2 లక్షలు విడుదల చేయించారు. శాశ్వత మరమ్మతుకు రూ.20 లక్షలు అవసరం. వర్షాకాలం రాకముందే ఈ మదుం పునరుద్ధరణ జరిగితే రైతులు ధీమాగా ఉంటారు.

మాకవరపాలెం మండలంలో జాగారం గెడ్డ కోతకు గురవుతోంది. గెడ్డనీరు పొలాలను ముంచెత్తుతోంది. దీనికి రక్షణగోడ నిర్మించాలి. మాకవరపాలెం మండలం కోడూరు ఆనకట్ట, నర్సీపట్నం మండలంలోని గబ్బాడ ఆనకట్ట గేట్లు పాడయ్యాయి. గొలుగొండ మండలం విప్పలపాలెం ఆనకట్ట గేట్లూ దెబ్బతిన్నాయి.

రావికమతం మండలం కల్యాణలోవ రెండో కిలోమీటరు వద్ద ఆక్విడక్టు దెబ్బతింది. నీరు వృథా అవుతుండటంతో దిగువ ఆయకట్టుకు నష్టం జరుగుతోంది. రోలుగుంట మండలం కోమరవోలు ఆవ తూములు పాడవడం వల్ల నీరు లీకేజీ రూపంలో వృథా అవుతోంది.

సాగునీటి కాలువలు, ఆనకట్టల మరమ్మతులు గతంలో ఏప్రిల్ నుంచే మొదలయ్యేవి. జూన్ నెలాఖరు/ జులై రెండో వారానికి పూర్తి చేసేవారు. జిల్లాలో జులై చివరి వారం నుంచి ఆగస్టు నెలాఖరు వరకు వరినాట్లు ముమ్మరంగా జరుగుతుంటాయి. మరమ్మతుల విషయం జలవనరుల శాఖ ఇన్‌ఛార్జి ఈఈ బాలసూర్యం దృష్టికి తీసుకువెళ్లగా.. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. నిధులు విడుదల కాగానే పనులు మొదలవుతాయని పేర్కొన్నారు.

# పెట్టుబడుల ప్రవాహం




అనకాపల్లి: కూటమి ప్రభుత్వంపై పారిశ్రామికవేత్తలకు నమ్మకం కుదిరింది. కొత్తగా తీసుకువచ్చిన ఇండస్ట్రియల్ పాలసీ నచ్చింది. పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతో పెట్టుబడులను ఆకర్షించడానికి అవకాశం వచ్చింది. సర్కారు కొలువుదీరి ఏడాది గడవక ముందే రూ.4.95 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు ప్రవాహంలా వచ్చాయి. ఇందులో సింహభాగం రూ.3.4 లక్షల కోట్ల పెట్టుబడులు అనకాపల్లి జిల్లాకు రావడం విశేషం. మిగతా జిల్లాలతో పోలిస్తే అనకాపల్లి అన్నివిధాలా అనుకూలంగా ఉండటంతో పారిశ్రామిక వేత్తలంతా ఇటువైపే చూస్తున్నారు. తాజాగా రూ.8,339 కోట్లతో రెండు కొత్త పరిశ్రమలు ఏర్పాటుకానుండగా, మరో రెండు కంపెనీలు రెండోదశ విస్తరణకు శ్రీకారం చుడుతున్నాయి. తద్వారా 6,350 మందికిపైగా ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

**ఏడాదిలో ఎంత మార్పు..** అచ్యుతాపురం సెజ్‌కు సంబంధించి గత ఐదేళ్లు ఓ లెక్క.. ఈ ఏడాది ఓ లెక్క అన్నట్లుంది. వైకాపా హయాంలో పారిశ్రామికవేత్తలు ఈ సెజ్ వైపు కన్నెత్తి చూడలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ ఏడాదిలో 'కంపెనీలు పెడతాం.. భూములు ఎక్కడ కేటాయిస్తారు. ఎంత ధర చెల్లించాలి. ఏఏ సదుపాయాలు కల్పిస్తారు. ఎప్పటిలోగా అనుమతులిస్తారు' అంటూ దిగ్గజ సంస్థల నుంచి నుంచి ఔత్సాహిక పారిశ్రామికవేత్తల వరకు ఆరా తీస్తూ ఆసక్తి చూపుతున్నారు. వాటిలో కొన్ని ఇప్పటికే రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో ఆమోదం పొందగా మరికొన్ని కంపెనీలు ప్రతిపాదనలతో సిద్ధంగా ఉన్నాయి.

**ఇది వరకే అనుమతులు..**

రాంబిల్లి మండల పరిధిలోని 106 ఎకరాల్లో సుమారు రూ.1,175 కోట్లతో బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్ అనే కంపెనీ ఏర్పాటుకానుంది. తద్వారా వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

సబ్‌స్ట్రాక్ట్ మాన్యుఫ్యాక్చర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎంటర్‌ప్రైజ్ (స్మైల్) అనే కృత్రిమ మేధ ఉత్పత్తుల తయారీ కంపెనీ రూ.189 కోట్లతో పెట్టుబడితో సెజ్‌లో అడుగుపెడుతోంది.

పశ్చిమ బెంగాల్‌కు చెందిన మా దుర్గా పైపుల తయారీ కంపెనీకి 45 ఎకరాలు కేటాయించనున్నారు. దేశంలో అతి పొడవైన పైపులను తయారీ చేసే ఏకైక కంపెనీ ఇది.

**తాజాగా..**


రాంబిల్లిలో జూపిటర్ రెన్యూవబుల్స్ ప్రై.లి సంస్థ రూ.2,700 కోట్ల పెట్టుబడితో 2,216 మందికి ఉపాధి కల్పించేలా కొత్త కంపెనీ ఏర్పాటు చేయనుంది. 4.8 మెగావాట్ల సోలార్ సెల్, 1.5 మెగావాట్ల మాడ్యుల్స్ తయారీ చేయనుంది.

రాంబిల్లి క్లస్టర్‌లోనే బ్లూజెట్ హెల్త్ కేర్ లిమిటెడ్ సంస్థ రూ.1750 కోట్లతో రాంబిల్లి మండలంలోనే 125 ఎకరాల్లో ఇంటర్మీడియట్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా 1,750 మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

అచ్యుతాపురం సెజ్‌లో జపాన్‌కు చెందిన ఏటీసీ టైర్ల కంపెనీ రెండో దశ విస్తరణ పనులను రూ.1,779 కోట్లతో చేపట్టనుంది. మరో 600 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు.

పాయకరావుపేట మండలంలోని డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీ రూ.1,560 కోట్లతో కుమారపురం వద్ద రెండో దశ విస్తరణ ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకురానుంది. దీనివల్ల 1800 మందికి ఉపాధి లభించనుంది. ఇప్పటికే జిల్లాలో బల్క్‌డ్రగ్ పార్క్, గ్రీన్ హైడ్రోజన్ హబ్ శంకుస్థాపనలు జరగగా ఆర్సెలార్ మిత్తల్ స్టీల్ ప్లాంట్ లాంటి దిగ్గజ ప్రాజెక్టు త్వరలో పట్టాలెక్కనుంది. వీటికి తోడు కొత్తగా వస్తున్న మరికొన్ని కంపెనీలతో అనకాపల్లి జిల్లా పారిశ్రామిక ముఖచిత్రమే మారిపోనుందని పరిశ్రమలశాఖ అధికారులు చెబుతున్నారు.

# రసాయన వ్యర్థాలతో ఉక్కిరిబిక్కిరి



అచ్యుతాపురం : అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటుకు 27 గ్రామాలను తరలించారు. అచ్యుతాపురం మండలం చిప్పాడ, ఉద్దపాలెం, తాళ్లదిబ్బ, రాంబిల్లి మండలం చినపూడి గ్రామాలను ఇప్పటికీ తరలించలేదు. వీటి చుట్టూ ప్రమాదకరమైన రెడ్ జోన్ పరిశ్రమలకు కేటాయించారు. వీటిలో చినపూడి చుట్టూ అత్యంత ప్రమాదకరమైన రసాయనాలు విడుదల చేసే పరిశ్రమలు వెలిశాయి. భరించలేని దుర్గంధాన్ని వెదజల్లే ఈసీటీపీ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఈ కంపెనీల నుంచి లీకవుతున్న రసాయన వ్యర్థాలు చినపూడి తాగునీటి పథకంలో కలవడంతో ఏడాదిన్నర క్రితం ఈ గ్రామానికి చెందిన 60 మంది నిర్వాసితులు వాంతులు, విరోచనాలతో విశాఖలోని కేజీహెచ్‌లో చేరారు. చికిత్స అందడంతో ప్రాణాలతో బయటపడ్డారు. అప్పటి నుంచి ఈ గ్రామానికి ట్యాంకులతో తాగునీటిని అరకొరగా అందిస్తున్నారు. మండుతున్న ఎండలతో సిమెంటు రేకుల ఇళ్లల్లో ఉండలేక నిర్వాసితులు ఇబ్బంది పడుతున్నారు. కనీసం విద్యుత్తును కూడా సక్రమంగా సరఫరా చేయడంలేదని ఆందోళన చేస్తున్నారు. చిప్పాడ, ఉద్దపాలెం, తాళ్లదిబ్బ వాసుల పరిస్థితి ఇదే విధంగా ఉంది. **విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు..:** విద్యుత్తు సరఫరా సక్రమంగా లేదు. సమస్యను పరిష్కరించాలని అచ్యుతాపురం, రాంబిల్లికి చెందిన విద్యుత్తు అధికారులను కోరినా పరిధి మాది కాదంటూ తప్పించుకుంటున్నారు. రసాయన వ్యర్థాలు లీకై తాగునీరు కలుషితమవుతోంది. రాజాన సంజీవి, యువకుడు, ఉద్దపాలెం

తాగునీరు కలుషితం..: ఈసీటీపీ ప్లాంట్ నుంచి వస్తున్న దుర్గంధాన్ని భరించలేకపోతున్నాం. ఇళ్లపై తెల్లటి దుస్తులు ఆరబెడితే నల్లగా మారిపోతున్నాయి. కలుషితమైన తాగునీటితో కిడ్నీ బాధితులు పెరిగిపోతున్నారు. ఎం.రమాదేవి, గృహిణి, చినపూడి

# ప్రాణాలు నిలిపే ప్రణాళికే కీలకం

విశాఖపట్నం : గతేడాది ఆగస్టులో అచ్యుతాపురం సెజ్‌లోని 'ఎసెన్షియా' ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 17 మంది మృత్యువాత పడ్డారు. మరో 24 మందికి అనకాపల్లి, విశాఖ, అచ్యుతాపురంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స అందించారు. అందులో అధిక శాతం క్షతగాత్రులకు ప్రైవేటు ఆసుపత్రుల్లోనే చికిత్స అందించారు. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలంలో జరిగిన బాణాసంచా పేలుడు ఘటనలో గాయపడిన బాధితుల్లో ఆరుగురిని కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. వారిలో ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఫార్మా, ఇతర పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా దుర్ఘటనల్లో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను ముందుగా కేజీహెచ్‌కు తీసుకొస్తున్నారు. వారి పరిస్థితి విషమంగా మారినా, కాలిన గాయాలు ఎక్కువగా ఉన్నా ప్రైవేటు ఆసుపత్రులకు తరలించాల్సి వస్తుంది. రసాయన, జీవసంబంధ, రేడియోలాజికల్, న్యూక్లియర్ (అణు) సంబంధిత ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు మెరుగైన వైద్యమందించేందుకు స్థానికంగా ప్రత్యేక సదుపాయాలు లేవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో విశాఖలో సెకండరీ లెవెల్ కెమికల్ బయోలాజికల్ రేడియోలాజికల్ న్యూక్లియర్ (సీబీఆర్ఎన్) మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని భావించారు. పెరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా కేంద్రం ఏర్పాటును వేగవంతం చేయాలని వైద్య నిపుణులు కోరుతున్నారు.

గతేడాది వైద్యులకు శిక్షణ: సీబీఆర్ఎన్ సెంటర్ కోసం విమ్స్‌లో



రెండెకరాల స్థలం కేటాయించారు. 2024 ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు, నిపుణులు స్థలాన్ని పరిశీలించారు. గతేడాది అక్టోబరులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదిరింది. విమ్స్‌లో పనిచేస్తున్న ముగ్గురు వైద్యులకు తమిళనాడులోని కుడంకుళం అణువిద్యుత్తు ప్లాంటులో శిక్షణ అందజేశారు. తర్వాత ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. కేంద్రం పూర్తయ్యాక అందులో పనిచేసేందుకు పూర్తి సిబ్బందిని కేంద్ర ప్రభుత్వమే నియమిస్తుంది. చికిత్సకు వినియోగించే ప్రత్యేక సామగ్రి, పరికరాలు కూడా కేటాయిస్తుంది.

**ఏర్పాటైతే ప్రయోజనాలు..**

కేంద్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హెల్త్ సెక్టర్ డిజాస్టర్ ప్రిపేర్డ్‌నెస్ అండ్ రెస్పాన్స్, ఆయుష్మాన్ భారత్ పథకాల కింద ఈ కేంద్రం నిర్మించాలని భావించారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) తదితర సంస్థల సహకారంతో దీన్ని నిర్మించనున్నారు. రియాక్టర్ పేలుళ్లు, గ్యాస్ లీకేజీలు, రసాయనాల విస్ఫోటనాలు జరిగినప్పుడు తీవ్రంగా గాయపడిన వారికి అత్యాధునిక వైద్యం అందించేలా రెండంతస్తుల్లో తీర్చిదిద్దుతారు. ఎల్జీ పాలిమర్స్‌లో స్టైరీన్ గ్యాస్ లీకేజీ, అచ్యుతాపురం, పరవాడ సెజ్‌లోని ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు, ఇతర పేలుళ్లు తరహా ఘటన లు జరిగితే బాధితులకు ఒకేచోట మెరుగైన వైద్యం అందించొచ్చు. క్షతగాత్రులను ప్రైవేటు ఆసుపత్రులకు తరలించాల్సిన అవసరం లేకుండా తక్షణ, ప్రత్యేకమైన వైద్యం అందించేందుకు వీలుంటుంది. బాధితులకు అత్యవసర చికిత్స చేయడానికి 20 పడకల ఐసీయూ, ఐసోలేషన్ పడకలు తదితర ప్రత్యేక సదుపాయాలు అందుబాటులో ఉంటాయి.

# అమ్మలకు అండగా.. వసతులు మెండుగా

నర్సీపట్నం : నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రి ప్రసూతి విభాగంలో ఒకప్పుడు నెలకు 400 నుంచి 500 వరకు ప్రసవాలు జరిగేవి. రాష్ట్రంలో అత్యధిక ప్రసవాలు జరిగే ఆసుపత్రుల్లో ముందు వరసలో ఉండి అవార్డులు అందుకున్న ఘనత ఈ ఆసుపత్రిది. వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఈ ప్రతిష్ఠ మసకబారింది. నెలకు 300 ప్రసవాలు జరగడం గగనమైపోతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా ఉన్న స్థానిక ఎమ్మెల్యే, సభాపతి అయ్యన్నపాత్రుడు ప్రసూతి సేవల మెరుగుకు చర్యలు చేపట్టారు. గడిచిన నాలుగు నెలల్లో ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి వెయ్యి సాధారణ ప్రసవాలు, 300 శస్త్రచికిత్సలు చేశారు. గతంతో పోలిస్తే శస్త్రచికిత్సలు 30 శాతం తగ్గాయి. శస్త్రచికిత్స అవసరమైతే సీనియరు వైద్యులను సంప్రదించి ఆ తర్వాతే నిర్ణయం తీసుకుంటున్నారు. గతంలో ఇక్కడి నుంచి అనకాపల్లి జిల్లా ఆసుపత్రికి కొన్ని కేసులను పంపేవారు. ఇప్పుడిలా తరలించడం లేదు. అర్ధరాత్రి అయినా అప్పటికప్పుడు వైద్యులు వచ్చి అవసరమైతే శస్త్రచికిత్సలూ చేస్తున్నారు. గత ఏడాది డిసెంబరు నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు ఆసుపత్రి నుంచి ఒక్క గర్భిణీనీ బయటకు పంపలేదు. వైద్యుల సేవలు మెరుగుపడ్డాయి. శస్త్రచికిత్సలు జరిగిన బాలింతలను వైద్యులు రోజుకు రెండు మూడుసార్లు పలకరిస్తున్నారు. ఆసుపత్రిలోనే అవసరమైన ఫొటోథెరపీ యూనిట్లు అందుబాటులో ఉ



న్నాయి. కామెర్లు ఉన్న పిల్లలను గతంలో ప్రైవేటు ఆసుపత్రులకు పంపేవారు. కుటుంబ సభ్యులు అక్కడ రూ.3 వేల వరకు ఖర్చు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఇక్కడే ఉంచుతున్నారు. బరువు తక్కువ పిల్లల కోసం ఎస్ఎన్‌సీయూలో వార్మర్లు ఉన్నాయి. పీజీ వైద్య విద్యార్థులతో కలిసి ముగ్గురు పిల్లల వైద్యులు, నలుగురు ప్రసూతి వైద్య నిపుణులు ఆసుపత్రిలో ఉన్నారు. మందులు కొరత తలెత్తకుండా అవసరమైతే ఆసుపత్రి నిధులతోనే బయటి నుంచి కొనుగోలు చేసి ఇస్తున్నారు.

ఓపీ విభాగంలో సీనియర్ గైనకాలజిస్టు, ఆసుపత్రి సూపరింటెండెంట్ సుధాశారద రోగులను పరీక్షిస్తున్నారు. తాజాగా ఓపీ విభాగంలో ఏసీ సదుపాయం కల్పించారు. ప్రసూతి విభాగం వద్ద శుద్ధజలం అందుబాటులో ఉంచారు. డాక్టర్ సుధాశారద మాట్లాడుతూ.. 'నాలుగు నెలలుగా వైద్యులందరి సమష్టి కృషితో ప్రసవాల సంఖ్య పది నుంచి 40 వరకు పెరిగాయి. నెలకు నాలుగైదు వందల ప్రసవాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ప్రస్తుతం 150 పడకలు ఉన్న ఆసుపత్రిని 200 పడకలకు పెంచేందుకు ప్రతిపాదనలున్నాయి. త్వరలోనే ప్రభుత్వం నుంచి నిర్ణయం వెలువడే అవకాశముంద'న్నారు.

# హెచ్చెల్సీ మరమ్మతులపై నీలినీడలు

అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లా వరప్రదాయినిగా భావించే తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువ (టీబీ హెచ్చెల్సీ) నిర్వహణ, పాలన వ్యవహారంలో నీలినీడలు కమ్ముకున్నాయి. కీలకమైన ఎస్ఈ పోస్టుపై సందిగ్ధం నెలకొంది. రెండు వారాలు గడిచినా రెగ్యులర్ అధికారిని నియమించలేదు. కనీసం ఇన్ఛార్జి బాధ్యతలు ఎవరికీ అప్పగించ లేదు. ఎస్ఈ రాజశేఖర్ గత నెలలో ఉద్యోగ విరమణ చేశారు. అదే రోజే అర్హత కల్గిన వారికి ఇన్ఛార్జి బాధ్యతలు అప్పగించడం ఆనవాయితీగా వస్తోంది. ఈదఫా భిన్నమైన పరిస్థితి తలెత్తింది.

**రూ.33.89 కోట్ల పనులపై ప్రభావం**

గత వైకాపా పాలనలో హెచ్చెల్సీని పూర్తిగా నిర్వీర్యం చేశారు. మరమ్మతు, నిర్వహణకు పైసా ఇవ్వలేదు. ప్రధాన కాలువ శిథిలావస్థలో ఉంది. 2వేల క్యూసెక్కుల నీటిని తీసుకోలేని దయనీయ దుస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం రాగానే హెచ్చెల్సీ ప్రాజెక్టుకు అత్యధిక ప్రాధాన్యం లభించింది. అత్యవసరంగా చేపట్టాల్సిన వంతెన, కాలువ గట్ల బలోపేతం, ఇతర మరమ్మతుల కోసం ఒకేసారి రూ.38 కోట్లు




ఏకంగా బడ్జెట్లో కేటాయించడం విశేషం. ఇందులో రూ.33.89కోట్ల విలువైన పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. జూన్ ఆఖరు నాటికి నిర్దేశిత 11 పనులు పూర్తి చేయాలి. కీలకమైన ఎస్ఈ లేకపోవడంతో ఆ పనులపై ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. మరోవైపు ఉప ఎస్ఈ సైతం సెలవులో ఉన్నారు. లోకలైజేషన్ ఈఈ ఈనెలాఖరులో పదవీ విరమణ చేయనున్నారు.

**సాధారణ బదిలీలు ఎలా?**

జూన్ నుంచి నీటి సీజన్ మొదలు కానుంది. ఈలోపే టీబీ బోర్డు ఎస్ఈల స్థాయి సమీక్ష జరగనుంది. హెచ్చెల్సీ ఎస్ఈనే హాజరు కావాల్సి ఉంటుంది. మరో వైపు.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సాధారణ బదిలీలకు అనుమతి ఇచ్చింది. జూన్ 2వ తేదీలోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలి. హెచ్చెల్సీ ప్రాజెక్టులో అటెండర్ స్థాయి నుంచి కార్యాలయ పర్యవేక్షకుడి దాకా ఎస్ఈనే బదిలీ చేయాల్సి ఉంటుంది. శుక్రవారం నుంచి బదిలీల ప్రక్రియ ఆరంభమైంది.

# బోధనేతర సిబ్బంది బదిలీలు జరిగేనా ?

చిత్తూరు : ఉమ్మడి జిల్లా విద్యాశాఖలో బోధనేతర సిబ్బంది స్థాన చలనానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రక్రియ జూన్ 2లోగా పూర్తి చేయాల్సి ఉంది. ఒకేచోట రెండేళ్లు సర్వీసు పూర్తైన వారు అభ్యర్థన కింద బదిలీ చేసుకోవచ్చు. ఐదేళ్లు ఒకేచోట సర్వీస్ పూర్తైన వారు తప్పనిసరిగా బదిలీ కావాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇలా బదిలీలు జరిగేనా అనేది ప్రశ్నార్థకం. ఉమ్మడి జిల్లాలో 158 మంది కార్యాలయ సహాయకుల నుంచి పర్యవేక్షకుల వరకు ఉన్నారు. వారిలో కార్యాలయ సహాయకులు, దిగువ, ఎగువ శ్రేణి సహాయకులను చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల పరిధిలో చిత్తూరు డీఈవో వరలక్ష్మి బదిలీ చేయనున్నారు. పర్యవేక్షకులను ఆర్జేడీ



జోనల్ స్థాయిలో బదిలీ చేస్తారు. ఆ పైస్థాయి అధికారులను రాష్ట్ర విద్యాశాఖ బదిలీ చేయనుంది. జిల్లాల విభజనకు ముందు డీఈవో కార్యాలయంలో ఉన్న అటెండర్లు, జూనియర్ అసిస్టెంట్లను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు బదిలీ చేసేవారు. సీనియర్ అసిస్టెంట్లను చిత్తూరు పీసీఆర్, నగరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు, డైట్ కళాశాలలకు బదిలీ చేయాలి. కార్వేటినగరం డైట్ కళాశాలలో ఇద్దరు టైపిస్టులు, తొమ్మిది మంది జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్, పర్యవేక్షకులు ఒకరు చొప్పున ఉన్నారు. దీంతో చాలావరకు ఆ శ్రేణి ఉద్యోగులు చిత్తూరు విద్యాశాఖ కార్యాలయంలోనే కొన్నేళ్లుగా పాతుకుపోయారు. వారిని ఏ డీఈవో ఉన్నా బదిలీ చేయకపోవడం గమనార్హం. ఈసారైనా పాతుకు పోయిన వారికి స్థాన చలనం కలిగేనా అనేది వేచిచూడాలి.

# ఒడా.. ఎవరో పీఠం పైన!

ఒంగోలు : కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ చేపడుతోంది. దీంతో గుర్తింపు కలిగిన పదవుల కోసం ఆశావహులు కళ్లలో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు. స్థానిక నాయకుల నుంచి ప్రతిపాదనలు తీసుకుంటూనే.. అన్ని కోణాల్లో పరిశీలించి వడపోతలు చేపట్టి.. ఆ తర్వాత పార్టీ అధినాయకత్వం పదవులు కేటాయిస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు అందరి దృష్టీ ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(ఒడా)పై కేంద్రీకృతమైంది.

**జిల్లాకు పెరిగిన ప్రాతినిధ్యం:** నామినేటెడ్ పదవుల భర్తీలో కూటమి ప్రభుత్వం జిల్లాకు పెద్దపీట వేసింది. భాజపా కోటాలో ఒంగోలుకు చెందిన లంకా దినకర్కు కేబినేట్ ర్యాంకు పదవైన రాష్ట్ర 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ స్థానాన్ని అందించింది. రాష్ట్ర మారిటైమ్ బోర్డు ఛైర్మన్గా దామచర్ల సత్య, రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్గా నూకసాని బాలాజీలను నియమించింది. తాజా నియామకాల్లో రాష్ట్ర లైవ్ స్టాక్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్గా జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ నియమితులయ్యారు. గతంతో పోలిస్తే జిల్లాకు రాష్ట్రస్థాయిలో మంచి పదవులే దక్కాయి. తాజాగా జిల్లా స్థాయిలోనూ కీలక పదవుల భర్తీపై తెదేపా అధినాయకత్వం దృష్టి పెట్టింది. ఆ క్రమంలోనే పీడీసీసీ బ్యాంకు అధ్యక్షుడిగా డాక్టర్ కామేపల్లి సీతరామయ్య, డీసీఎంఎస్ ఛైర్మన్గా కనిగిరికి చెందిన శ్యామల కాశిరెడ్డి నియమితులయ్యారు. **సామాజిక సమీకరణలు కీలకం:** జిల్లాస్థాయిలో ఇప్పుడు అందరి దృష్టీ ఒడాపై కేంద్రీకృతమైంది. ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ ఛైర్మన్ల తర్వాత జిల్లాల విస్తృతమైన అధికార పరిధి, అర్థిక వనరులు ఉన్న కార్పొరేషన్ ఇది. దీంతో ఈ పదవి ఎవరికి దక్కనుందనే అంశంపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఈ పదవిని దక్కించుకునేందుకు పలువురు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. సామాజిక సమీకరణలు కీలకంగా మారడంతో పదవులు దక్కని కొన్ని వర్గాలకు చెందిన నేతలు ఆశలు పెంచుకున్నారు. ఒడా పరిధిలోకి జిల్లా మొత్తం వస్తుండటంతో అన్ని నియోజకవర్గాలకు చెందినవారు తమస్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నారు. తెదేపా అధిష్ఠానం ఈ పదవిని ఎవరికి కేటాయిస్తుందనే విషయమై చర్చోపచర్చలు సాగుతున్నాయి.

# ఆధ్యాత్మిక కేంద్రంలో స్వచ్ఛతకు తూట్లు



పుట్టపర్తి : కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛాంధ్ర..స్వర్ణాంధ్ర'కు పాలకవర్గం, యంత్రాంగం తూట్లు పొడుస్తోంది. ఆధ్యాత్మిక కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణను గాలికి వదిలేశారు. వీధుల్లో ఎక్కడ చూసినా చెత్తచెదారం దర్శనమిస్తోంది. జిల్లా కేంద్రమైన పుట్టపర్తికి దేశ విదేశాల నుంచి భక్తులు, పర్యాటకులు వస్తుంటారు. నిత్యం పరిశుభ్రంగా ఉండాలని కలెక్టర్ చేతన్, స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పలుమార్లు ఆదేశించినా ఫలితం లేదు. చెత్తసేకరణ ప్రక్రియ, తరలింపు అస్తవ్యస్తంగా మారింది. మరోవైపు చెత్త తరలించే రిక్షాలు అందుబాటులో లేవు. వ్యర్థాలను ఎలా తరలించాలని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. వీధుల్లో నుంచి పోగు చేసి.. ఒక చోట చేర్చడానికి కార్మికులు అష్టకష్టాలు పడుతున్నారు.

**పలుమార్లు కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావన**

శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాలకు సిద్ధం కావాలని.. ఇందుకు తగిన ప్రణాళికలు తయారు చేసుకుని ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే పలు కౌన్సిల్ సమావేశాల్లో సూచించినా కార్యరూపం దాల్చలేదు. పది రోజుల వ్యవధిలో మూలపడిన రిక్షాలు, కంపాక్టర్స్ను మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించి మూడు నెలలు అవుతున్నా పరిస్థితిలో ఎలాంటి మార్పు రాకపోవడం గమనార్హం.

పురపాలక సంఘానికి సంబంధించి పుష్కార్ట్స్ 20 ఉండగా...కేవలం 5 మాత్రమే పనిచేస్తున్నాయి. రిక్షాలు 18కిగాను మూడు వినియోగంలో ఉన్నాయి. చెత్తను తరలించే రెండు కంపాక్టర్ వాహనాలు రెండు ఏడాదిగా మూలకు చేరడం గమనార్హం.

మరమ్మతులు చేయించాల్సిన అధికారులు.. వాటిని పట్టించుకున్న పాపాన పోలేదు. అద్దె ట్రాక్టర్లతో చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాల్సిన దుస్థితి వచ్చింది. గత వైకాపా పాలకవర్గం అభివృద్ధిని గాలికి వదిలేసింది.

**తగిన చర్యలు తీసుకుంటున్నాం**

ప్రహ్లాద, మున్సిపల్ కమిషనర్, పుట్టపర్తి

పురపాలిక పరిధిలో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. మరమ్మతులకు గురైన పుష్కార్ట్స్, కంపాక్టర్స్ను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు గుత్తేదారులను ఆహ్వానించాం. కొత్త పుష్కార్ట్స్ కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నాం.

**పురపాలికలో ఇలా..**

వార్డులు : 20

జనాభా : 38 వేలు

రోజూ సందర్శించే భక్తులు, పర్యాటకులు: 5వేల మంది

శానిటరీ డివిజన్లు: 02

పారిశుద్ధ్య కార్మికులు : 58

రోజూ ఉత్పత్తి అయ్యే చెత్త: 8 టన్నులు

# నాలుగు గ్రేడ్లుగా పంచాయతీల విభజన!



పుట్టపర్తి : గ్రామ పంచాయతీలను నాలుగు గ్రేడ్లుగా విభజించడానికి కసరత్తు జరుగుతోంది. పంచాయతీరాజ్ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తొలుత గ్రామ పంచాయతీలను గ్రేడ్లుగా విభజించే ప్రక్రియ ఆరంభమైంది. రెండు మూడు రోజుల్లో విభజన ప్రక్రియ పూర్తవుతుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. స్పెషల్గ్రేడ్, గ్రేడ్-1, 2, 3లుగా విభజించనున్నారు.

**జనాభా, ఆదాయం మేరకు..**

ప్రస్తుతం రెండు మూడు పంచాయతీలను క్లస్టరుగా ఏర్పాటు చేసి ఒక కార్యదర్శిని నియమించారు. జనాభా, ఆదాయాన్ని బట్టి విభజన చేస్తున్నారు. గ్రేడ్ల విభజన పూర్తయితే ప్రతి పంచాయతీకి కార్యదర్శిని నియమించాలన్న ప్రతిపాదన ఉంది. ప్రస్తుతం మేజరు, మైనరు పంచాయతీల వ్యవస్థ నడుస్తోంది. జనాభా, ఆదాయాలు పెరిగినా ఎలాంటి మార్పు తీసుకురాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత స్థానిక సంస్థలకు మరిన్ని అధికారాలు కల్పించాలని కృతనిశ్చయంతో ఉంది.

పంచాయతీల ఆదాయం రూ.కోటికి పైగా లేదంటే జనాభా 10 వేలకు మించిన వాటిని స్పెషల్ గ్రేడ్గా గుర్తిస్తారు. ఇరు జిల్లాల్లో ఇలాంటి పంచాయతీలు దాదాపు 20 వరకు ఉన్నట్లు అంచనా. గిరిజన ప్రాంతాల్లో జనాభా 5వేలు దాటితే స్పెషల్ గ్రేడ్గా గుర్తించనున్నారు. జనాభా 4 వేల నుంచి 10వేల లోపు లేదంటే ఆదాయం రూ.50 లక్షల నుంచి కోటి వరకు ఉంటే గ్రేడ్-1 పంచాయతీగా గుర్తిస్తారు. ఇలాంటివి 200లోపు ఉంటాయి. గిరిజన ప్రాంతాల్లో జనాభా 3 వేల నుంచి 5వేల లోపు ఉంటే గ్రేడ్-1 జాబితాలో ఉంటుంది.

గ్రేడ్-2, గ్రేడ్-3 పంచాయతీలు ఆదాయంతో సంబంధం లేకుండా జనాభాను ప్రాతిపదికగా తీసుకుని విభజిస్తారు. 1500 నుంచి 3వేల లోపు ఉన్నవి గ్రేడ్-2, 1500లోపు ఉన్న పంచాయతీలు గ్రేడ్-3లో ఉంటాయి. వివరాలన్నీ ఎంపీడీలు, డీఎల్పీఓలు సేకరించి వర్గీకరిస్తున్నారు. స్పెషల్గ్రేడ్ పంచాయతీలకు ఈఓఆర్డీలను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రేడ్-4 నుంచి 6 వరకు ఉన్న కార్యదర్శులను గ్రేడ్-2 లేదా గ్రేడ్-3లో విలీనం చేయనున్నారు.

**నివేదికను కలెక్టర్కు పంపిస్తాం**

నాగరాజునాయుడు, డీపీఓ

వర్గీకరణ ప్రక్రియ దాదాపు పూర్తయింది. త్వరలో కలెక్టర్కు నివేదిస్తున్నాం. ఆదాయం, జనాభా ప్రాతిపదికన పంచాయతీలను వర్గీకరించాం. సవరణలు చేసిన తర్వాత జాబితా ప్రకటిస్తాం. స్పెషల్ గ్రేడ్ పంచాయతీలకు ఈఓఆర్డీలను నియమించే అవకాశం ఉంది. దీనివల్ల పోస్టుల సంఖ్య పెరుగుతుంది.

# ఆయకట్టు.. చెప్పకుండానే కనికట్టు!



చిత్తూరు: ఎక్కడైనా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం అన్నదాతల కడగండ్లు తీర్చేందుకు.. కరవు నేలను సస్యశ్యామలంగా మార్చేందుకు చేపడతారు. వైకాపా హయాంలో మాత్రం ఇందుకు భిన్నంగా పుంగనూరు నియోజకవర్గంలో రెండు జలాశయాల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు. అనుకున్నదే తడవుగా ఆఘమేఘాలపై పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో అభ్యంతరం వ్యక్తం చేసిన రైతులపై కేసులు నమోదు చేశారు. బతుకుదెరువు కోల్పోతున్నందున పరిహారం ఇవ్వాలని కోరిన కర్షకుల వినతులను పరిగణనలోకి తీసుకోలేదు. అప్పట్లో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ పనులపై కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. అక్కడి నుంచి వచ్చే సిఫార్సులకు అనుగుణంగా బాధ్యులపై సర్కార్ చర్యలు తీసుకుంటోంది.

ముఖ్యమంత్రిగా జగన్ ఉన్న సమయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పుంగనూరు నియోజకవర్గంలో రెండు, తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఒక రిజర్వాయర్ నిర్మించేందుకు 2020 సెప్టెంబరు 2న రాష్ట్ర ప్రభుత్వం పాలనా అనుమతులు ఇచ్చింది. పుంగనూరు మండలం నేతిగుట్లపల్లె, సోమల మండలం ఆవులపల్లెలో జలాశయాల నిర్మాణానికి ఆమోదం లభించింది. ఈ పనులను పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సంస్థ పీఎల్ఆర్ ప్రాజెక్టు చేపట్టింది. ప్రాజెక్టులు కట్టే ముందు శాస్త్రీయంగా అధ్యయనం చేయాలి. ఎంత వ్యయమవుతుంది? నిర్మాణంతో ఏ మేరకు లబ్ధి జరుగుతుంది? అని ప్రాథమికంగా సర్వే చేస్తారు. కట్టే ఖర్చు కన్నా ఎక్కువ లబ్ధి ఉంటేనే ప్రభుత్వం పాలనా అనుమతులు ఇస్తుంది. మూడు జలాశయాల నిర్మాణంలో మాత్రం దీనిపై కాకి లెక్కలు వేసి సర్కార్కు నివేదిక పంపించారని సమాచారం. దీనికోసం జలవనరుల శాఖ అధికారులపై 'పెద్దాయన' ఒత్తిడి చేశారని అప్పట్లో ప్రచారం జరిగింది. పాలనా అనుమతుల మంజూరుకు ముందే ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించవచ్చు? ఎంతమందికి తాగునీరు ఇవ్వవచ్చు? అని తేల్చాలి. అంచనా వ్యయం తయారు చేసిన తర్వాత 40 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, కొత్తగా 70 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు.

**పరిహారం ఇవ్వకుండానే..**

రైతుల భూములు తీసుకుంటే సాగునీటి సదుపాయం ఉన్న వాటికి ఎకరాకు ఎంత పరిహారం ఇవ్వాలి? వర్షాధార నేలలకు ఎంత చెల్లించాలో కూడా నోటిఫికేషన్ ప్రచురిస్తారు. అన్నదాతల అభ్యంతరాలు పరిష్కరించిన తర్వాత, పరిహారం వారి ఖాతాల్లో జమ చేసిన తర్వాతే నిర్మాణాలు ముందుకు సాగుతాయి. ఇక్కడ అలా జరగలేదు.

# దేవాదాయ భూముల స్వాధీనానికి సన్నద్ధం

అనకాపల్లి : ఆక్రమణలకు గురైన దేవాదాయ భూములను స్వాధీనం చేసుకునేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. కాకినాడలోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్తో కలిసి ఇటీవల దేవరాపల్లి మండలం మారేపల్లిలో ఆక్రమణకు గురైన భూములను పరిశీలించారు. పలు ప్రాంతాల్లో ఆక్రమణదారులకు నోటీసులు ఇస్తున్నారు. చాలాచోట్ల అసలు భూములు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి. వీటిపై రెవెన్యూ అధికారుల సహకారంతో భూములను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో 721 దేవాలయాలు ఉన్నాయి. వీటికి 287 గ్రామాల్లో 5,746 ఎకరాల భూమి ఉంది. ఇందులో 1,350 ఎకరాలు కౌలుకు ఇచ్చారు. మిగిలిన దానిలో 3,008 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. వీటిలో కొన్ని న్యాయస్థానాల్లో ఉన్నాయి. దేవరాపల్లి మండలం మారేపల్లిలోని రామాలయానికి 40 ఎకరాల భూమి ఉంది. ఇది అన్యాక్రాంతమైంది. వి.మాడుగుల రాధాస్వామి దేవాలయానికి 1860 సంవత్సరంలోనే 113 ఎకరాలు ఉంది. అసలు ఆ భూమి ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి. దేవరాపల్లిలో ఉమామహేశ్వరి అమ్మవారికి 1.40 ఎకరాలు ఉంది. ఇందులో 40 సెంట్లలో తిరుమల, తిరుపతి దేవస్థానం కల్యాణ మండపం



నిర్మించారు. మిగిలిన ఎకరా ఆక్రమణకు గురైంది.

అనకాపల్లి దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి దేవాలయానికి చెందిన విలువైన స్థలాలు, భూములు అన్యాక్రాంతమయ్యాయి. రహదారిని ఆనుకుని ఉన్న 60 సెంట్లు విలువైన స్థలం ఆక్రమణకు గురైంది. వేదుల వారి కుటుంబీకులు దేవస్థానం దూపదీప నైవేద్యాల నిమిత్తం ఈ భూమిని దానంగా ఇచ్చారు. దీన్ని కొందరు ఆక్రమించారు. ఒకరు దేవాదాయ భూమినే బ్యాంకులో తనఖాపెట్టి రుణం పొందారు. బాకీ చెల్లించక పోవడంతో బ్యాంకు అధికారులు ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి గతంలో యత్నించినా దేవస్థానం పాలకవర్గం అడ్డుకుంది. ఈ స్థలం విలువ ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం రూ.15 కోట్లు ఉంటుందని అంచనా. వేల్పులవీధి కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 578 గజాల స్థలం ఆక్రమణకు గురైంది.

నిషేధిత జాబితాలో భూముల వివరాలు... దేవాదాయశాఖకు చెందిన భూముల వివరాలు రిజిస్ట్రార్లకు ఇచ్చి నిషేధిత భూముల జాబితాలో చేర్పించాం. ఎన్ని తరాల నుంచి ఉన్నా వారి సొంతం కాదు. దేవాదాయ శాఖ చట్టం చాలా పక్కాగా ఉంటుంది. ఆక్రమణ భూములు అన్నింటినీ స్వాధీనం చేసుకుంటాం. దేవాదాయశాఖ భూమి అని తెలియక చాలా మంది కొనుగోలు చేస్తున్నారు. ఒక్క సెంటు భూమిని కూడా వదిలేది లేదు.- సుధారాణి, దేవాదాయ శాఖ జిల్లా అధికారిణి

# అల్లుకున్న అక్రమాల తీగ

నంద్యాల : విద్యుత్తుశాఖలో కొందరు సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. పైసలు ఇవ్వందే ఏ పనీ చేయడం లేదు. లంచం ఇవ్వనిదే లైను చూడటం లేదు. మూడేళ్ల నుంచి విద్యుత్తు సామగ్రి సరఫరా సరిగా జరగడం లేదు. కండక్టర్లు, కేబుల్ సరఫరాలో జాప్యం చోటుచేసుకుంటోంది. ఇది కొంతమంది అధికారులు, సిబ్బందికి వరంగా మారింది. గృహ, వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల కోసం, నియంత్రికల ఏర్పాటు కోసం తిరుగుతున్న వినియోగదారుల నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నారు.

**షిఫ్టింగ్ పేరుతో దోపిడీ**

హెచ్టీ, ఎల్టీ, 11 కేవీ విద్యుత్తు లైన్ల మార్పిడి పేరుతో కొంతమంది అధికారులు పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారు. విద్యుత్తు తీగలు మార్పిడి కోసం ప్రభుత్వానికి చెల్లించే మొత్తం ఒకటైతే అందుకు రెట్టింపు స్థాయిలో వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారు. ప్రత్యేకించి శివారు ప్రాంతాల్లో వెంచర్లు వేసే స్థిరాస్తి వ్యాపారులు లేఅవుట్ అడ్డుగా ఉన్న స్తంభాలు, తీగలను మార్చాలని కోరుతున్నారు. అలాంటి వారి నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**ముందస్తు ఒప్పందం చేసుకుంటేనే..**

రైతులు, వినియోగదారులకు కనెక్షన్లు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అదే అధికారులతో ముందస్తు ఒప్పందం ఉంటే మాత్రం సకాలంలో ఇస్తున్నారు. వ్యవసాయ సర్వీసులు, గృహ, వాణిజ్య సర్వీసులు ఇచ్చేందుకు విద్యుత్తు శాఖ ఒక ప్రణాళిక అమలు చేస్తుంటే.. అధికారులు మరో పద్ధతిలో వెళ్తున్నారు. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు సంబంధించి కర్నూలు స్టోర్లో నియంత్రికలు, సామగ్రి, కండక్టరు, కేబుల్ వంటివి సిద్ధంగా ఉన్నా వెయిటింగ్ లిస్టు పేరుతో రైతులకు కనెక్షన్లు సకాలంలో ఇవ్వడం లేదు.

**పట్టుపడినా మారరంతే..**

రుద్రవరం మండలం చిన్నకంబలూరుకు చెందిన రైతులు లింగమూర్తి, రామకృష్ణమాచారి తమ పొలంలో విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఏడాదైనా రాకపోవడంతో అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. చివరకు విద్యుత్తు శాఖ డిప్యూటీ ఈఈ రవికాంత్చౌదరి రూ.30 వేలు డిమాండ్ చేశారు. అంతమొత్తం లంచం ఇస్తామని ఒప్పుకొన్న రైతుల నుంచి ఆ డబ్బును మీటర్ రీడర్ ప్రతాప్ తీసుకుంటుండగా అనిశా అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో సూత్రధారి రవికాంత్చౌదరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**ఏళ్లుగా ఒకేచోట పాతుకుపోయి..**

తాజాగా అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డ రవికాంత్చౌదరి సుదీర్ఘకాలంగా ఆళ్లగడ్డలోనే విధులు నిర్వహిస్తున్నారు. మధ్యలో కొంతకాలం నంద్యాలలో పనిచేసినా మళ్లీ అక్కడికే వెళ్లారు. ఇద్దరు సబ్ ఇంజినీర్లు కూడా ఇదే డివిజన్లో చాలా ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. స్థానికంగా ఉన్న పరిచయాలతో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. 16 ఏళ్లుగా సబ్ ఇంజినీరుగా పనిచేస్తున్న అధికారిని ఇటీవల కర్నూలు జిల్లాకు బదిలీ చేయగా డిప్యుటేషన్పై మళ్లీ ఇదే స్థానానికి రావడం గమనార్హం.

**ప్రతి పనికీ పైసావసూల్**

వ్యవసాయ విద్యుత్తు నియంత్రిక కావాలంటే స్తంభాల సంఖ్యను బట్టి లంచం ఇవ్వాల్సి వస్తోంది. ఒక్కో స్తంభానికి రూ.10 వేలు చొప్పున రైతులు ముట్టజెప్పాల్సిందే.

గృహ విద్యుత్తు కనెక్షన్కైతే దూరం పెరిగేకొద్దీ మూమూళ్ల మొత్తం పెరుగుతుంది.

తీగల మార్పిడికి సంబంధించి హెచ్టీకి ఒక ధర, ఎల్టీ లైనుకు ఒక ధర చొప్పున వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారు.

కొత్త మీటరు ఇవ్వాలంటే లైన్మ్యాన్ నుంచి ఏఈ వరకు అందరికీ ఎంతో కొంత ముట్టజెప్పాల్సిందే.

చురకలు



## ఎయిర్ ఇండియా ఫ్లైట్‌లో గుబులు గుబులుగా నటి

అహ్మదాబాద్ విమాన ప్రమాదం జరిగిన నాలుగు రోజుల తర్వాత బాలీవుడ్ నటి రవీనా టాండన్ షేర్ చేసిన సోషల్ మీడియా పోస్ట్ హృదయాలను బరువెక్కేలా చేసింది. "ఎప్పటికీ మర్చిపోలేని గాయమది.." అంటూ ఎమోషనల్ అయిన రవీనా టాండన్ ఎయిర్ ఇండియా విమానంలో ప్రయాణిస్తూ ఈ పోస్ట్ ని షేర్ చేసారు. రవీనా విమానంలో విండో సీట్ లో కూచుని ప్రయాణిస్తున్నారని తను షేర్ చేసిన ఫోటోగ్రాఫ్ చెబుతోంది. 'కొత్త ప్రారంభాలు..' అంటూ టేకాఫ్ కి సిద్ధంగా ఉన్న ఎయిర్ ఇండియా విమానానికి బాసటగా ఈ పోస్ట్ నిలిచింది. ఈ పోస్ట్ పూర్తి సారాంశం ఇలా ఉంది. "కొత్త ప్రారంభాలు... అన్ని అసమానతలకు వ్యతిరేకంగా లేచి మళ్ళీ ఎగరడానికి... తిరిగి ప్రారంభించి, మరింత బలం వైపు కొత్త సంకల్పం" అని కవితాత్మకంగా రాశారు. ఒక ఘోర ప్రమాదం జరిగిన తర్వాత ప్రయాణీకుల మనోభావాలు ఎలా ఉంటాయో తన పోస్ట్ ప్రతిధ్వనించింది. విమాన వాతావరణం ఎలా ఉందో తన పోస్ట్ వెల్లడించింది. గంభీరమైన వాతావరణం ... స్వాగతించే సిబ్బంది చిరునవ్వుల స్థానంలో విచారం నిండి ఉందని, నిశ్శబ్ద ప్రయాణీకులు..సిబ్బంది చెప్పని సంతాపం కనిపిస్తోందని రవీనా సోషల్ మీడియాలో రాసారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు



సంతాపం తెలియజేస్తూ రవీనా తన నోట్‌ను ముగించారు. "ఎప్పటికీ నయం కాని గాయం. ఎల్లప్పుడూ ఎయిర్ ఇండియా గాడ్ స్పీడ్. భయాన్ని అధిగమించి మళ్ళీ బలంగా ఉండాలనే సంకల్పం కనిపిస్తోంద" ని రవీనా రాసారు. జూన్ 12న అహ్మదాబాద్ నుండి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఎయిర్ ఇండియా విమానం %ూ×%171 ఘోర ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో 260 మంది పైగా మరణించారు. 241 మంది విమాన ప్రయాణీకులతో పాటు, హాస్టల్ భవంతిలోని 20 మంది విద్యార్థులు మరణించారని కథనాలొచ్చాయి. ప్రయాణీకుల్లో భారతీయులతో పాటు, లండన్, పోర్చ్ గీస్, కెనడా జాతీయులు ఉన్నారు. ఈ ఘటన జరిగిన కొన్ని రోజుల తర్వాత రవీనా టాండన్ ఎయిర్ ఇండియా ఫ్లైట్ నుంచి భావోద్వేగ పోస్ట్ ను షేర్ చేసారు. ప్రమాదాలు ప్రయాణాలను ఆపలేవు! అనే సందేశం కూడా తన పోస్ట్ లో ఇమిడి ఉంది. ప్రస్తుతం ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై దర్యాప్తు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. రవీనా టాండన్ హిందీ, తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలు. టాలీవుడ్ లో నందమూరి బాలకృష్ణ సరసన బంగారు బుల్లోడు అనే చిత్రంలో రవీనా కథానాయికగా నటించింది. ఇప్పుడు రవీనా కుమార్తె రాషా తడానీ కథానాయికగా బాలీవుడ్ లో అదృష్టం పరీక్షించుకుంటోంది. రాషా త్వరలోనే టాలీవుడ్ లో అడుగుపెట్టేందుకు అవకాశాలున్నాయి. బాహుబలి, సాహో సహా పలు చిత్రాలను తడానీ గ్రూప్ హిందీ బెల్ట్ లో పంపిణీ చేసిన సంగతి తెలిసిందే.

## పక్కింటి అమ్మాయిలా భగత్ సింగ్ ప్రేయసి

పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతోన్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జోరుగా జరుగుతోంది. ఈ చిత్రానికి హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ఇక మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. ఇక ఇందులో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమె క్యారెక్టర్ నెవ్వర్ బిఫోర్ అనేలా పక్కింటి అమ్మాయి తరహాలో ఆకట్టుకుంటుందని సమాచారం. అయితే జూన్ 14న శ్రీలీల పుట్టినరోజు సందర్భంగా మూవీ టీం ఓ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేసింది. ఆ పోస్టర్‌లో ఆమె ఆరెంజ్ చుడిదార్ డ్రెస్‌లో, చేతిలో కాఫీ కప్ పట్టుకుని రిలాక్స్ అవుతున్న స్టైల్‌లో కనిపించింది. ఈ లుక్ ఫ్యాన్స్‌ను చాలా ఆకట్టుకుంది. అలాగే ఈ పోస్టర్‌తో శ్రీలీల అభిమానులు ఫుల్ ఖుష్ అయ్యారు. సినిమాలో ఆమె పాత్ర ఎలా ఉంటుందా అన్న ఆసక్తి పెరిగింది. పవన్ కళ్యాణ్‌తో ఆమె కెమిస్ట్రీ



థియేటర్స్‌లో ఎలా ఉంటుంది అనే విషయంపై అందరూ ఎదురుచూస్తున్నారు. ఇక డీఎస్పీ సంగీతం, హరీష్ శంకర్ టేకింగ్ సినిమాకు బలాన్ని ఇస్తాయని టాక్. శ్రీలీల సెట్స్‌పై చాలా చురుకుగా ఉంటుందని టీం చెబుతోంది. టీం అందరితో కలిసిమెలిసి ఉంటూ, ఎప్పుడూ ఎనర్జిటిక్‌గా కనిపిస్తుందని మెచ్చుకుంటున్నారు. ఆమె పనితనంతో దర్శకుడు, నిర్మాతల ప్రశంసలు పొందిందట. ఈ బర్త్‌డే సందర్భంగా శ్రీలీలకు టీమ్ ఈ విధంగా శుభాకాంక్షలు తెలిపింది. ఇక ఈమధ్య కాలంలో కాస్త స్లో అయినప్పటికీ ఈ సినిమా శ్రీలీల కెరీర్‌కి ఒక మంచి అవకాశమని అంటున్నారు. పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ కూడా ఆమెపై ఆసక్తిగా ఉన్నారు. ఈ సినిమా విజయవంతం అయితే, శ్రీలీలకి ఫాలోయింగ్ మరింత పెరిగే ఛాన్స్ ఉంది.

సినిమా రిలీజైన తర్వాత ప్రేక్షకుల స్పందన ఎలా ఉంటుందో చూడాలి. మరోవైపు శ్రీలీల రవితేజ మాస్ జాతర సినిమాతో పాటు అఖిల్ తో లెనిన్ అనే సినిమాతో బిజీగా ఉంది. తమిళంలో కూడా రెండు సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక బాలీవుడ్ లో కూడా అవకాశాలు పెరిగే విధంగా అడుగులు వేస్తోంది. ఆశికి 3లో కార్తిక్ ఆర్యన్ కు జోడిగా నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక అమ్మడికి రానున్న రోజుల్లో ఎలాంటి అవకాశాలు అందుతాయో చూడాలి.





# వీరమల్లు.. అదే ఉత్తమం



హరిహర వీరమల్లు అనే సినిమాను ప్రకటించి ఆరేళ్లు కావస్తోంది. మొదలైనపుడు, ఆ తర్వాత టీజర్ రిలీజైనపుడు ఈ సినిమాకు మామూలు హైప్ లేదు. పవన్ కళ్యాణ్ పొటెన్షియాలిటీని సరిగ్గా వాడుకుంటున్నట్లు కనిపించిన ఈ చిత్రం.. పాన్ ఇండియా స్థాయిలో సెన్సేషన్ క్రియేట్ చేస్తుందని అనుకున్నారు. కానీ తర్వాత కరోనా సహా ఊహించిన పరిణామాలతో సినిమా బాగా ఆలస్యం అయిపోయింది. దీన్నుంచి దర్శకుడు క్రిష్ జాగర్లమూడి తప్పుకున్నాడు. నిర్మాత ఏఎం రత్నం తనయుడు జ్యోతికృష్ణ దర్శకత్వ బాధ్యతలు అందుకున్నాడు. తర్వాత కూడా షూట్ సవ్యంగా సాగలేదు. అతి కష్టం మీద గత నెలలో చిత్రీకరణ పూర్తి చేసినా.. రిలీజ్ మాత్రం కుదరడం లేదు. జూన్ 12న పక్కా అనుకుంటే.. ఆ డేట్ కూడా దాటిపోయింది. కొత్త డేట్‌ను ప్రకటించడం లేదు. రోజులు గడిచిపోతున్నాయి. సినిమాకు ఉన్న క్రేజ్ కూడా పోతోంది. క్రమంగా పవన్ ఫ్యాన్స్ సినిమా మీద ఆశలు వదులుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. జూన్ 12న సినిమా రాకపోవడానికి ప్రధానంగా రెండు కారణాలు వినిపించాయి. ఒకటి.. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి కాకపోవడం, ఇంకోటి బిజినెస్ జరక్కపోవడం. పోస్ట్ ప్రొడక్షన్ ఇంకొన్ని రోజుల్లో అవగొట్టొచ్చు. అది సమస్య కాదు. దాని మీద ఒక అంచనాతో కొత్త డేట్ ఇవ్వొచ్చు. కానీ బిజినెస్ సంగతే ఎటూ తేలట్లేదని తెలుస్తోంది. ప్రధాన సమస్య అదే అంటున్నారు. సినిమా బాగా ఆలస్యం కావడం వల్ల బడ్జెట్ తడిసిమోపెడైంది. నాన్ థియేట్రికల్ డీల్ ఆల్రెడీ పూర్తయింది. కానీ డేట్ మారడం వల్ల అందులో కోత పడుతున్నట్లు తెలుస్తోంది. దాని సంగతి పక్కన పెడితే.. థియేట్రికల్ హక్కులను భారీ రేటుకు అమ్మడం ద్వారా పెట్టుబడిని రాబట్టుకోవాలని రత్నం, దయాకర్ రెడ్డి చూస్తున్నారు. కానీ ఆ రేట్లు బయ్యర్లకు షాక్ కొడుతున్నాయి. అసలే సినిమాకు క్రేజ్ తగ్గిపోతూ వస్తోంది. ఆలస్యం, దర్శకుడు మారడం లాంటి కారణాలతో కంటెంట్ మీద నమ్మకాలూ తక్కువే. అలాంటపుడు నిర్మాత చెబుతున్న రేట్లు అస్సలు వర్కవుట్ అయ్యే పరిస్థితి లేదు. మాంచి క్రేజ్ ఉన్న 'ఓజీ'ని మించి 'వీరమల్లు'కు రేట్లు చెబుతున్నారు. ఎంత పవన్ కళ్యాణ్ సినిమా అయినా అంతంత రేట్లు పెట్టి సినిమాను కొనడం అంటే చాలా కష్టం అనుకుంటున్నారు బయ్యర్లు. తాము కోరుకున్న రేట్లు వస్తే తప్ప సినిమాను ఇవ్వొద్దని నిర్మాతలు భావిస్తున్నారు. దీంతో వ్యవహారం ఎంతకీ తెగట్లేదు. లాభాలు రాకపోయినా.. కనీసం పెట్టుబడిని రాబట్టుకోవాలన్న నిర్మాతల ఆలోచన కరెక్టే. కానీ పరిస్థితులు బాగా లేని నేపథ్యంలో బయ్యర్ల కోణాన్ని కూడా వాళ్లు విస్మరించకూడదు. ఈ ఆలస్యం వల్ల సినిమాకు ఇంకా క్రేజ్ తగ్గిపోయి.. ఇంకా రేట్లు తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఇలా ఆలస్యం చేస్తూ పోతే రేప్పొద్దున సినిమాకు ఓపెనింగ్స్ రావడం కూడా కష్టమవుతుంది. ఉన్నంతలో తక్కువ నష్టంతో బయటపడడమే ఉత్తమం అనుకుని.. రీజనబుల్ రేట్లకు సినిమాను అమ్మేయడం మంచిదనే చర్చ ఇండస్ట్రీలో జరుగుతోంది.

# పాకిస్తాన్ లో 'దంగల్' గుట్టు విప్పేసిన అమీర్ ఖాన్!



అమీర్ ఖాన్ కథానాయకుడిగా నటించిన దంగల్ ప్రపంచ వ్యాప్తంగా ఎంత పెద్ద విజయం సాధించిందో తెలిసిందే. కుస్తీ పోటీ నేపథ్యంలో తెరకెక్కిన గొప్ప చిత్రమిది. బలమైన భావోద్వేగంతో నితష్ కుమార్ పండిచిన ప్రతీ సన్నివేశం షెభాష్ అనిపిస్తుంది. అందుకే అంత గొప్ప విజయం సాధించింది. భారతీయ చిత్ర పరిశ్రమలోనే భారీ వసూళ్లు సాధించిన చిత్రంగా బాక్సాఫీస్ వద్ద రికార్డు సృష్టించింది. 2000 కోట్ల వసూళ్లతో ఇండియాన్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర రాసింది. ఇప్పటికీ ఆ రికార్డు అంతే పదిలంగా ఉంది. ఆ రికార్డును కొట్టే ప్రయత్నాలు టాలీవుడ్ చేస్తున్నా పనవ్వడం లేదు. ఈ సినిమా ఒక్క చైనాలోనే వందల కోట్ల వసూళ్లను రాబట్టడంతోనే ఈ ఫీట్ సాధ్యమైంది. అయితే ఈసినిమా అప్పట్లో పాకిస్తాన్ లో విడుదల కాలేదు. రిలీజ్ అయితే అక్కడ నుంచి భారీ వసూళ్లు వచ్చేవి. అమీర్ ఖాన్ సినిమాలకు అక్కడ మాంచి డిమాండ్ ఉంది. కానీ రిలీజ్ కాలేదు. దీంతో అక్కడ రిలీజ్ అన్నది సస్పెన్స్ గా మారింది. కారణాలు ఏంటి? అన్నది వరకూ అమీర్ ఖాన్ కూడా రివీల్ చేయలేదు. అయితే తొలిసారి ఈ విషయం గురించి అమీర్ ఖాన్ స్పందించారు. సినిమాలో మన జాతీయ గీతాన్ని, జాతీయ జెండాను తొలగించాలని పాకిస్తాన్ సెన్సార్ సూచించింది. అలా చేయకపోతే వాళ్ల దేశంలో విడుదల చేయలేమన్నారు. వాళ్లు ఆలా చెప్పిన ఒక్క క్షణంలోనే పాకిస్తాన్ లో మా సినిమా విడుదల కాదని వాళ్లకు చెప్పేసాను. అలా చెప్పడానికి క్షణం కూడా ఆలోచించలేదు. నేను అలా చేయడం వల్ల సినిమా వసూళ్ల ప్రభావం చూపు తుందని నిర్మాతలు భావించారు. అయినప్పటికీ భారత్ కి వ్యతిరేకంగా దేనికి మద్దతివ్వనని స్పష్టంగా చెప్పాను అన్నారు. దీంతో ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గా మారాయి. భారత్ పై అమీర్ కు ఎంత దేశ భక్తి ఉన్నది ఈ వ్యాఖ్యలే చెబుతున్నాయంటూ పోస్టులు పెడుతున్నారు.

## ఆ హీరో అంటే చాలా ఇష్టం

సాధారణ ప్రేక్షకులకే కాదు, సినిమాల్లో నటించే హీరోలకీ, హీరోయిన్లకు కూడా అభిమాన నటీనటులుంటారు. అయితే కొంతమంది తమ అభిమాన నటీనటుల గురించి బయటకు చెప్తే మరికొందరు మాత్రం తమ యిష్టాయిష్టాలను మనసులోనే దాచుకుని అభిమానిస్తుంటారు. సౌత్ హీరోయిన్ స్నేహ తాజాగా తనకు ఇష్టమైన హీరో గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడింది. తెలుగు, తమిళ భాషల్లో పలు సినిమాలు చేసి ఎంతో మంది అభిమానుల్ని సొంతం చేసుకున్న స్నేహను అందరూ చాలా ఇష్టపడతారు. పక్కింటి అమ్మాయిలా



కనిపించే స్నేహ ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించింది. తొలి వలపు సినిమాతో తెలుగు సినీ పరిశ్రమకు పరిచయమైన స్నేహ ఆ తర్వాత ప్రియమైన నీకు సినిమాతో సూపర్ హిట్ ను ఖాతాలో వేసుకుంది. ఆ తర్వాత హీరోయిన్ గా స్నేహ వరుస సినిమాలు చేసింది. అందంతో పాటూ మంచి అభినయంతో ఎంతో మందిని ఆకట్టుకున్న స్నేహ ఈ మధ్య సపోర్టింగ్ రోల్స్ లో కనిపిస్తోంది. మొన్నా మధ్య అల్లు అర్జున్ హీరోగా వచ్చిన సన్నాఫ్ సత్యమూర్తి సినిమాలో ఉపేంద్ర భార్యగా కనిపించగా, ఆ తర్వాత వినయ విధేయ రామలో రామ్ చరణ్ కు వదిన పాత్రలో మెరిసింది.

రీసెంట్ గా డ్రాగన్ సినిమాలో డాక్టర్ పాత్రలో కూడా స్నేహ మెరిసింది. రీసెంట్ గా గోట్ సినిమాలో విజయ్ కు భార్యగా నటించి ఆకట్టుకున్న స్నేహ తమిళంలో చాలా మంది స్టార్ హీరోలతో కలిసి వర్క్ చేయగా, వారందరిలో తనకు అజిత్ అంటే ఇష్టమని తెలిపింది. విజయ్, కమల్, సూర్య, అజిత్, ప్రశాంత్, ధనుష్ తో కలిసి నటించిన స్నేహకు మీ ఫేవరెట్ హీరో ఎవరనే ప్రశ్న రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో ఎదురవగా తనకు అజిత్ అంటే ఇష్టమని చెప్పింది. ప్రస్తుతం సినిమాల ఎంపిక విషయంలో జాగ్రత్తగా ఉంటున్న స్నేహ ఎంతో ఆచితూచి వ్యవహరిస్తుంది.

## 38 ఏళ్లు తేడా.. ఓకేనా మృణాల్?

యంగ్ హీరోయిన్స్, అప్‌కమింగ్ హీరోయిన్స్ సీనియర్ హీరోలతో నటించేందుకు ఒకింత వెనకడుగు వేస్తున్నారు. స్టార్ హీరోలు అయితే, కథ డిమాండ్ చేస్తే, భారీ పారితోషికం డిమాండ్ చేస్తే తప్ప సీనియర్ హీరోల సినిమాల్లో యంగ్ హీరోయిన్స్ నటించేందుకు ఆసక్తి చూపించడం లేదు. ఇటీవల ఒక తెలుగు స్టార్ హీరోల సినిమాలో ఒక హీరోయిన్ నటించేందుకు గాను ముందు నో చెప్పిందని, కానీ భారీ పారితోషికం ఆఫర్ చేయడంతో ఓకే చెప్పిందనే పుకార్లు షికార్లు చేశాయి. కానీ కొందరు హీరోయిన్స్ మాత్రం ఎంత స్టార్‌డం ఉన్నా కొందరు సీనియర్ హీరోలతో నటించాలని కోరుకుంటూ ఉంటారు. తమ అభిమాన హీరోలు వారు అని, వారితో ఒక్క సినిమా చేసే అవకాశం వచ్చినా చాలని అంటూ ఉంటారు. తాజాగా హీరోయిన్ మృణాల్ ఠాకూర్ ఒక ఇంటర్వ్యూలో అదే తరహా వ్యాఖ్యలు చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. మృణాల్ ఠాకూర్ మాట్లాడుతూ తనకు చిన్నప్పటి నుంచి కమల్ సర్ అంటే చాలా అభిమానం, ఆయన సినిమాలు చాలా చూశాను, చాలా కాలం నుంచి ఆయనతో నటించాలని ఉంది. ఆయన సినిమాలో చిన్న పాత్ర లభించినా చాలు అన్నట్లుగా మృణాల్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. ఈ మధ్య కాలంలో సీనియర్ హీరోలు వయసుతో సంబంధం లేకుండా



హీరోయిన్స్‌తో రొమాన్స్ చేస్తున్నారు. ఇటీవల కమల్ హాసన్ థగ్ లైఫ్ లో చేసిన రొమాన్స్ వివాదాస్పదం అయింది. మీ వయసులో కనీసం సగం కూడా లేని అమ్మాయితో ఇలా రొమాన్స్ చేయడం ఎంత వరకు కరెక్ట్ అంటూ కొందరు ప్రశ్నించారు. ఇదే తరహా ప్రశ్న బాలీవుడ్ సూపర్ స్టార్ ఆమీర్ ఖాన్‌కి సైతం ఎదురు అయింది. కూతురు వయసు ఉన్న అమ్మాయిని మీ సినిమాలో హీరోయిన్‌గా ఎలా నటింపజేస్తారు అంటూ ప్రశ్నించిన వారు చాలా మంది ఉన్నారు. దాని ఆయన స్పందించారు కూడా.. ఏఐ టెక్నాలజీతో తన వయసు తగ్గించారు అన్నట్లుగా చమత్కరించాడు. మొత్తానికి సీనియర్ హీరోలకు హీరోయిన్స్ పెద్ద సమస్యగా ఉన్న సమయంలో మృణాల్ ఠాకూర్ అలా మాట్లాడటం చర్చనీయాంశం అయింది. ప్రస్తుతం కమల్ ఒక భారీ యాక్షన్ సినిమాకు రెడీ అవుతున్నాడు. ఆ సినిమాలో మృణాల్ ఠాకూర్ ను ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయని, సీనియర్ హీరోలకు హీరోయిన్స్ లోటు ఉన్న సమయంలో మృణాల్ వంటి స్టార్ హీరోయిన్స్ ఇచ్చిన ఆఫర్‌ను ఏ దర్శకుడు వదిలి పెట్టడు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536